మనం

జనం కోసం.. అక్షర యజ్ఞం..

HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM | AMARAVATHI | TIRUPATI | KURNOOL | TADEPALLIGUDEM | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA

హైదరాబాద్ సంపుటి: 2 • సంచిక: 102 • పేజీలు:12+16 • వెల: రూ.5 సోమవారం • 12-3-2018 www.manamnews.com /manamnews



సౌరశక్తితో సౌభాగ్యం

- సమ్మతమైన నిధులతో ప్రాజెక్టులు
- తక్కువ ఖర్చుతో విద్యుత్ తయారీ
- పర్యావరణానికి ముప్పు ఉండదు
- 2022 నాటికి 175 గిగావాట్ల విద్యుత్
- ప్రపంచంలో సౌరవిప్లవం రావాలి
- ఐఎస్ఏ సదస్సులో ప్రధాని మోదీ
- హాజరైన 23 దేశాల అధినేతలు

7లో..



మాజీ ప్రధానిపై బూటు..

- విదేశాంగ మంత్రిపై ఇంకు
- పాక్‌లో సామాన్యుడి నిరసనలు

7లో..



టీఆర్ఎస్ రాజ్యసభ అభ్యర్థులతో ముఖ్యమంత్రి కేసీఆర్, ఎంపీలు జితేందర్ రెడ్డి, కె.కేశవరావు

ఈడే ఉంటా

ఈడనుంచే జాతీయ రాజకీయాలు చేస్త

- ఎవరూ అపోహ.. ఆందోళన చెందొద్దు
- సిట్టింగు ఎమ్మెల్యేలందరికీ టికెట్ల చాన్స్
- 106 స్థానాలు కచ్చితంగా గెలుస్తం
- మూడుసార్లు పక్కాగ సర్వే చేయించిన
- రాజ్యసభలో మూడు స్థానాలు మనవే
- టీఆర్ఎస్ఎల్పీ భేటీలో సీఎం కేసీఆర్
- రాజ్యసభకు పార్టీ అభ్యర్థుల ప్రకటన

6లో..

డబుల్ ధమాకా!

బీసీలకు రెండు రాజ్యసభ సీట్లు

- జోగినపల్లి, లింగయ్య, బండ ప్రకాశ్ ఖరారు
- టీఆర్ఎస్ఎల్పీ భేటీలో సీఎం కేసీఆర్ ప్రకటన
- బీసీల ఓట్లే లక్ష్యంగా పావులు కదిపిన సీఎం

6లో..

నేటి నుంచే 'బడ్జెట్' అసెంబ్లీ

అసెంబ్లీ, మండలి సంయుక్త సమావేశం

ఉభయసభలను ఉద్దేశించి గవర్నర్ ప్రసంగం

- 15న బడ్జెట్ ప్రవేశపెట్టనున్న ప్రభుత్వం
- చివరి బడ్జెట్‌లో సాగుకు పెద్దపీట
- అస్త్రశస్త్రాలతో విపక్షాలు సంసిద్ధం
- ఎదుర్కొనేందుకు రెడీగా పాలకపక్షం

హైదరాబాద్, మార్చి 11 (మనం ప్రతినిధి):

రాష్ట్రంలో సభా సమరానికి రంగం సిద్ధమైంది. సోమవారం నుంచి శాసనసభ, శాసనమండలి బడ్జెట్ సమావేశాలు మరింత వేడి పుట్టించనున్నాయి. నాలుగేళ్లలో ఏం చేశారంటూ అధికార పక్షంపై ముప్పేట దాడి చేసేందుకు ప్రతిపక్షాలు సిద్ధమైపోతే.. ఎదురుదాడితో దీటుగా సమాధానం ఇచ్చేందుకు పాలక పక్షం సన్నద్ధమైంది. ఉదయం 10 గంటలకు గవర్నర్ ఉభయ సభలను ఉద్దేశించి ప్రసంగిస్తారు. గవర్నర్ ప్రసంగం తరువాత తొలిరోజు సమావేశాలు వాయిదా పడతాయి. ఆ తరువాత బీఏసీ సమావేశం ఉంటుంది. ఈ సమావేశంలో సభ ఎన్నిరోజులు జరిగేది నిర్ణయిస్తారు. ఈ నెల 15న ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్ బడ్జెట్‌ను ప్రవేశపెడతారు. మండలిలో ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి మిగతా 6లో..



ఇదీలోకం!



ముహూర్తం

శ్రీహేవిళంబి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, ఫాల్గుణమాసం, బహుళపక్షం, తిథి: దశమి ఉ.11.14 తదుపరి ఏకాదశి; నక్షత్రం: పూర్వాషాఢ ఉ.9.32 తదుపరి ఉత్తరాషాఢ; వర్జ్యం: సా.6.31–8.19; దుర్ముహూర్తం: మ.12.02–12.50, మ.3.12–4.00; రాహుకాలం: ఉ.7.59–9.28; అమృతఘడియలు: తె.4.09–5.58; శుభసమయం: ఉ.6.00–7.00.

సూర్యోదయం: 6.30

సూర్యాస్తమయం: 6.22

వాతావరణం

తెలుగు రాష్ట్రాల్లో సోమవారం వాతావరణం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. పగటి ఉష్ణోగ్రత స్వల్పంగా పెరుగుతుంది. రాత్రి ఉష్ణోగ్రతలో మార్పులేదు. గంటకు 14 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉంది.

గరిష్ఠ ఉష్ణోగ్రత: 37 డిగ్రీలు

కనిష్ఠ ఉష్ణోగ్రత: 20 డిగ్రీలు

గాలిలో తేమ: 42 శాతం



జీవితకాలం షి జిన్‌పింగే

చైనాలో రాజ్యాంగ సవరణ

- 2/3 మెజారిటీతో పార్లమెంటు ఆమోదం
- మావో జెడాంగ్ తర్వాత ఇదే తొలిసారి
- దేశంలో సమష్టి నాయకత్వం అంతం
- అవినీతిని సహించే ప్రసక్తి లేదు
- మీ కుటుంబం విషయంలోనూ జాగ్రత్త
- వాళ్లు అవినీతి చేసినా కఠిన చర్యలు
- అధికారులకు జిన్ పింగ్ హెచ్చరిక

బీజింగ్, మార్చి 11:

చైనాలో నామమాత్రంగా ఉండే పార్లమెంటు సంచలన నిర్ణయం తీసుకుంది. తమ దేశ అధ్యక్షుడికి కాలపరిమితిని ఎత్తేసే ప్రతిపాదనను మూడింట రెండొంతుల మెజారిటీతో ఆమోదించింది. దాంతో ప్రస్తుత అధ్యక్షుడు షి జిన్ పింగ్ జీవితకాలం ఆయనే అధ్యక్షుడిగా ఉండటానికి వీలు కుదిరింది. చైనా కమ్యూనిస్టు పార్టీ వ్యవస్థాపకుడు మావో జెడాంగ్ తర్వాత మిగతా 6లో..

రైతన్న 'మహా'గ్రహం



అకాల వర్షాలతో అప్పులపాలైన తమను ఆదుకోవాలంటూ మహారాష్ట్ర రైతాంగం కదం తొక్కింది. రుణమాఫీ చేస్తానన్న హామీని అమలు చేయాలని కోరుతూ చేపట్టిన మహాపాదయాత్ర ఆదివారం ముంబయి చేరింది. ఈ నెల 6న నాసిక్‌లో మొదలైన 180 కిలోమీటర్ల యాత్రలో మహిళా రైతులతో పాటు తొంభై ఏళ్ల వృద్ధులు కూడా పాల్గొన్నారు. వామపక్షాల ఆధ్వర్యంలో ముంబై ఆగ్రా జాతీయరహదారి పొడవునా సాగిన యాత్రలో అడుగు కదిపిన వేలాది మంది రైతులు రోడ్లపైనే తిని.. ఎక్కడ కాస్త జాగా కనిపిస్తే అక్కడే నిద్రించారు. సోమవారం జరగనున్న అసెంబ్లీ ముట్టడిలో మరి కొంతమంది రైతులు వచ్చి చేరతారు. 7లో..

13న బంద్ వాయిదా

ఇంటర్ విద్యార్థులను దృష్టిలో పెట్టుకుని నిర్ణయం

- మద్దతు ప్రకటించిన వారందరికీ కృతజ్ఞతలు
- 19న మహా ధర్నా: మందకృష్ణ మాదిగ



హైదరాబాద్, మార్చి 11 (మనం ప్రతినిధి):

ఎస్సీ వర్గీకరణ డిమాండ్‌తో ఎమ్మార్పీఎస్ ఈ నెల 13వ తేదీన తలపెట్టిన బంద్ వాయిదా పడింది. ఇంటర్ విద్యార్థులను దృష్టిలో పెట్టుకుని బంద్‌ను వాయిదా వేస్తున్నామని ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మందకృష్ణమాదిగ ప్రకటించారు. పార్శిగుట్టలోని సంఘం కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పరీక్షల నేపథ్యంలో ఇంటర్ విద్యార్థులకు రవాణా ఇబ్బందులు తలెత్తకుండా మిగతా 6లో..



కమలమ్మకు నివాళులు అర్పిస్తున్న తమ్మినేని వీరభద్రం తదితరులు

సాయుధ పోరాట యోధురాలు కమలమ్మ కన్నుమూత

పురుషులకు దీటుగా పోరాడిన వీరనారి

- తన పాటలతో గిరిజనులను ఉత్తేజపర్చిన ధీశాలి
- కొంతకాలంగా అస్వస్థత.. ఆస్పత్రిలో కన్నుమూత
- 2016లో 'మహిళా అవార్డు'తో సత్కరించిన సర్కారు

6లో..



సిలబస్‌లో మతగ్రంథాలకూ చోటివ్వండి

- **అప్పుడే పిల్లల్లో పరమత సహనం: మేనకగాంధీ**



న్యూఢిల్లీ, మార్చి 11: విద్యార్థుల్లో పరమత విశ్వాసాల పట్ల సహనం పెంపొందించేందుకు సిలబస్‌లో అన్ని మతాలకు స్థానం కల్పించాలని కేంద్ర మంత్రి మేనకాగాంధీ పేర్కొన్నారు. దీంతోపాటు నైతిక విలువలకు సంబంధించి ప్రత్యేక తరగతులు నిర్వహించాలన్నారు. ఈమేరకు కేంద్ర మానవ వనరుల మంత్రిత్వ శాఖకు ఆమె సూచించారు. దేశంలోని పలు ఇతర మతాల గురించి చదువుకోవడం వల్ల పిల్లల్లో మతపరమైన ద్వేషభావాలు పెంపొందే ప్రమాదం ఉండదని మంత్రి అభిప్రాయపడ్డారు. ఇందుకోసం పాఠశాల స్థాయిలోనే వారితో వివిధ మతాలకు చెందిన పుస్తకాలను చదివించడం మంచిదని పేర్కొన్నారు. దీనివల్ల పరమత సహనం పెరగడంతో పాటు తన మతాన్ని గౌరవించినట్లే ఇతర మతాలనూ గౌరవిస్తారని మేనక గాంధీ వివరించారు. ఈమేరకు సెంట్రల్ అడ్వైజరీ బోర్డ్ ఆఫ్ ఎడ్యుకేషన్(సీఏబీఈ) నిర్వహించిన ఇటీవలి సమావేశంలో మహిళ, శిశు సంక్షేమ శాఖ మంత్రి మేనక పేర్కొన్నారు.

జీఎస్టీని చెత్తబుట్టలో పడేయాలి

- వ్యవసాయ రంగాన్నీ పలకరించండి
- యువతకు కమల్ హాసన్ పిలుపు



ఈరోడ్, మార్చి 11: దేశమంతా ఒకే పన్ను విధానమంటూ తీసుకొచ్చిన జీఎస్టీని చెత్తబుట్టలో పడేయాలంటూ కమల్‌హాసన్ పేర్కొన్నారు. జీఎస్టీతో అన్నిరంగాల్లోని అన్ని వర్గాలు ప్రభావిత మయ్యా యని తెలిపారు. నోట్ల రద్దు మంచిదే అయినా.. అమలు చేసిన విధానం సరికాదని ఆయన తప్పుబట్టారు. ఈమేరకు ఈరోడ్ జిల్లా పర్యటన సందర్భంగా కమల్ గోబిశెట్టిపాళ్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇంజనీరింగ్, మెడిసిన్‌లపైనే దృష్టి పెట్టకుండా వ్యవసాయ రంగంవైపు కూడా చూడాలని యువతకు పిలుపునిచ్చాడు. వ్యవసాయ భూములు యువతకోసం ఎదురు చూస్తున్నాయని, సాగులో వస్తున్న టెక్నాలజీని అందిపుచ్చుకుని వ్యవసాయం చేయాలని కోరారు. చేనేతకు ప్రసిద్ధి గాంచిన గోబిశెట్టిపాళ్యంలో ఇప్పుడంతా వృద్ధులే నేత పనిలో ఉన్నారన్నారు. కాబట్టి యువత కూడా ఆ బాధ్యతలు చేపట్టాలని చెప్పారు. ఉన్నపళంగా రాష్ట్రంలో మద్యాన్ని నిషేధించలేమని, ప్రజలు దానిపై గట్టిగా నిర్ణయించుకుంటేనే అది సాధ్యమన్నారు. ఒకేసారి మద్య నిషేధాన్ని అమలుచేస్తే ప్రజలు వేరే చెడు అలవాట్లవైపు మళ్లే ప్రమాదముందని కమల్ హాసన్ ఆందోళన వ్యక్తం చేశారు.

సీనియర్ సంపాదకుడు
రంజన్ రాయ్ మృతి



న్యూఢిల్లీ, మార్చి 11: సీనియర్ జర్నలిస్టు రంజన్‌రాయ్(57) శనివారం కన్నుమూశారు. కొన్నేళ్లుగా ఆయన కేన్సర్‌తో బాధపడుతున్నారు. రంజన్‌రాయ్ కుటుంబ సభ్యులు, స్నేహితుల సమక్షంలో ఆదివారం ఉదయం అంతిమ సంస్కారాలు జరిగాయి. వార్తా సంపాదకునిగా వృత్తి జీవితంలో తనకంటూ ప్రత్యేక స్థానం సంపాదించుకున్న రంజన్‌రాయ్.. టైమ్స్ న్యూస్ నెట్‌వర్క్(టీఎన్ఎన్) చీఫ్‌గా పని చేశారు. అంతేకాక ఆ సంస్థ పత్రిక టైమ్స్ ఆఫ్ ఇండియా నేషనల్ ఎడిటోరియల్ బోర్డులో సభ్యుడుగా ఉన్నారు. 1982లో న్యూఢిల్లీలోని ది ప్రెస్ ట్రస్ట్ ఆఫ్ ఇండియా(పీటీఐ)లో ట్రైనీగా రంజన్‌రాయ్ తన జర్నలిస్టు జీవితాన్ని ప్రారంభించారు. పీటీఐ ఎడిటర్ ఇన్ చీఫ్ విజయ్ జోషితో పాటు పలువురు పాత్రికేయులు రంజన్‌రాయ్ మృతి పట్ల సంతాపం తెలియజేశారు. రంజన్‌రాయ్‌కు తల్లిదండ్రులతో పాటు భార్య ఓ కుమారుడు ఉన్నారు.

నేడు గుత్తా బాధ్యతల స్వీకరణ

- **కార్యక్రమానికి హాజరుకానున్న సీఎం కేసీఆర్**



హైదరాబాద్, మార్చి 11(మనం ప్రతినిధి): రైతు సమన్వయ సమితి రాష్ట్ర అధ్యక్షుడిగా నల్లగొండ పార్లమెంటు సభ్యుడు గుత్తా సుఖేందర్‌రెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించనున్నారు. హైదరాబాద్ బషీర్‌బాగ్ లోని వ్యవసాయ శాఖ కమిషనర్ కార్యాలయం లో సోమవారం సాయంత్రం నాలుగు గంటలకు ఈ కార్యక్రమం జరుగుతుంది. రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్‌తో పాటు పలువురు రాష్ట్ర మంత్రులు ఈ కార్యక్రమానికి హాజరవుతారని సమాచారం. ఈ కార్యక్రమ అనంతరం రైతు సమన్వయ సమితి కార్పొరేషన్ పాలకమండలితో సమావేశం కానుంది. గుత్తా సుఖేందర్‌రెడ్డి 1954, ఫిబ్రవరి 2న నల్లగొండ జిల్లా చిట్యాల మండలం ఉరుమడ్ల గ్రామంలో జన్మించారు. బీఎస్సీ పూర్తి చేసిన ఆయన విద్యార్థి ఉద్యమాల్లో చురుగ్గా పాల్గొనేవారు. చదువుకునే రోజుల్లో హైదరాబాద్‌లోని నానక్‌రామ్ భగవాన్ దాస్ సైన్స్ కాలేజీలో విద్యార్థి సంఘానికి ప్రధానకార్యదర్శిగా పని చేశారు. 1981లో ఉరుమడ్ల గ్రామంలో వార్డు సభ్యుడిగా, 1984లో చిట్యాల మండల వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడిగా నియమి తులయ్యారు. 1992లో వ్యవసాయ సహకార పరపతి సంఘం చైర్మన్‌గా గెలుపొందారు. అనంతరం నల్లగొండ– రంగారెడ్డి జిల్లాల పాల ఉత్పత్తిదారుల సంఘం(మదర్ డెయిరీ) అధ్యక్షుడిగా గెలుపొందారు. 1995 నుంచి 1999 వరకు రాష్ట్ర పాడి ఉత్పత్తిదారుల అభివృద్ధి సమాఖ్య చైర్మన్‌గా పని చేశారు. 1998లో జాతీయ పాడి ఉత్పత్తిదారుల అభివృద్ధి మండలి డైరెక్టర్‌గా ఉన్నారు. 1999లో టీడీపీ తరపున నల్లగొండ ఎంపీగా పోటీ చేసి గెలిచారు. తిరిగి 2009లో కాంగ్రెస్‌లో చేరి అదే స్థానం నుంచి మరోసారి లోక్‌సభకు ఎన్నికయ్యారు. 2014 ఎన్నికల్లోనూ కాంగ్రెస్ తరపు న నల్లగొండ ఎంపీ స్థానం గెలిచారు. అనంతరంటీఆర్ఎస్‌లో చేరారు.

ప్రజల జీవితాలు మారలేదు

- **తెలంగాణ వచ్చినా వలసలు ఆగలేదు**
- **మాయమాటలతో టీఆర్ఎస్ మోసం చేస్తోంది**
- **పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి**



వికారాబాద్, మార్చి 11(మనం న్యూస్): తెలంగాణ వచ్చినా పాలమూరు ప్రజల జీవితాలు మారలేదని, ముంబై, పూణే వంటి నగరాలకు వలస పోతున్నారని పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహ న్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. టీఆర్ఎస్ ప్రభుత్వం మాయమాటలతో ప్రజలను మోసం చేస్తోందని ఆయన ఆరోపించారు. విద్యార్థుల బలిదానాలను చూసి సోనియా గాంధీ తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చారన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో హైదరాబాద్ నుంచి గుల్బర్గాకు నాలుగు లేన్ల రహదారి నిర్మాణానికి ప్రభుత్వం రూ.1300 కోట్లు మంజూరు చేసిందని, వికారాబాద్ నుంచి పరిగి, దోమ, కోస్గి , నారాయణ పేట్ నుండి తిరుపతి, కర్ణాటక వరకు రైల్వే లేన్ ఏర్పాటు చేయాలని నిర్ణయించా రన్నారు. అప్పటి ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్ రెడ్డి ఈ రైల్వే లేన్ కోసం రాష్ట్ర ఖజానా నుంచి 50 శాతం నిధులు కూడా ఇచ్చారన్నారు. అప్పట్లో రైల్వే శాఖ నిర్దేశిత ప్రాంతంలో సర్వే కూడా పూర్తి చేసిందన్నారు. రాష్ట్ర విభజన జరిగి టీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ ప్రాజెక్టులు అటకెక్కాయన్నారు. రైల్వే లేన్‌కు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వంతో ఎన్నిసార్లు చర్చించినా ఫలితం ఉండడం లేదన్నారు. ప్రాణహిత– చేవెళ్ల ప్రాజెక్టు కోసం దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వంద కోట్ల రూపాయలతో సర్వే చేయించారని,టీఆర్ఎస్ ఆ ప్రాజెక్టును ఆపేసింద న్నారు. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం ద్వారా షాద్‌నగర్ నుంచి లక్ష్మి దేవిపల్లికి అక్కడి నుంచి పరిగికి నీరు అందేలా 5000 కోట్ల నిధులతో పనులు ప్రారంభిస్తామని కేసీఆర్ హామీ ఇచ్చారని, ఆ పనులు నేటికీ ప్రారంభం కాలేదన్నారు. పరిగిలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు కలగానే మిగిలిందన్నారు. టీఆర్ఎస్ అధికారం చేపట్టిన తర్వాత పశ్చిమ రంగారెడ్డి జిల్లా అభివృద్ధికి ఎలాంటి చర్యలు లేవన్నారు. గండేడ్ మండలంలో అభివృద్ధి పనులకు రూ.1100 కోట్ల విలు వైన ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపామని రామ్మోహన్‌రెడ్డి చెప్పారు.

బీసీలకు రెండు సీట్లు హర్షనీయం

- **టీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు ధన్యవాదాలు: జాజుల**

హైదరాబాద్ సిటీ, మార్చి 11(మనం ప్రతినిధి): టీఆర్ఎస్ పార్టీ నుంచి ఈ దపా భర్తీ చేస్తున్న పెద్దల సభకు(రాజ్యసభ)ఇద్దరు బీసీ సామా జిక వర్గానికి చెందిన వ్యక్తులకు అవకాశం కల్పించడంపై బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు జాజుల శ్రీనివాస్‌గౌడ్ ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. బీసీలకు మంచి అవకాశం కల్పించిన టీఆర్ఎస్ పార్టీ అధి నేత కేసీఆర్‌కు ఈ సందర్భంగా ఆయన ధన్యవాదాలు తెలిపారు. టీఆర్ ఎస్ పార్టీలో ఎంతో మంది పలుకుబడి ఉన్న వ్యక్తులు ఉన్నప్పటికీ, బీసీ లలో ఉన్న అతిసాధారణమైన పేద కుటుంబాల నుంచి వచ్చిన బడుగుల లింగయ్యాయాదవ్, బండా ప్రకాశ్‌ముదిరాజ్‌లకు అవకాశం కల్పించడం బీసీలను ఆనందానికి గురిచేసిందని శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. బీసీ అభ్య ర్థులపై ఇతర పార్టీల పోటీకి నిలబెట్టకుండా ఏకగ్రీవంగా ఎన్నికయ్యే విధంగా సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

కర్ణాటకలో తెలంగాణ బీజేపీ ఎమ్మెల్యేల ప్రచారం

హైదరాబాద్, మార్చి 11(మనం ప్రతినిధి): కర్ణాటక శాసనసభకు త్వరలో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో తెలుగు ఓటర్లు ఉన్న ప్రాంతాలపై తెలంగాణ బీజేపీ నేతలు దృష్టి పెట్టారు. పార్టీ ఆదేశాల మేరకు బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్, బీజేఎల్పీ నాయకుడు కిషన్ రెడ్డి ఆయా ప్రాంతాల్లో ప్రచారం నిర్వహిస్తున్నారు. షెడం, కల్‌బుర్గి నియోజకవర్గాల్లో లక్ష్మణ్ శనివారం ప్రచారంలో పాల్గొనగా, గుల్బర్గలో కిషన్‌రెడ్డి ఆదివారం ప్రచారం చేశారు. కాగా బీజేపీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు బషీర్‌బాగ్‌లోని బాబు జగ్జీవన్ రామ్ విగ్రహం నుంచి సోమవారం ఉదయం అసెంబ్లీకి బయలుదేరుతామని ప్రకటించారు.

కారుణ్యం సరే.. మెడికల్ బోర్డు ఎక్కడ?

- **మెడికల్ బోర్డు ఏర్పాటయ్యేదెన్నడో?**
- **వారసత్వ ఉద్యోగాల భర్తీ ప్రక్రియ.. కారుణ్యంపై సింగరేణి ఉత్తర్వులు**
- **స్పష్టత లేదంటున్న కార్మికులు**
- **4 వేల మంది ఎదురుచూపులు**
- **దళారీ వ్యవస్థ ఏర్పాటయ్యే ముప్పు**
- **కార్మిక సంఘాల ఆందోళన**

హైదరాబాద్, మార్చి 11(మనం ప్రతినిధి): సింగరేణి కాలరీస్ కంపెనీలో కారుణ్య నియామకానికి సంబంధించిన ప్రకటనను సింగరేణి యాజమాన్యం విడుదలచేసింది. కార్మికుల వారసులకు కారుణ్య నియామకాల కింద ఉద్యోగాలు కల్పించే విషయంలో త్వరలో ఉత్తర్వులు వెలువరుస్తామని సీఎం పేర్కొన్న ప్రకారంగానే ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ ఉత్తర్వుల కోసం కార్మికులు 17 నెలలుగా ఎదురుచూస్తున్నారని కార్మిక సంఘాల నేతలు పేర్కొన్నారు. ఎట్టకేలకు ఉత్తర్వులు విడుదలయ్యాయని సంతోషిస్తుంటే.. స్పష్టత కొరవడిన కారణంగా పలు సందేహాలు వ్యక్తమవుతున్నాయని ఆరోపించారు. ఆరో వేతన సవరణ ఒప్పందం మేరకు ఉద్యోగి మృతి చెందినా, అనారోగ్యం కారణంగా విధులు నిర్వహించలేని స్థితిలో ఉన్నా ప్రత్యామ్నాయంగా ఆ కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించనున్నారు. గతంలో మాదిరి గానే వైద్యపరంగా అనారోగ్యంతో విధులు నిర్వహించలేని కార్మికుల వారసులకు ఉద్యోగం కల్పించే విధంగా ఉత్తర్వులు వెలువరించారు. ఈ ఉత్తర్వు కాపీలు తెలుగులో లేకపోవడంతో మరింత గందరగోళం నెలకుంటోందని కార్మిక నేతలు ఆరోపిస్తున్నారు. ఈ ఉత్తర్వులను గనులు, డిపార్ట్‌మెంట్ నోటీసు బోర్డులలో తెలుగులో వేయాలని కార్మికులు డిమాండ్ చేస్తున్నారు.

1996 నుంచి ఎదురుచూపులు..

సింగరేణిలో వారసత్వ ఉద్యోగాల అమలుకోసం 1996 నుంచి కార్మికులు ఎదురుచూస్తున్నారు. తెలంగాణ ప్రభుత్వం వచ్చిన తర్వాత వారసత్వ ఉద్యోగాల ప్రక్రియను అమలు చేస్తామని ముఖ్యమంత్రి కేసీఆర్ హామీ ఇచ్చారు. దీనికి అనుగుణంగా 2016 అక్టోబరు 6న వారసత్వ ఉద్యోగాల అమలుకు ఉత్తర్వులు జారీచేశారు. దరఖాస్తులు స్వీకరిస్తున్న సమయంలో గతేడాది ఫిబ్రవరిలో ఓ నిరుద్యోగి కోర్టులో పిటిషన్ వేయడంతో న్యాయస్థానం ఈ ప్రక్రియకు బ్రేక్ వేసింది. దీంతో వారసత్వ ఉద్యోగాలకోసం ఎదురుచూస్తున్న కార్మికుల్లో నిరాశ ఎదురైంది. ఈ పరిణామంతో వారసత్వ ఉద్యోగ కల్పనను అమలుచేసే అంశంపై న్యాయనిపుణుల సలహా తీసుకోవాలని సీఎం కేసీఆర్ సింగరేణి యాజమాన్యానికి సూచించారు.



స్పష్టత కరవు

మెడికల్ బోర్డులో దాదాపు దరఖాస్తు చేసుకున్న వారందరికీ అవకాశం కల్పించేలా యాజమాన్యం చర్యలు చేపట్టింది. మెడికల్ అన్‌ఫిట్‌గా ప్రకటించేందుకు 16 రకాల వ్యాధులను పరిగణలోకి తీసుకున్నట్లుగా తెలిసింది. ఆయా వ్యాధుల్లో ఏదైనా ఓ వ్యాధితో బాధపడుతున్న కార్మికుడికి ఈ పథకం వర్తింపజేయనున్నట్లు తెలిపింది. వీరు కారుణ్య నియామకాలకు ప్రత్యేకంగా దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరంలేదని వివరించింది. కార్మికులు తాము విధులు నిర్వహించలేని పరిస్థితులో ఉన్నట్లు దరఖాస్తు చేసుకుంటే వైద్య పరీక్షలకు రిఫర్ చేస్తారు. పూర్తిగా పనిచేయలేని పరిస్థితిలో కార్మికుడు ఉన్నట్లు వైద్యులు గుర్తించి వైద్యపరంగా ధ్రువీకరించిన తర్వాత అతని వారసుడికి ప్రత్యామ్నాయ ఉద్యోగం కల్పిస్తారు.

ఎవరెవరు అర్హులు..?

న్యాయపరంగా దత్తత తీసుకున్న కుమారుడికి, మహిళా డిపెండెండ్లకు, భర్త/భార్య, అవివాహిత కూతురు, కొడుకు, తమ్ముడు, వితంతు కూతురు, వితంతు కోడలు, అల్లుడు ఉద్యోగానికి అర్హులుగా యాజమాన్యం పేర్కొంది. ఎన్‌సీడబ్ల్యు 6ఏలో ఈ విషయాలు పొందుపర్చి ఉన్నాయి.

ఇప్పటికే 4 వేల దరఖాస్తులు..

అనారోగ్యంతో బాధ పడుతూ విధులు నిర్వహించలేని కార్మికుడు మెడికల్ బోర్డుకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంది. కార్మికుడు పని చేసే గని, విభాగం ద్వారా వైద్య పరీక్షలకోసం వైద్య మండలికి నివేదించనున్నారు. అందులో కార్మికుడు విధులు నిర్వహించలేడని నిర్ధారణ అయితే వారసుడికి కారుణ్య నియామకం కింద ఉద్యోగం కల్పించనున్నారు. కారుణ్య నియామకాల కింద ఉద్యోగాలు కల్పించే వారసులకు భూగర్భ గనిలో బదిలీ వర్కర్ కింద విధులు కల్పించనున్నారు. అదేవిధంగా మహిళలైతే ఉపరితలంపై బదిలీ వర్కర్ విధులు కేటాయించనున్నారు. ప్రస్తుతం సింగరేణిలో 4 వేల మంది వరకు కారుణ్య నియామకాలకోసం ఎదురుచూస్తున్నారు. ఇప్పటికే మెడికల్ బోర్డుకు దరఖాస్తు చేసుకుని ఏడాదిగా నిరీక్షిస్తున్నారు. ఇందులో సుమారు 900 మంది వైద్య పరీక్షల కోసం ఎదురుచూస్తున్నారు. వీరితో పాటు చాలామంది ఉద్యోగులు అనారోగ్య సమస్యలతో విధులు నిర్వహించలేని స్థితిలో ఉన్నారు. అక్టోబరు 2016లో సీఎం కేసీఆర్ ప్రకటించిన వారసత్వ ఉద్యోగాల ప్రకారం చాలామంది కార్మికులు తమ వారసులకు ఉద్యోగాలు వస్తాయని ఆశపడ్డారు. కోర్టు తీర్పుతో అవి నిలిచి పోయాయి. మెడికల్ బోర్డు నిబంధనల ప్రకారం అన్‌ఫిట్ కావాలంటే రెండేళ్ల సర్వీస్ తప్పనిసరి. దీంతో దాదాపు 1200 మంది కార్మికులు అర్హత కోల్పోతున్నారు. సర్వీస్ వయసు కనీసం ఆరు నెలలు పెడితే చాలా మందికి ప్రయోజనం కలిగేదని కార్మికులు పేర్కొంటున్నారు. కాగా, ప్రస్తుత ఉత్తర్వులు, నిబంధనల ప్రకారం మెడికల్ బోర్డు నిర్వహిస్తే కొద్దిమంది మాత్రమే అన్‌ఫిట్ అయ్యే అవకాశం ఉంది. మెడికల్ బోర్డు ప్రారంభమైతే దళారులకు కొదువ ఉండదని, రాజకీయ జోక్యం పెరుగుతుందని, పైరవీలు చేయించుకున్న వారే అన్‌ఫిట్ అయ్యే అవకాశం ఉందని ఇఫ్టూ జాతీయ అధ్యక్షులు సాధినేని వెంకటేశ్వర్‌రావు ఆరోపిస్తున్నారు.


మల్లన్నసాగర్‌తో.. ఐదు జిల్లాల్లో పచ్చదనం!

- **సీఎం కూడా ముంపు బాధితుడే**
- **నిర్వాసితులకు ఇండ్లు కట్టిస్తాం: హరీశ్‌రావు**



తున్కిబొల్లారం సభలో మాట్లాడుతున్న మంత్రి హరీశ్ రావు

గజ్వేల్, మార్చి 11(మనం న్యూస్): మల్లన్నసాగర్, కొండపోచమ్మ ప్రాజెక్టులు పూర్తయితే ఐదు జిల్లాల్లో వ్యవసాయానికి ఢోకా ఉండదని రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు పేర్కొన్నారు. మల్లన్నసాగర్ ప్రాజెక్టు ద్వారా 7లక్షల ఎకరాలకు, కొండపోచమ్మ సాగర్ ద్వారా 2.85 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. ప్రాజెక్టుల నిర్మాణంలో గ్రామాలు, భూములు కోల్పోయిన నిర్వాసితులకు గజ్వేల్ మండలం ముత్రాజ్‌పల్లిలో 1046 గృహాలు, ములుగు మండలం తుక్కిబొల్లారంలలో 1700ల డబుల్ బెడ్‌రూం ఇళ్లకు మంత్రి శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయా గ్రామాల్లో నిర్వహించిన భూ నిర్వాసితుల సమావేశాల్లో మంత్రి మాట్లాడుతూ నిర్వాసితుల సాయం మరువలేనిదన్నారు. వీరి త్యాగంవల్లే తెలంగాణ రాష్ట్రం కరువు కాటకాల బారిన పడకుండా వ్యవసాయ రంగంలో అగ్రగామిగా మారుతుందన్నారు. నిర్వాసితులను ప్రభుత్వం కడుపులో పెట్టుకొని చూసుకుంటుందన్నారు. సీఎం కేసీఆర్ కూడా భూ నిర్వాసితుడేనన్నారు. భూములు పోగొట్టుకున్న రైతన్నల బాధలు ముఖ్యమంత్రికి తెలుసని సకల సౌకర్యాలు, హంగులతో డబుల్ గృహాలు నిర్మాణం చేసి అందిస్తామన్నారు. ఆరు నెలల వ్యవధిలో ఈ డబుల్‌గృహాలను పూర్తిచేసి గృహప్రవేశం చేయిస్తామన్నారు.



2019లో కాంగ్రెస్ ఖేల్ ఖతం

- తెలంగాణలో అధికారం చేపడతాం
- బీజేపీ నేత, కేంద్ర మంత్రి హన్స్‌రాజ్ గంగారామ్



సభలో మాట్లాడుతున్న హన్స్‌రాజ్ గంగారామ్

నిజామాబాద్, మార్చి11(మనం న్యూస్): రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ ఖేల్ ఖతమ్ అవుతుందని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి హన్స్‌రాజ్ గంగారామ్ అన్నారు. నిజామాబాద్ జిల్లా బోధన్‌లోని అంబేద్కర్ చౌరస్తా వద్ద ఆదివారం నిర్వహించిన భారీ బహిరంగ సభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో మరే రాష్ట్రానికి ఇవ్వని విధంగా గత నాలుగేళ్లలో కేంద్రం తెలుగు రాష్ట్రాలకు నిధులు ఇచ్చిందన్నారు. ఈ ఘనత ప్రధాని మోదీకే దక్కుతుందన్నారు. రైతు సమస్యల పరిష్కారం కోసం నిజామాబాద్ బీజేపీ నాయకులు జగిత్యాల జిల్లా ముత్యంపేట వద్ద పాదయాత్ర ప్రారంభించారు. తొమ్మిది రోజులుగా సాగుతున్న ఈ యాత్ర ఆదివారం బోధన్ చేరింది. యాత్రలో పాల్గొన్న నేతలను మంత్రి హన్స్‌రాజ్ గంగారామ్ అభినందించారు. 2019 ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ విజయం సాధించి అధికారం చేపడుతుందన్నారు. రాష్ట్ర సమస్యలను పరిష్కరించేందుకు సీఎం కేసీఆర్ కేంద్ర ప్రభుత్వాన్ని సంప్రదించాలని సూచించారు. రైతు సంక్షేమం బీజేపీ పాలనతోనే సాధ్యమన్నారు. తెలంగాణలో అనేక రైల్వే పనులు ప్రారంభించామన్నారు. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి లక్ష్యంగా బీజేపీ పని చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకుడు లక్ష్మణ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ధర్మపురి అరవింద్, మాజీ ఎమ్మెల్యే యెండల లక్ష్మినారాయణ, మురళీధర్ గౌడ్, నిజామాబాద్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు పల్లె గంగారెడ్డి, కార్యదర్శి అడ్లూరి శ్రీనివాస్, ఇతర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉగాదికి.. మినీ ప్రగతి భవన్లు

- **ప్రారంభోత్సవానికి సంసిద్ధం**
- **31 నియోజకవర్గాల్లో నిర్మాణం పూర్తి**
- **మార్చి చివరినాటికి మరో 20 రెడీ**
- **ఇంకా 13 చోట్ల మొదలవ్వని పనులు**



హైదరాబాద్, మార్చి 11(మనం ప్రతినిధి): శాసన సభ్యుల నివాస గృహాలు ప్రారంభానికి సిద్ధమవుతున్నాయి. మొదటి అంతస్తులో నివాసం, గ్రౌండ్ ఫ్లోర్‌లో క్యాంపు కార్యాలయం ఉండేలా నిర్మించిన ఈ లగ్జరీ భవంతుల్లోకి ఉగాది నుంచి ఎమ్మెల్యేలు అడుగిడనున్నారు! ఒక్కోటి రూ.కోటి వ్యయంతో నిర్మితమవుతున్న ఈ భవంతుల్లో ఆధునిక సౌకర్యాలన్నీ ఉండేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఉగాదినాటికి ఇవి ప్రారంభోత్సవానికి సంసిద్ధం కానున్నాయి. అధికార పార్టీకి చెందిన ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న పరకాల నియోజకవర్గంలో సకల హంగులతో నిర్మించిన భవంతిని ఈ నెల 2న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రారంభించారు. ఇలాంటి డూప్లెక్స్ భవనాలనే రాష్ట్రవ్యాప్తంగా 104 నియోజకవర్గాల్లో నిర్మించతలపెట్టారు. ఇప్పటికే 31 నియోజకవర్గాల్లో నిర్మాణ పనులు పూర్తయ్యాయి. నిర్మాణ పనులు పూర్తయిన ఆ 31 భవంతులకు చకచకా తుది మెరుగులు దిద్దుతున్నారు. మరో 20 నియోజకవర్గాల్లో భవంతుల నిర్మాణాలు పూర్తికావస్తున్నాయి. ఈ నెల చివరినాటికి ఈ 20 భవంతుల అందుబాటులోకిరానున్నాయి. జూలై నాటికి మరో 24 అందుబాటులోకి వస్తాయని సంబంధిత అధికారులు వెల్లడించారు. మరో 16 చోట్ల పనులు వేగం పుంజుకుంటున్నాయి. వీటిని దసరా నాటికి పూర్తి చేస్తామని అధికారులు చెబుతున్నప్పటికీ ఆ పరిస్థితి కనిపించడంలేదు. మంత్రి తుమ్మల సొంత జిల్లా ఖమ్మం(ఉమ్మడి)లో, ఆయన ప్రత్యేక శ్రద్ధ పెట్టడంతో మొత్తం 10 నియోజకవర్గాలకుగానూ, కొత్తగూడెం, మధిర మినహా 8 నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేల క్యాంపు కార్యాలయాల నిర్మాణాలు పూర్తయ్యాయి.

13 చోట్ల ఆరంభమే కాలేదు..

ప్రతిపక్ష పార్టీల ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహిస్తున్న 5 నియోజకవర్గాలు సహా 13 చోట్ల నేటికీ పనులే మొదలవలేదు. అధికారులు భూమి సేకరించిన చోట ఎమ్మెల్యేలు అసంతృప్తి వ్యక్తంచేయడం, ఎమ్మెల్యేలు చెప్పిన చోట అధికారులు అంగీకరించకపోవడంతో పనులు అటకెక్కాయి. నల్లగొండ జిల్లా నకిరేకల్ నియోజకవర్గంలో అధికారులు భూమి సేకరించి పిల్లర్ల కోసం గుంతలు తవ్వాక, ఆ ప్రాంతంలో నిర్మాణానికి స్థానిక ఎమ్మెల్యే అభ్యంతరం తెలపడంతో పనులు నిలిచిపోయాయి. ఇలా ఆయా కారణాలతో కొడంగల్, నాగార్జునసాగర్, వనపర్తి, గద్వాల, ఎల్బీనగర్ సహా పెద్దపల్లి, కరీంనగర్, జనగామ, బాల్కొండ, వరంగల్(తూర్పు), కూకట్‌పల్లి, మహబూబ్‌నగర్, దేవరకద్ర నియోజకవర్గాల్లో పనులు ప్రారంభంకాలేదు. నకిరేకల్ లాంటి కొన్ని చోట్ల పునాదులు, పిల్లర్ల దశలోనే నిర్మాణాలు నిలిచిపోయాయి.

మినీ ప్రగతి భవనం ప్రత్యేకతలు

నివాస అంతస్తులో..	గ్రౌండ్ ఫ్లోర్‌లో..
3పడక గదులు	ఎమ్మెల్యే కోసం ప్రత్యేక గది
లివింగ్ రూమ్	సమావేశ మందిరం
డైనింగ్ రూమ్	వీఐపీ లాంజ్
డ్రాయింగ్ రూమ్	వెయిటింగ్ హాల్

ఎమ్మెల్యే పీఏ, పీఎస్, ఇతర సిబ్బంది కోసం ప్రత్యేక గదులు

మందకృష్ణను చంపాలని చూస్తే ఊరుకోం

- ప్రభుత్వం సీబీఐ విచారణ జరపాలి: దయాకర్
- పాలకులే చంపాలని చూస్తున్నారు: మంద కృష్ణ



హైదరాబాద్, మార్చి 11(మనం ప్రతినిధి): ఈ నెల 13న ఎమ్మార్పీఎస్ తల పెట్టిన బంద్‌కు మాల మహానాడు మద్దతు తెలిపింది. ఈ మేరకు మాలమహానాడు అధ్యక్షుడు అద్దంకి దయాకర్, ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగను ఆదివారం ఆయన నివాసంలో కలిసి మద్దతు తెలియజేశారు. ఈ సందర్భంగా దయాకర్ మాట్లాడుతూ మందకృష్ణను చంపాలని ప్రయత్నించిన వారిపై సీబీఐ విచారణ జరిపించాలన్నారు. వర్గీకరణ జరిగితే దళితులందరూ ఐక్యమవుతారనే మంద కృష్ణను చంపాలని ప్రయత్నించినట్టు పేర్కొన్నారు. మందకృష్ణను అంతమొందించాలని ప్రభుత్వం కుట్ర చేస్తుంటే రాజకీయ పార్టీల్లో ఉన్న దళిత నేతలు ఎందుకు నోరు విప్పడం లేదని ఆయన ప్రశ్నించారు.

త్వరలో రాష్ట్రపతిని కలుస్తా.. మందకృష్ణ

ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ మాట్లాడుతూ సమాజంలో అందరూ సమానం అనే భావనను జీర్ణించుకోలేక.. పాలకులే తనను చంపాలని చూస్తున్నారన్నారు. హత్యాప్రయత్నంపై విచారణ చేసే దమ్ము ప్రభుత్వానికి ఉంటే.. తాము అన్ని ఆధారాలతో నిజాన్ని నిరూపిస్తామన్నారు. తనపై జరిగిన కుట్రను మాలలపై నెట్టివేయాలని ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. హత్య కుట్రపై ఏ రాజకీయ పార్టీ నుంచి కనీసం ఖండన కూడా రాలేదన్నారు. తనపై జరిగిన హత్యాయత్నంపై సీబీఐ విచారణ జరిపించేలా ప్రతిపక్షం అసెంబ్లీలో ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని కోరారు. దేశవ్యాప్తంగా ఉన్న దళిత నేతలను హైదరాబాద్ రప్పించి దళితులను అంతమొందించేందుకు జరుగుతున్న కుట్రలను వివరిస్తానని ప్రకటించారు. ఈ విషయంపై రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, ప్రధాని మోదీను త్వరలోనే కలుస్తానని చెప్పారు. 13న బంద్‌ను విరమించుకోవాలని కోరిన మంత్రి కడియం శ్రీహరి.. తనపై జరిగిన కుట్రను ఎందుకు ఖండించలేదని మంద కృష్ణ ఆగ్రహం వ్యక్తం చేశారు.

జూన్ 2 నుంచి రైతు బీమా

- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి పోచారం

హైదరాబాద్, మార్చి 11(మనం ప్రతినిధి): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతులకు వర్తింపజేయనున్న రూ.5లక్షల బీమా పథకాన్ని తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం అయిన జూన్ 2 నుంచి అమలు చేస్తామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి ఆదివారం ప్రకటించారు. ఎల్ఐసీ ప్రతినిధులు, వ్యవసాయ శాఖ అధికారులతో శని వారం నిర్వహించిన సమావేశంలో రైతు బీమా పథకాన్ని ఏప్రిల్ నుంచి అమలు చేస్తున్నట్టు తొలుత ప్రకటించారు. అయితే ఈ తేదీని సవరించామని, జూన్ 2 నుంచి పథకం అమలులోకి వస్తుందని పోచారం పేర్కొన్నారు.

ఉద్యోగాల భర్తీపై ఉమ్మడి ఉద్యమం

- నిరుద్యోగ సంఘాలు, విద్యార్థుల నిర్ణయం
- అసెంబ్లీలో ప్రస్తావించాలని ఆర్.కృష్ణయ్యకు విజ్ఞప్తి



హైదరాబాద్‌సిటీ, మార్చి 11(మనం ప్రతినిధి): తెలంగాణా లో ఖాళీగా ఉన్న 2 లక్షల ఉద్యోగాలు భర్తీ చేయకుండానిర్లక్షం చేస్తున్నందున ప్రభుత్వం పై ఒత్తిడి పెంచాలని నిరుద్యోగ సంఘాల నాయకులు, యూనివర్సిటీ విద్యార్థులు ఎల్‌బీ నగర్ ఎమ్మెల్యే ఆర్.కృష్ణయ్యకు విజ్ఞప్తి చేశారు. ఆదివారం బీసీ భవన్‌లో తెలంగాణ నిరుద్యోగ జాక్ , తెలంగాణ నిరుద్యోగ సంఘర్షణ సమితి , తెలంగాణ నిరుద్యోగ యువజన సంఘం ఉస్మానియా, కాకతీయ, శాతవాహన, తెలుగు యూనివర్సిటీ ,మహాత్మాగాంధీ యూనివర్సిటీ ముఖ్య నేతలు కలసి నిరుద్యోగ సమస్యపై ఉద్యమ ఎజెండాను చర్చించారు .రేపటి నుంచి జరిగే అసెంబ్లీ సమావేశంలో ఉద్యోగాల భర్తీపై ప్రభుత్వాన్ని నిలదీయాలని ఎమ్మెల్యే ఆర్.కృష్ణయ్యకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆర్. కృష్ణయ్య మాట్లాడు తూ ఉద్యోగాల భర్తీపై ఇటు రాష్ట్రం అటు కేంద్ర ప్రభుత్వాలు నిర్లక్ష్య వైఖరి అవలంభిస్తున్నాయని కృష్ణయ్య విమర్శించారు . రాష్ట్రం లో గ్రూపు -1 పోస్టులు 1200 , గ్రూపు -2పోస్టులు 3 వేలు , గ్రూపు -3 పోస్టులు 8 వేలు , గ్రూపు -4 క్లరికల్ ఉద్యోగాలు 36 వేలు ఖాళీలు ఉన్నాయని ఈ సందర్భంగా తెలిపారు. వీటి భర్తీ కోసం నోటిఫికేషన్ విడుదల చేయాలని కోరారు . అలాగే వివిధ ప్రభుత్వ శాఖలలో 6 వేల ఇంజనీరింగ్ పోస్టులు,జూనియర్, డిగ్రీ,ఎయిడెడ్ , యూనివర్సిటీ కాలేజీలలో 10,500 లెక్చరర్ పోస్టులు భర్తీ చేయాల్సి ఉందన్నారు. ఇటీవల నోటిఫికేషన్ జారీచేసిన 8600 టీచర్ పోస్టులతో పాటు అదనంగా ఇంకా 20 వేల టిచర్ పోస్టులు వస్తాయని ఇవిగాక ఆదర్శ పాఠశాలలు ,కస్తూర్బ పాఠశాలలు ఎయిడెడ్ పాఠశాలలు, మరో 8 వేల పోస్టుల భర్తీ చేయవలసియుదన్నారు. కొత్తగా ఏర్పాటైన 21 జిల్లాల్లో 25 డివిజన్లలలో , 125 మండలాలలో 40 శాఖలలో అదనంగా 35 వేల ఉద్యోగాలు అదనంగా అవసరమున్నాయని కృష్ణయ్య పేర్కొన్నారు.

కేంద్ర ప్రభుత్వ ఇదే ధోరణితో ఉద్యోగాలు భర్తీ చేయడంలో పూర్తి శ్రద్ధ కనపర్చడం లేదన్నారు. 72 ప్రభుత్వ శాఖలలో 244 ప్రభుత్వం రంగ సంస్థలలో 14 లక్షల ఉద్యోగాలు భర్తీ చేయకుండ నిర్లక్ష్యం చేస్తున్నారని కృష్ణయ్య మండిపడ్డారు. కీలకమైన రక్షణ శాఖలలో 3.5 లక్షల 10 వేల ఉద్యోగాలు .బ్యాంకులలో 2 లక్షలు , రైల్వేలో 2 లక్షల ఉద్యోగాలు భర్తీ చేయడానికి కేంద్ర ప్రభుత్వం మీద వత్తిడి తేవాలని త్వలలో ప్రధాన మంత్రి నరేంద్ర మోడీని కలువాలని నిర్ణయించామని కృష్ణయ్య తెలిపారు. ఈ సమావేశంలో బీసీ సంక్షేమసంఘం జాతీయ ఉపాధ్యక్షులు గుజ్జ కృష్ణ, బీసీ సంఘం జాతీయ నాయకులు డాక్టర్ ర్యాగ అరుణ్ ,నీల వెంకటేష్, మధుసూధన్ తదితరులు పాల్గొన్నారు.

పెద్ద తలలే టార్గెట్ ?



మావోయిస్టులపై ఉక్కుపాదం ..రాష్ట్ర పోలీసులదే కీలకపాత్ర

- ప్రతీకారేచ్ఛలో అగ్రనేతలు
- టీఆర్ఎస్ నేతలే లక్ష్యమని ప్రకటన
- అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో.. అప్రమత్తమైన పోలీసులు
- భద్రతా ఏర్పాట్లు మరింత కట్టుదిట్టం



హైదరాబాద్, మార్చి 11(మనం ప్రతినిధి): రాష్ట్ర సరిహద్దుల్లోని దండకారాణ్యాన్ని స్థావరంగా చేసుకుని మావోయిస్టులు తెలంగాణలో పూర్వ వైభవం పొందేందుకు చేసిన ప్రయత్నానికి పోలీసులు ఆదిలోనే అడ్డుకున్నారు. సరిహద్దుల్లోని భద్రాద్రి కొత్తగూడెం, భూపాలపల్లి జయశంకర్ జిల్లాలపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. ఏపీ, ఛత్తీస్‌గఢ్, ఒడిసా, జార్ఖండ్, మహారాష్ట్ర పోలీసులతో సమన్వయం చేసుకుంటూ మావోయిస్టులపై ఉక్కుపాదం మోపుతున్నారు. సరిహద్దు రాష్ట్రాల్లో జరిగే ప్రతి భారీ ఎన్‌కౌంటర్ వెనుక రాష్ట్ర పోలీసుల పాత్ర ఉన్నట్లు ప్రచారం జరుగుతుండడం గమనార్హం. ఇక మావోయిస్టు పార్టీలో కీలక నేతల్లో తెలుగు రాష్ట్రాలకు చెందినవారే ఎక్కువ కావడం, పీపుల్స్‌వార్‌లోనూ వారే ప్రధాన పాత్ర పోషిస్తుండడంతో పోలీసులు వారిపైనే గురి పెట్టారు. పెద్ద తలలే టార్గెట్‌గా పావులు కదుపుతున్నట్లు సమాచారం. ఇందులో భాగంగానే మావోయిస్టుల ఎత్తుగడలను ఎప్పటికప్పుడు పసిగడుతూ కౌంటర్ ఇస్తూ వస్తున్నారు. ఈ క్రమంలోనే గతేడాది డిసెంబర్ 6న కాళేశ్వరం ప్రాజెక్టుకు దాదాపు 30 కి.మీ దూరంలోని గడ్చిరోలి జిల్లా సిరోంచిలో ఏడుగురు మావోయిస్టుల ఎన్‌కౌంటర్ జరిగిందనే ప్రచారం ఉంది. ఎన్‌కౌంటర్ జరిగిన ప్రదేశానికి సమీపంలోనే మహారాష్ట్ర పోలీస్ ఉన్నతాధికారులతో రాష్ట్ర పోలీస్ బాస్ రహస్య సమావేశాన్ని నిర్వహించారు. సమావేశం జరిగిన కొద్ది రోజుల్లోనే ఈ ఎన్‌కౌంటర్ చోటు చేసుకున్న దాఖలాలున్నాయి. ఇటీవల తెలంగాణ రాష్ట్రంలోని భద్రాద్రికొత్తగూడెం జిల్లా చర్ల పోలీసు స్టేషన్‌కు సరిహద్దుల్లోని ఛత్తీస్‌గఢ్ ఉసూరు పీఎస్ పరిధిలో అగ్రనేతలు ఆజాద్, హరిభూషణ్, దామోదర్ టార్గెట్‌గా చేసుకుని జరిగిన ఎన్‌కౌంటర్‌లో పది మంది మావోయిస్టులు మృతి చెందారు. ఈ ఎన్‌కౌంటర్‌కు ముందు కొద్ది రోజుల కిందటే (ఫిబ్రవరి 16)భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని కొత్తగూడెంలో తెలంగాణ, ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రాల పోలీస్ ఉన్నతాధికారులు, ఎస్ఐబీ, ఇంటిలిజెన్స్‌శాఖలకు చెందిన ముఖ్యులు రహస్య సమావేశాన్ని నిర్వహించటం గమనార్హం. 2015 మార్చి 28న శృతి, సాగర్ అనే ఇద్దరు మావోయిస్టులను వరంగల్ జిల్లా తాడ్వాయి అటవీ ప్రాంతంలో ఎన్‌కౌంటర్‌లో మరణించారు. ఈ ఎన్‌కౌంటర్ పట్ల ప్రజాసంఘాలతో పాటు పలు రాజకీయ పార్టీలు నిరసన వ్యక్తం చేశాయి. దీంతో సరిహద్దుల్లోనే ఎన్‌కౌంటర్లకు శ్రీకారం చుట్టే విధంగా రాష్ట్ర పోలీస్, ఎస్ఐబీ అమలుచేస్తోందనే ప్రచారం ఉంది. భారీ ఎన్‌కౌంటర్లు తెలంగాణలో జరిగితే మావోయిస్టుల బలం ఇక్కడ పెరిగిందనే సంకేతాలు ప్రజల్లోకి వెళ్లే ప్రమాదం ఉందని, సరిహద్దుల్లోనే ఎన్‌కౌంటర్లకు ప్రాధాన్యం ఇస్తున్నారనే సమాచారం. కాగా మావోయిస్టు తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి హరిభూ షణ్, ఆజాద్, దామోదర్ తప్పించుకోవటాన్ని పోలీసులు జీర్ణించుకోలేక పోతున్నారు. ఇందులో భాగంగానే ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్రాలకు చెందిన యాంటీ నక్సలైట్ విభాగాల నిఘా అధికారులతో రాష్ట్ర అధికారులు రహస్యంగా సమావేశమైనట్టు సమాచారం.

అసెంబ్లీ సమావేశాలు.. అప్రమత్తం

సోమవారం నుంచి బడ్జెట్ సమావేశాలు ప్రారంభం కానున్నాయి. ఇప్పటికే టీఆర్ఎస్ నేతలను లక్ష్యంగా చేసుకున్న ట్టుగా మావోయిస్టు అధికార ప్రతినిధి హెచ్చరించారు. కాగా ఇటీవల జరిగిన ఎన్‌కౌంటర్ ప్రాంతం నుంచి తప్పించుకున్న ముఖ్య నేతల కదలికలపై పోలీసులు నిఘా పెట్టినట్టుగా సమాచారం. తెలంగాణలో పట్టున్న హరిభూషణ్, జగన్, దామోదర్, ఆజాద్‌లను మట్టుపెట్టడమే లక్ష్యంగా ఎస్ఐబీ నిఘా బృందాలు దృష్టి సారించినట్టుగా ప్రచారం సాగుతోంది. మరోవపైపు ఇటీవలి ఎన్‌కౌంటర్‌కు ప్రతీకారం తీర్చుకునేందుకు మావోయిస్టులు యత్నించవచ్చనే అనుమానంతో పోలీసులు అప్రమత్త మయ్యారు. అసెంబ్లీ సమావేశాలకు భద్రతను పెంచారు. ప్రజా ప్రతినిధుల రాకపోకల సమయంలో బందోబస్తును భారీగా ఏర్పాటు చేస్తున్నట్టు సమాచారం.

దండకారుణ్యంలో దర్జాగా రాకపోకలు

ఇటీవల ఉత్తర తెలంగాణలోని ఖమ్మం, భద్రాద్రి, భూపాలపల్లి జయశంకర్, మహబూబాబాద్, ఆదిలాబాద్ జిల్లాల్లో మావోయిస్టుల కదలికలు పెరిగాయని పోలీసులు గుర్తించారు.

ఆయా జిల్లాల్లో పోస్టర్లు వేయటం, కరపత్రాలు పంచారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఇద్దరిని ఇన్‌ఫార్మర్ల పేర ఎన్‌కౌంటర్ చేయటం, పలు వాహనాలను దహనం చేయటంతో పోలీసులు మావోయిస్టుల కదలికలపై నిఘా పెంచారు. మావోయిస్టులు భారీ సంఖ్యలో దండ కారణ్యం నుంచి వచ్చి దర్జాగా వెళ్లిపోవటాన్ని పోలీసులు జీర్ణించుకోలేకపోయారు. పక్కా ప్రణాళిక వేశారు, భారీ ఎన్‌కౌంటర్‌కు తెరలేపారు. ఈ క్రమంలోనే దండ కారణ్యంపై పోలీసులు డేగకన్ను వేశారు. ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు తర్వాత ఛత్తీస్‌గఢ్ నుంచి మావోయిస్టుల రాకపోకలు పెరిగినట్టుగా పోలీసులు గుర్తించారు. అప్రమత్తమయ్యారు. నక్సల్స్ కదలికలపై పక్కా నిఘా పెట్టారు. మావోయిస్టులకు సేఫ్‌జోన్‌గా భావిస్తున్న భద్రాద్రి కొత్తగూడెం, భూపాలపల్లి జయశంకర్ జిల్లాలు, సరిహద్దు అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌తో మావోయిస్టుల కంచుకోటలో పోలీసులు చొచ్చుకెళ్లినట్లయింది.

బంద్ వాయిదా వేయండి

- 13న ఇంటర్మీడియట్ పరీక్ష ఉంది
- ఎస్సీ వర్గీకరణకు టీఆర్ఎస్ కట్టుబడి ఉంది
- మూడుసార్లు ప్రధాని అపాయింట్‌మెంట్ కోరాం
- కేంద్రానికి వర్గీకరణ చేసే ఉద్దేశం లేనట్టుంది
- ఎట్టి పరిస్థితుల్లో ఆ రోజు పరీక్ష నిర్వహిస్తాం
- విద్యార్థుల కోసం నిమిషం నిబంధన సడలిస్తాం
- రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి



హైదరాబాద్, మార్చి 11(మనం ప్రతినిధి): ఈ నెల 13న ఎమ్మార్పీఎస్ తలపెట్టిన బంద్‌ను వాయిదా వేసుకోవాలని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రి కడియం శ్రీహరి కోరారు. మినిస్టర్ క్వార్టర్స్‌లోని ఆయన నివాసంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 13వ తేదీన ఇంటర్ ఫస్టీయర్ విద్యార్థులకు రసాయన శాస్త్ర పరీక్ష ఉందని, లక్షల మంది విద్యార్థులు పరీక్ష రాస్తారని, బంద్ ప్రకటనతో విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారని కడియం అన్నారు. బంద్ నేపథ్యంలో పరీక్ష వాయిదా వేయాలని భావించామని, 14వ తేదీన శ్రీరామనవమి ఉండడంతో అది సాధ్యం కాలేదని ఆయన చెప్పారు. ఎస్సీ వర్గీకరణకు రాష్ట్ర ప్రభుత్వం, టీఆర్ఎస్ కట్టుబడి ఉన్నాయని ఆయన స్పష్టం చేశారు. వర్గీకరణ కోసం ఇప్పటికే అసెంబ్లీలో ఏకగ్రీవ తీర్మానం చేశామని, ఆ తీర్మాన పత్రాన్ని ప్రధానమంత్రికి అందజేశామని తెలిపారు. అనేక సార్లు లేఖలు రాశామని, అఖిలపక్షాన్ని ఢిల్లీ తీసుకెళ్లేందుకు మూడుసార్లు ప్రధాని అపాయింట్‌మెంట్ అడిగామని, ఆయన నుంచి స్పందన రాలేదని కడియం చెప్పారు. ఈ పార్లమెంట్ సమావేశాల్లోపే ఎస్సీ వర్గీకరణ, ముస్లిం, గిరిజన రిజర్వేషన్ల కోసం ఢిల్లీలో తెలంగాణ ప్రజాప్రతినిధులతో కలిసి ధర్నా చేయాలనుకుంటున్నామని చెప్పారు. కనీసం వర్గీకరణను తెలంగాణ వరకు పరిమితం చేసేందుకు అంగీకరించాలని అడగనున్నట్టు పేర్కొన్నారు. కేంద్రానికి వర్గీకరణ చేసే ఉద్దేశం లేనట్టుందని ఆయన అన్నారు. తెలంగాణ ప్రభుత్వం వర్గీకరణకు కట్టుబడి ఉందని, ఈ నేపథ్యంలో బంద్‌కు పిలుపునిచ్చిన ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగతోపాటు వారికి సహకరించే రాజకీయ పార్టీలు, విద్యార్థి సంఘాలు తెలంగాణ భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని బంద్ వాయిదా వేయాలని మంత్రి విజ్ఞప్తి చేశారు. బంద్ వాయిదాకోసం కాంగ్రెస్ నేతలు జానారెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, బీజేపీ లక్ష్మణ్, ఇతర నేతలతో మాట్లాడినట్టు చెప్పారు.

విద్యార్థులు ఆందోళన చెందొద్దు..

ఈనెల 13న పరీక్షల కోసం అన్ని ఏర్పాట్లు చేశామని, విద్యార్థులు ఆందోళన చెందొద్దని మంత్రి కడియం శ్రీహరి తెలిపారు. పోలీసులు, ఆర్టీసీ అధికారులతో మాట్లాడామని, విద్యార్థులు ఎలాంటి అనుమానాలు పెట్టుకోకుండా పరీక్షలకు సిద్ధం కావాలని సూచించారు. విద్యార్థులు ఎవరైనా పరీక్షలకు హాజరుకాకుండా నష్టపోతే దానికి ఎమ్మార్పీఎస్ బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. బంద్ నేపథ్యంలో ఇంటర్ పరీక్షలకు విధించిన నిమిషం నిబంధనను సడలిస్తామని, ఎట్టిపరిస్థితుల్లోనూ పరీక్ష నిర్వహిస్తామని వివరించారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని బంద్ వాయిదా వేసి సహకరించాలని కోరారు.



కడియం శ్రీహరిని కలిసిన ఆర్జేడీ సంఘం నాయకులు

కాంట్రాక్టు అధ్యాపకులకు ఉద్యోగ భద్రత కల్పించాలి

- 12 నెలల వేతనం ఇవ్వడం హర్షణీయం
- ఆర్జేడీ కాంట్రాక్ట్ లెక్చరర్స్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెంకన్న

హైదరాబాద్, మార్చి 11(మనం ప్రతినిధి): రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ జూనియర్ కళాశాల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు లెక్చరర్స్‌కు ప్రత్యేక చట్టం ద్వారా ఉద్యోగ భద్రత కల్పించాలని ఆర్జేడీ కాంట్రాక్ట్ లెక్చరర్స్ సంఘం అధ్యక్షుడు గాదె వెంకన్న కోరారు. ఈ మేరకు విద్యాశాఖ మంత్రి కడియం శ్రీహరినిను వెంకన్న ఆదివారం కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 12 నెలల వేతనం ఇచ్చేందుకు ప్రభుత్వ అంగీకరించడం హర్షణీయమన్నారు. సీఎం కేసీఆర్ గతంలో ఇచ్చిన హామీ మేరకు 12 నెలల వేతనం ఇచ్చేందుకు సూత్రపాయంగా అంగీకరించేందుకు కృషి చేసిన రాష్ట్ర మంత్రులు కడియం శ్రీహరి, హారీశ్‌రావు, మండలి చీఫ్‌విప్ సుధాకర్‌రెడ్డి, విప్ పల్లా రాజేశ్వర్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. కాంట్రాక్టు లెక్చరర్ల కోసం ఈ బడ్జెట్ సమావేశాల్లో ప్రత్యేక చట్టం చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని వెంకన్న కోరారు. 12 నెలల వేతనంతో పాటు డీఏ, హెచ్ ఆర్ఏ, 22 సీఎల్స్, వేతనంతో కూడిన ప్రసూతి సెలవు, 15 రోజుల పితృత్వ సెలవులను కల్పించాలని విద్యాశాఖ మంత్రిని ఆయన కోరారు.

కాంగ్రెస్‌తోనే మహిళా సాధికారత

- బీరంగూడలో మహిళా దినోత్సవం
- ముఖ్య అతిథిగా ఉత్తమ్ హాజరు

అమీన్‌పూర్, మార్చి 11(మనం న్యూస్): రాష్ట్రంలో మహిళలకు ప్రాధాన్యమిచ్చే ఏకైక పార్టీ కాంగ్రెస్ పార్టీనేనని టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. మహిళలకు సాధికారత కల్పించే పార్టీ తమదేనని వివరించారు. ఈమేరకు సంగారెడ్డి జిల్లా బీరంగూడ మల్లిఖార్జున స్వామి ఆలయంలో జరిగిన మహిళా దినోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జ్యోతి ప్రజల్వనచేసి కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం మాట్లాడుతూ.. మహిళలకు రిజర్వేషన్లు కల్పించిన ఘనత కాంగ్రెస్‌దేనన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో మహిళలు దగా పడుతున్నారని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వంలో మహిళలకు ప్రాధాన్యం దక్కకుండా సీఎం కేసీఆర్ చేశారని చెప్పారు. స్త్రీ, శిశు సంక్షేమ శాఖకు పురుషులే మంత్రులుగా ఉండటం సిగ్గుచేటని దుయ్యబట్టారు. మహిళల పట్ల కేసీఆర్ మొసలి కన్నీరు కారుస్తూ, అబద్ధపు మాటలతో మోసం చేస్తున్నారని విమర్శించారు. మహిళా సంఘాలకు కనీస సమావేశాలు ఏర్పాటు చేయడంలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకోసం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన అభహస్తం పథకాన్ని కేసీఆర్ నిర్వర్యం చేశారన్నారు. రాష్ట్రంలో పొదుపు సంఘాలు రూపాయి రూపాయి కూడబెట్టుకుంటుంటే, దానిని ప్రభుత్వం వాడుకుంటుందన్నారు. అసలు తెలంగాణా ప్రత్యేక రాష్ట్రం వచ్చిందంటే అది ఇద్దరు మహిళలతోనే సాధ్యమైందన్నారు. అందులో ఒకరు సోనియా గాంధీకాగా, మరొకరు మీరా కుమార్ అని స్పష్టంచేశారు. త్వరలో రాష్ట్రంలో తిరిగి కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరుతుందని, మహిళలకు మంచి రోజులు వస్తాయన్నారు.



బీరంగూడలో మాట్లాడుతున్న ఉత్తమ్ కుమార్ రెడ్డి

ముందే గుర్తిస్తే కేన్సర్‌ను నయం చేయొచ్చు

- భారీ నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు
- జేఎన్‌టీయూహెచ్ ఆధ్వర్యంలో 3కే రన్

హైదరాబాద్, మార్చి 11(మనం ప్రతినిధి): ప్రాథమిక దశలోని కేన్సర్‌ను గుర్తించడం ద్వారా ఎందరో ప్రాణాలను కాపాడవచ్చని రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖ మంత్రి హారీశ్‌రావు అన్నారు. క్వెస్ట్-2018 జాతీయ సాంకేతికత సదస్సును పురస్కరించుకుని జేఎన్‌టీయూ కంప్యూటర్ సైన్స్ విభాగం విద్యార్థులు కేన్సర్‌పై అవగాహన కోసం ఆదివారం కేబీఆర్ పార్కు వద్ద 3కే రన్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హరీశ్‌రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేన్సర్‌పై ప్రజలకు అవగాహన కల్పించేందుకు జేఎన్‌టీయూహెచ్ విద్యార్థులు, అధ్యాపకులు చేస్తున్న కృషిని ఆయన అభినందించారు. సమాజ హిత కార్యక్రమాలకు ప్రభుత్వం ఎప్పుడు సహకరిస్తుందని ఆయన చెప్పారు. ఎస్సీ కమిషన్ చైర్మన్ ఎ.శ్రీనివాస్ మాట్లాడుతూ, గ్రామాల్లో కూడా ఇలాంటి అవగాహన కార్యక్రమాలు నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జేఎన్‌టీయూహెచ్ వీసీ వేణుగోపాల్ రెడ్డి, ప్రిన్సిపాల్ సాయిబాబారెడ్డి, కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి శ్రీదేవీ, క్వెస్ట్-2018 నిర్వాహకురాలు ఆచార్య హేమలత, ఒమెగా ఆస్పత్రి యాజమాన్యం, సిబ్బంది, పెద్ద సంఖ్యలో వర్సిటీ విద్యార్థులు పాల్గొన్నారు.



కేబీఆర్ పార్కు వద్ద 3కే రన్‌ను ప్రారంభిస్తున్న మంత్రి

గ్లకోమాపై అవగాహన కల్పించాలి

- అంధత్వ నివారణ అందరి బాధ్యత
- వైద్య, ఆరోగ్య,శాఖ మంత్రి లక్ష్మారెడ్డి
- నేటి నుంచి గ్లకోమా వారోత్సవాలు

హైదరాబాద్, మార్చి 11(మనం ప్రతినిధి): గ్లకోమా వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించాలని, అంధత్వ సమస్య పరిష్కారానికి ప్రజలు నడుం బిగించాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ సి.లక్ష్మారెడ్డి పిలుపునిచ్చారు. ప్రపంచ గ్లకోమా దినోత్సవం సందర్భంగా హైదరాబాద్ ఆప్తమాలిజిస్టు అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 17 వరకు గ్లకోమా వారోత్సవాలు నిర్వహిస్తున్నారు.

ఇందులో భాగంగా సెంటర్ ఫర్ సైట్ ఎడ్యుకేషన్ సహకారంతో స్టాప్ తెఫ్ట్-సేవ్ సైట్ లెఫ్ట్ అనే నినాదంతో ఆదివారం హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని ఓ హోటల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి లక్ష్మారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ శాశ్వత అంధత్వానికి దారితీసే గ్లకోమా బాధితుల్లో ఎక్కువ మంది మన దేశంలోనే ఉండడం ఆందోళన కలిగించే అంశం అన్నారు. నలభై ఏళ్లు దాటిన వారికి వారసత్వంగా సంక్రమించే ఈ వ్యాధిని తొలి దశలోనే గుర్తించగలిగితే చికిత్స అందించి నయం చేయవచ్చన్నారు.

ప్రపంచ వ్యాప్తంగా 3 శాతంమంది గ్లకోమా వ్యాధి లక్షణాలతో బాధ పడుతు న్నారని, ఇండియాలో 1.2 కోట్ల మంది ఈ వ్యాధి బారిన పడ్డారని సర్వేలు చెబుతున్నాయని వివరించారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఆస్పత్రుల ఆధునీకరణతో పాటు అత్యాధునిక వైద్య పరికరాలు అందజేస్తోందన్నారు. ఇంటింటికీ వెళ్లి కంటి పరీక్షలు నిర్వహించేలా చర్యలు తీసుకుంటామన్నారు.


సరోజిని కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో

ప్రపంచ గ్లకోమా దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లోని సరోజిని కంటి ఆస్పత్రి ఆధ్యరంలో ఆదివారం జరిగిన అవేర్‌నెస్ వాక్‌ను రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి లక్ష్మారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ అంధత్వ నివారణ అందరి బాధ్యత అన్నారు. హోంమంత్రి నాయిని మాట్లాడుతూ గ్లకోమా వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించగలిగితే వ్యాధిని నిర్మూలించవచ్చ న్నారు. కంటి చూపు పట్ల అశ్రద్ధ వహించరాదన్నారు. గ్లకోమా వారోత్సవాల్లో భాగంగా ప్రతి రోజు పలు కార్యక్రమాలు నిర్వహిస్తామని ఆస్పత్రి సూపరింటిండెంట్ డాక్టర్ రవీందర్‌గౌడ్ చెప్పారు.

ఫేస్ క్లినిక్‌ను ప్రారంభించిన మంత్రి

హైదరాబాద్ బంజార్‌హిల్స్‌లో కొత్తగా ఏర్పాటు చేసిన ఫేస్ క్లినిక్ శాఖను రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి లక్ష్మారెడ్డి ఆదివారం ప్రారంభించారు. ఇటీవల కాలంలో ఫేస్ క్లినిక్స్‌కు ఆదరణ పెరుగుతోందని మంత్రి అన్నారు. ఫేస్ క్లినిక్స్ ఎండీ రఘునాథరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఖైరతాబాద్ ఎమ్మెల్యే చింతల రాంచంద్రారెడ్డి, నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, స్థానిక నేతలు పాల్గొన్నారు.

మన సాహితి



తెలుగు భాషకు ఒక సుగుణం ఉంది. అది చాలా చక్కగా వేలాది సంస్కృత పదాల్ని తనలో స్వాంగీకరణం చేసుకున్నది. తెలుగు భాషా భవనగవాక్షాలు అమరభాషా పవనాల రాకను హాయిగా అంగీక రించాయి. ఒక్క సంస్కృతమే కాదు. ప్రాకృతం, పారసీ, ఉర్దూ, ఆంగ్లం, కన్నడం, తమిళం మొదలైన భాషలకు చెందిన అనేక పదాలు తెలుగు స్వీకరించింది. ఇతరుల నుంచి ఎంత స్వీకరిస్తామో అంత సంపన్నులం అవుతాం. ఆ సంపన్నత తెలుగు భాషకు వుంది. ఈ స్వీకరణగుణం ఆంగ్లానికి అధికం. అందులో పాత ఆంగ్లపదాలతో పా టు ఆంగ్లో సాక్సన్, లాటిన్ గ్రీకు తదితర భాషల పద సంపద వుంది. అందుకే అది ప్రపంచభాష అయింది. ప్రపంచంలోని పలు దేశాల్ని పరిపాలించడం సైతం ఆంగ్ల భాషావ్యాప్తికి ఒక బలమైన కారణం. తెలుగు భాషకు యితర భాషాపదాన్ని స్వీకరించే గొప్పగుణం వుంది కాబట్టే జేబిఎస్ హాల్డేన్ జాతీయభాష కాదగిన గుణసంపన్నత తెలుగుకే వుందని ఎలుగెత్తిచాటినాడు.


తెలంగాణ తెలుగులో సంస్కృతం

తెలుగు భాషకు ఒక సుగుణం ఉంది. అది చాలా చక్కగా వేలాది సంస్కృత పదాల్ని తనలో స్వాంగీకరణం చేసుకున్నది. తెలుగు భాషా భవనగవాక్షాలు అమరభాషా పవనాల రాకను హాయిగా అంగీకరించాయి. ఒక్క సంస్కృతమే కాదు. ప్రాకృతం, పారసీ, ఉర్దూ, ఆంగ్లం, కన్నడం, తమిళం మొదలైన భాషలకు చెందిన అనేక పదాలు తెలుగు స్వీకరించింది. ఇతరుల నుంచి ఎంత స్వీకరిస్తామో అంత సంపన్నులం అవుతాం. ఆ సంపన్నత తెలుగు భాషకు వుంది. ఈ స్వీకరణగుణం ఆంగ్లానికి అధికం. అందులో పాత ఆంగ్లపదాలతో పాటు ఆంగ్లో సాక్సన్, లాటిన్ గ్రీకు తదితర భాషల పద సంపద వుంది. అందుకే అది ప్రపంచభాష అయింది. ప్రపంచంలోని పలు దేశాల్ని పరిపాలించడం సైతం ఆంగ్ల భాషావ్యాప్తికి ఒక బలమైన కారణం.

తెలుగు భాషకు యితర భాషాపదాన్ని స్వీకరించే గొప్పగుణం వుంది కాబట్టే జేబిఎస్ హాల్డేన్ జాతీయభాష కాదగిన గుణసంపన్నత తెలుగుకే వుందని ఎలుగెత్తిచాటినాడు. అయితే, తెలుగులోకి సంస్కృతం నుంచి వచ్చి చేరిన పదాలే ఎక్కువ. తెలంగాణ తెలుగులోనూ ఈ పదాలు తక్కువేమీ కాదు. అయితే ఆ సంస్కృతం మాటలు కొంత రూపం మారివుంటాయి. యథాతథంగా వున్నప్పుడు తత్సమాలు అని పిలుస్తాం. (ప్రాకృతసమాలూ తత్సమాలే!). పదం కాస్త మారితే తద్భవాలూ అంటున్నాం (ప్రాకృతానికీ వర్తిస్తుంది). సాధారణంగా సామాన్య ప్రజానీకం మాట్లాడే మాటల్లో తద్భవాలు అధికం.

'ఏమి ఆకారంరా నీది?' అనే ప్రశ్నలోని 'ఆకారం' సంస్కృతమే! సంస్కృతభాషలో 'ఆటోపం' అనే ఒకపదం వుంది. దీనికి వేగిరపాటు అని అర్థం. అయితే ఈ రూఢ్యర్థాలు భాషలో మారిపోయి అప్పుడప్పుడు వేరే అర్థాలు రావడం కద్దు. ఆటోపానికి పలు కలిసి 'పటాటోపం' అవుతుంది. దీని అర్థం ఆడంబరం, దంభం అని. ఈ పటాటోపం పదం తెలంగాణ ప్రజల వ్యవహారంలో 'పటాతోపం' అవుతుంది. 'ఓ! వాని పటాతోపమే వేరు. పెద్ద బంగ్ల కట్టిండు. ఇంటి ముందర కారు. ఇద్దరు పనిమనుషులున్నరు. మంచి పోషాకు వున్నది (బట్టలు మొదలగు వేషధారణ)... ఈతీరు మాటల్లోని 'పటాతోపం' సంస్కృత పటాటోపం నుంచి వచ్చింది.

ఇంక 'ఆత్మ' అనే పదం గురించి ఎంతైనా చెప్పుకోవచ్చు. ఆత్మ సంస్కృతమే! తెలంగాణలో చాలా ఆత్మీయంగా వున్న పలుకుయిది. 'వానికి ఆత్మ కొట్టుకుంటది చుట్టాల మీద' అనే వాక్యంలోని 'ఆత్మ' అంటే దయగల హృదయం స్పందిస్తుంది అని. 'వీనిది ఆత్మగల్ల పుట్క' అంటే ఎంతో ఆత్మీయతా, ఆప్యాయత కల్గిన మనిషిజన్మ అని అర్థం. అట్లే 'ఆ తల్లిది ఆత్మగల్ల చెయ్యి' అనే వాక్యంలోని 'ఆత్మ'కు దానగుణం కల్గిన, వితరణశీలం వున్న ఉదారహస్తం అని అర్థం. 'వాడి చేతికి ఎముక లేదు' అని దానధర్మాల సందర్భంలో ఆధునిక ప్రమాణభాషలో వాడినట్లుగానే, తెలంగాణలో 'ఆత్మగల్ల చెయ్యి', పెద్ద చెయ్యి అనే అభివ్యక్తులున్నాయి. తెలంగాణలో 'ఆత్మ'కు ప్రేమ అనే అర్థం కూడా వుంది. వారంలో ఏడు రోజులుంటాయని అందరికీ తెలుసు. మొదటి వారం 'ఆదివారం' కదా! దీనికి మరోపేరు 'ఆదిత్య వారం' (భానువారం కూడా వుంది). ఈ ఆదిత్యవారాన్ని తెలంగాణ వాసులు కొందరు 'అయితారం' అంటుంటారు. 'ఆదిత్యవారం'లోని 'వా'లోని 'వ్' పోయింది అయితారంలో 'వా'లోని 'ఆ' అలాగే అయితారంలోని 'తా'తో మిగిలింది. అయితే 'ఆదిత్య'లో వున్న యావత్తు పోయింది. ఆదిత్యలోని 'ఆ' హ్రస్వ 'అ'కారంగా ఆదిలో అంటే మొదట నిలిచింది. ఆదిత్యలోని 'ది'యిగా అవతారమెత్తింది. ప్రజలు పదాల్ని తమకు అనుకూలంగా వుండేందుకు అనేక అవతారాలు ఎత్తింపిస్తారు. మరి ఆదిత్యలోని 'ది' 'యి'గా మారవచ్చా? వచ్చు. 'పదిలం' అనే పదాన్ని మనం ఎంత పదిల పరిచినా అది తెలంగాణలో 'పయిలం' కాలేదు! ఇరు+పది అనే సంధిలో ఇరు+పయి అయి పిదప ఇరువయి అవలేదా తెలుగు భాషలో. ముప్పది, నలుబది, ఏబది, అరువది మొదలైన ఎన్నో ముప్పయి, నలుబై, ఏబయి, అరవైలుగా మారలేదా తెలుగులో. అటువంటి అనేక పరిణామాల ఫలితంగా ఆదిత్యవారం 'అయితారం' అయికూచుంది. అయితేనేం. అది భావప్రకటనకూ, గ్రహణకూ పనికొస్తున్నది. మొదట భాషా లక్ష్యం అదేకదా! 'ఆపతికి సంపతికి అందుతదని మా పొల్లును దగ్గ రోల్లకు యిచ్చి లగ్గంచేసినం', 'ఆపతికి రానోల్లు మనోల్లు ఎట్లయితరు?' మొదలైన వాక్యాల్లోనే 'ఆపతి' పూర్తిగా సంస్కృతంలో 'ఆపత్తి' అంటే విపత్తి, ఆపద. ఆపత్తిలోని చివరి తావత్తు తెలంగాణలో ఊడిపోయింది. అయినా అర్థానికి ఏ ఆపదా రాలేదు. ఒక్క తావత్తు లోపిస్తే కొంప లేమీ అంటుకొని పోవు. యావత్తూ (మొత్తం) లోపించి మూలపదం మారితేనే ఆపద భాషకు. సంస్కృతభాషలోని 'ఆయువు, ఆయుష్యము, ఆయుస్సు' అనే పదాలకు జీవితకాలం అని అర్థం. తెలంగాణలో 'ఆయుషు' వున్నంత కాలమే బతుకుతరు అనే మాట వుంది. కొన్ని ప్రాంతాల్లో 'ఆయుష్షు' కూడా చలామణిలో వుంది. సంస్కృత 'ఆయుస్సు'లోని సకారం తెలంగాణలో 'ష'గా మారింది. ఇంకా కొంతమంది 'ఏదైనా ఆవుసున్నంతవరకే తియ్యంగ్రి' అంటుంటారు. ఈ పదంలో సకారం చక్కగా నిలిచివుంది. కాకుంటే 'యు' 'వు'గా మారివుంది. 'ఆయుస్సు'ను 'ఆయుస్సు' లాగే పలికేంత తీరికా, ఓపికా సామాన్య జనానికి లేవు. వ్యవసాయ పనుల్లో పందిరి గుంజలకు కూడా పనిచేప్పే చెమట ప్రాణులు, పదా ల్ని వున్నవి వున్నట్లుగానే పలికేంత వ్యవధిని ఎక్కణ్ణించి తెచ్చుకో గలరు? అందుకే వాళ్ళనోట 'ఆలస్యం' ఏ ఆలస్యం లేకుండా 'ఆలిశెం'గా మారిపోతుంది. సంస్కృతభాషలోని 'ఆలాపము' తెలంగాణలో 'ఆలాపన' అవుతుంది. ఆలాపం అంటే రాగాన్ని ఆలపించడం. తెలంగాణలో 'ఆలాపన' పాట కచేరీకి సంబంధితం కాదు. వానికి ఒక్కటే ఆలాపన. ఆ పిల్లను బమిసిండు (ప్రేమించాడు). ఆరు నూరైనా నూరు ఆరైనా ఆమెనే చేసుకుంటడట! నిత్తె ఆ పిల్లమీదనే



ఆలాపన...ఇటువంటి వాక్యాల్లోని 'ఆలాపన'కు అర్థం ఎల్లకాలం ఒకే విషయం గురించి ఆలోచించడం - ధ్యాస పెట్టడం. సంస్కృత 'ఆశీస్సు' తెలంగాణలో 'ఆశీర్వచనం'గా మారింది. మామూలు జనం 'తమరు మా పిల్లగానికి ఆశీర్వచనం యిస్తే మంచిగైతది పంతులూ!' అనే తీరు వాక్యం వింటాం. 'ఆశీః', 'ఆశీస్సు' మొదలైనవి బాగా చదువుకున్న వాళ్ళు రాస్తారు- మాట్లాడుతారు- దీవిస్తారు. 'ఆశ్లేషము' అనేది ఒక నక్షత్రం పేరు. ఇది సంస్కృత అకారాంత పుంలింగ నామవాచకం. తెలంగాణలో చాలా చిత్రంగా అది 'అసలేరు' అయింది. 'శ్లే' అనే సంయుక్తం 'సలే' గా విభక్తం అయింది. మూలపదంలో లేని 'ఏరు'ను తమ మాటలోకి తెచ్చుకున్నారు. 'అసలేటి ముసలెడ్లు కట్టుకొని' అనే అంజన్న పాట అందరికీ తెల్సిందే! సంయుక్తాక్షరాల్ని అయితే ద్విత్వాలుగా మారుస్తా రు ప్రజలు, లేదూ విడగొడతారు. వాళ్ళకు కావాల్సింది అనుకూల్యం. అభిప్రాయ సంగ్రహణమే కాక ప్రకటనం. 'ఈ పోరనికి ఇంద్రియం బాగపోతుంది. ఏం రోగమో పాడో మరి!' వాక్యంలోని ఇంద్రియం అంటే పంచేంద్రియాల ముచ్చట కాదు. 'ఇంద్రియం' సంస్కృత నుడి. దీనికి అర్థాలు అనేకం. అందులో ఒకటి రేతస్సు, వీర్యం అని. అదే అర్థంలో బ్రహ్మాండంగా తెలంగాణ ప్రజలు ఆ పదానికి ఏ ఆపదా రానివ్వకుండా వాడడం విశేషం. 'ఇచ్ఛ' అంటే కోరిక, కాంక్ష, వాంఛ, సంస్కృత భాషాపదమే యీ ఇచ్ఛ. ఈ 'ఇచ్ఛ' తెలంగాణ ప్రజావ్యవహారంలో అద్భుతంగా వుంది. 'ఇగో చూడుండ్రి నా ఇచ్ఛ నేను పోత. మీ యిచ్ఛ మీరు పోండ్రి' అని అన్నప్పుడు నా దారిలో నా మానాన, నా సందాన (చందం) నేను పోతాను- మీ బాటలో మీరు వెళ్ళండి అని సారాంశం. అయితే ఈ తెలంగాణ 'ఇచ్ఛ'కు సంస్కృత పదార్థాలు కూడా వున్నాయి. నీ బాటలో నీవు వెళుతున్నావంటే నీ కోరిక, వాంఛ మేరకే వెళతావు కదా! ఎవరి కోరికల మేరకు వారు వారి దారుల్లో వెళతారు. తెలంగాణలో ఈ 'ఇచ్ఛ' పదం బహుళంగా వ్యవహారంలో వుంది. తెలంగాణ వంట యింట్లో కూరగాయలు తరిగేందుకు తప్పని సరిగా 'ఈలపీట' వుంటుంది. దీన్నే ఆధునిక తెలుగు ప్రమాణ భాషలో 'కత్తిపీట' అంటారు. రెండూ ఒక్కటే! 'ఈలపీట' అనగానే, అది అపశబ్దం అన్నట్లు హేళనగా చూడటమే చిక్కు. భాషలో ఏ ప్రాంతం వాళ్ళు వాడుతున్న పదమైనా ప్రతిదీ సాధువే! ఒకటి ఎక్కువా, మరోటి తక్కువా కాదు. మరి 'ఈలపీట' ఆధారం ఏమిటి? అది సంస్కృతంలోని 'ఈళిక' నుంచి వచ్చింది. ఆ పదానికి అర్థం కత్తిపీట, చురకత్తి అనే! వంటింటికి పరిమితం అయినది మాత్రం కత్తిపీట. ఈలపీట సైతం కత్తిలాంటి సముచిత పదం. 'వాడికి పూనకం వచ్చింది. వీనికి దేవుడు పూనిండు. దానికి సిగం వచ్చింది' మాటల్లో వ్యక్తులకు దేవుడు లేదా దేవత ఆవహించడం. తెలంగాణలో పూనకం అనరుగానీ సిగం అంటుంటారు. ఈ సిగానికి సంస్కృతంలోని 'శివం' ఆధారం. ఇంతేగాక కొన్ని ప్రాంతాల్లో 'వానికి ఉగ్రం వచ్చింది' అని వ్యవహరిస్తారు.'ఉ గ్రం' సంస్కృతపదం. ఇది ఆకారాంతం స్త్రీలింగం. దీనికి అర్థం భయంకరం అని.

'వీడు ఉచితార్థంగ పైసలన్ని పాడుచేసుకున్నడు' వాక్యంలోని ఉచితార్థం మొత్తం సంస్కృతమే! ఉచితము అంటే తగినది అని అర్థం. తెలంగాణలోని 'ఉచితార్థంగ' అంటే అనవసరంగా అని భావం. ఉచితార్థంలోని అర్థం అంటే కొరకు అని అర్థం. అంటే ఉచితం కోసం, ఉత్తుత్తిగనే, వట్టిగానే, అనవసరం గానే అనే అర్థచ్ఛాయలున్నాయి యిక్కడ. 'ఉత్తర' అనేది ఆకారాంత స్త్రీలింగ సంస్కృత పదం. దానికి తెలుగు భాషలోని 'ము' ప్రత్యయం చేరి అది కాస్తా 'ఉత్తరము' అవుతుంది. ఇక దానికి అర్థాలు ఉత్తరపు దిక్కు, రేఖ మొదలైన అర్థాలు అందరికీ ఎరుకైనవే! ఇక్కడ మరొకమాట ఉత్తరానికి సంబంధించి. 'వాడు అప్పటి నుంచి ఉత్తరిస్తనే లేదు' అనే తెలంగాణ భాషా వ్యవహారంలోని 'ఉత్తరి చ్చుడు' అంటే జవాబు చెప్పడం, ప్రత్యుత్తరం యివ్వడం, మాట కదపడం, మారుమాట మాట్లాడటం వంటి అర్థస్ఫురణలు అనేకం.

'ఊరికి ఉప్పులం పుట్టినట్లు మోపు అయిండువీడు' ఇందులోని ఉప్పులం ఏమిటి? అది కుక్కగొడుగు. చేతివేళ్ళ ఆకృతిలో భయం గొల్పేరీతిలో వుంటుంది. అది పెరట్లో మొలిస్తే అరిష్టం అని ప్రజల నమ్మకం. ఊరికి ఎవరైనా చేటుకల్గించే పనులు చేస్తున్నప్పుడు పై వాక్యప్రయోగం వుంటుంది. మరి ఈ 'ఉప్పులం' ఎక్కణ్ణించి వచ్చింది. సంస్కృతంలో 'ఉత్పలం' వుంది అంటే కలువ అని అర్థం. కలువకు వున్న రేకుల్లాంటివే ఉప్పలానికీ వుండటం చేత ఆ మాట ఆవిర్భవించేందేమో ఆలోచించవలసి వుంది. పైగా మారోమాట సంస్కృతంలోనే వుంది. అది 'విప్లవం' సమూలమైన మార్పే విప్లవం. ఈ 'విప్లవం' నుంచి కూడా తెలంగాణ 'ఉప్పులం' అయ్యే పరిస్థితి వుంది. బహుశః విప్లవమ్మీద సదభిప్రాయం లేకపోవడం మూలాన చేటు కల్గించే వ్యక్తిని చూసి 'ఉప్పులం పుట్టినట్లు పుట్టిండు' అని వుంటారు. ఇంకా 'ఉప్పు తింటే ఉష్టం - పప్పు తింటే పైత్యం'లోని ఉష్ణం సంస్కృతమే! 'ఉపాయం లేనోడు ఉపాసం ఉంటుడు'లో వున్న ఉపాయ ఉపాసాలు సంస్కృతమే! 'కొద్దిగ నీతో మాట్లాడితే నాకు ఉపశాంతి'లోని ఉపశాంతి అమరమే! బండినిపైకి లేపే జాకీ వంటి పరికరం తెలంగాణలో 'ఉపకారి'గా పిలవబడుతుంది. ఉపకారి సైతం గీర్వాణమే! 'ఉదార్నానికి చెప్పుతున్నగని', 'ఇగ వాడు వుద్దరిస్తడు', 'ఉద్ధార్కం అయినట్లే' వాక్యాల్లోని ఉదాహరణం, తిద్దరించు, తిద్ధారకం సంస్కృతపదాలు. ఉద్ధరించు, ఉద్ధారకం తెలంగాణలో నకారాత్మకంగా ప్రయుక్తం కావడం ప్రత్యేకత.

◆ డాక్టర్ నలిమెల భాస్కర్



కవిత

విసర్గ

ఆఖరికి తలుపు తట్టినా
తొలి పిలుపులానే వినిపిస్తుంది
తాజాగా తయారయి
తమలపాకులతో ఇంటికొచ్చిన
హంతకుడిని తలపిస్తుంది

అంత నిదురలోనూ
మెలుకువ ఎక్కడో కునుకు తీస్తుంటుంది
ఖూని చేసొచ్చినవాడిని దాయడానికే కాదు,
మూడో జామున మూత్రం పోసుకోడానికీ
గోడచాటు మిగలని మైదానాలను
బెజవాడ ఆరాముగా మేస్తుంటుంది

ఎటు తిరిగితే అటు రేగే మంటని
చీరేసే మంచు కత్తి కావాలి
అది తెచ్చిచ్చిన వాడి పేరు ఏదైతేనేం,
ఆకలిగొన్నవాడో..
ఆత్మను అమ్ముకొన్నవాడో..

ఎవరో ఎవరికో ఎందుకు...

కాస్తోకూస్తో పగ, కాల్చేసే సెగ..
తీర్చరులొస్తారులే.. తెగ
నన్ను ఈడ్చుకెళ్లిన నైజానికీ
చుట్టిన చున్నీకే ఉరేసుకొన్న కాలానికీ
చివరిసారి ఎత్తు కోసం ఏడ్చిన తనాలకీ
ఊరేగించిన జనాలకీ
ఏది అడిగితే, అది ఇచ్చేయండి

పోరాటాలనూ, ప్రార్థనలనూ సాగనీయండి
నన్ను మాత్రం,
మీ ఆఖరి ముఖం కోసం గాలించకండి
అది మనిషిదా, పశువుదా అంటూ
దయచేసి బోనెక్కించకండి
ప్లీజ్.. నన్ను నన్నిలా వదిలేయండి.

రివేరా

సందర్భం

21న యానాంలో 'ప్రపంచ కవితా దినోత్సవం'

కవిసంధ్య, డాక్టర్ ఎస్.ఆర్.కె. ఆర్ట్స్ కళాశాల సంయుక్త నిర్వహణలో 21 మార్చిన యానాంలో ప్రపంచ కవితా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ప్రపంచ కవుల చిత్రపటాలు, చేతిరాతల ప్రదర్శన, ఆధునిక కవిత్వంపై జాతీయ సదస్సు, కావ్యసంపుటాల ఆవిష్కరణ, కవిసంధ్య - పానుగంటి కవితల పోటీలలో బహుమతి ప్రదానం, యువ కవి సమ్మేళనాలు వుంటాయి. ఈ కార్యక్రమంలో మల్లాడి కృష్ణారావు, జయరాజ్ డానియల్, వాడ్రేవు సుందర్రావు, ఖాదర్ మొహియుద్దీన్, జి.లక్ష్మీనరసయ్య, రామతీర్థ, యాకూబ్, ప్రసాదమూర్తి, వాడ్రేవు వీరలక్ష్మి తదితరులు పాల్గొంటారు.

\- కవిసంధ్య,
యానాం

'ప్రతిలిపి' సాహిత్య పోటీ

మహిళా ఒక శక్తి, సమస్త సృష్టికి మూలం ఆమె చల్లని గర్భం. ఎన్నో అవరోధాలు మరెన్నో ఆటంకాలు అన్నింటిని తట్టుకొని నిలబడుతున్న నారీమణి. నిజానికి స్త్రీ లేని సృష్టి లేదు కనీసం ఊహించలేము కూడా. అలాంటి మహిళా నేడు పడుతున్న సమస్యల గురించి, విజయం సాధించిన మహిళామూర్తుల గురించి, స్ఫూర్తినిచ్చే రచనలు ఇలా మీకు ఇష్టమున్న మహిళా అంశంతో ప్రతిలిపి సాహిత్య పోటిలకు మీ రచనలు పంపండి. మీ రచనలు పంపడానికి చివరి తేది 25 మార్చి. రచనలు యూనికోడ్ ఫార్మటులో telugu@pratilipi.comకు మెయిల్ చేయగలరు.


\- జాని తక్కెడశిల
7259511956

తాత్వికులకు ఊపిరి పోసిన 'కక్క-సిద్ధి'

పుస్తక సమీక్ష



మనువాద విషాన్ని ఛేదిస్తూ అంటరానిదిగా భావించిన తొలి తాత్వికులైనా మాదిగల జీవన సంఘర్షణలను అక్షరాలుగా మలిచి, తనజాతి సంస్కృతులకు ఊపిరిపోస్తూ రాసిన రచయిత వేముల యల్లయ్య. విభిన్న సంస్కృతులతో తేజోమయంగా వెలుగుతున్న దేశంలో ఎన్నో వైవిధ్యాలకు, విరుద్ధాలకు లోనై కారుచీకటిలో నెట్టివేయబడిన ఈ దేశ నిర్మాతల చెమట చుక్కల్లో మెరుపు తెచ్చిన సాహి త్య సంపదనే 'కక్క', 'సిద్ధి' నవలలు. అను భవాలకు అక్షర రూపమిచ్చిన సాహిత్యమే ప్రజలను అందునా పీడుతులను చైతన్యవంతులను చేస్తూ చరిత్రలో మరణమెరుగని సాహిత్యమౌతుంది. సాహిత్య రంగంలో తన కులానికే కాక తనజాతిని అంటిపెట్టుకుని ఉన్న అనేక జనసమూహాలను సబ్బండ కులాలతో తనజాతి సత్సంబంధాలను ఆయా కులాలు తన కులాన్ని ఎలా వాడుకుని అవమాన పరిచేతీరును సబ్బండ కులాల పుట్టుపూర్వాలను వివరించి రాసిన నవలలే 'కక్క-సిద్ధి'. ఈ రెండు నవలలను ప్రజాశక్తి బుక్ హౌస్ ఒక్కటిగా ముద్రించి అందిండం హర్షణీయం! నవల ప్రక్రియలో తనదైన శైలిలో ముద్ర వేసిన వేముల యల్లయ్య



మొదట రచించిన మాదిగ కక్క జీవితాన్ని పరిశీలిస్తే, కాలజ్ఞాన తత్వబోధిగా పూజలందుకుంటున్న పోతులూరికి తెచ్చిన మొదటి శాస్త్రీయ దృక్పథం కలిగిన శిష్యుడు మాదిగ కక్కడు. తనజాతికి అడుగడుగునా ఎదురైన సవాళ్ళను ఛేదించుకుంటూ తన కులమే ఈ ప్రపంచానికి తత్వాన్ని, మానవీయతను, ప్రజాస్వామిక విలువలను అందించి మూఢత్వంపై సమరశంఖం ఊది మనిషిని మనిషిగా బతకమంటూ వెలివేయబడి న తన చరిత్రను గొప్పదిగా భావించి పెద్దమాదిగతనాన్ని గౌరవంగా స్వీకరిస్తాడు కక్కడు. తల్లికడుపుల ఉన్నప్పుడే (పటేలు పొలం దున్నుతున్న సమయంలో ఎర్రతేలు కరిచి సచ్చిన గాలయ్య)తండ్రిని కోల్పోయిన కక్కడు అనేకానేక విపత్కర పరిస్థితులను ఒరసకు తాతైన పకీరయ్య సాయంతో అధ్యయనం చేస్తాడు. చదువులకు దూ రం చేయబడిన కులజాబితాల్లో మొదటి వరుసలో ఉండే మాదిగలవాడలో అనేక కట్టుబాట్లకులోనై ఉండటం సహజమే కారణం సనాతన సంప్రాదాయ మూఢరచనలు వీరి జీవితాలపై మోపడమే ఈ భూమి మీద మొదటి తాత్వికపరులు మాదిగలే అనుటకు మనం చదువెరగని కక్కని జీవితంలో చూడవచ్చు. తల్లి కలెమ్మకు మళ్ళీ పెండ్లిచేసిన గొప్పవాడు కక్కడు భర్తతోనే చితిల పడేయమన్న సమాజానికి తోడులేని ఆలిని ఆడిపోసుకు తినే మానవ మృగాలకు గొప్ప సందేశం శరీరం ప్రకృతి ధర్మాన్ని పాటించిడంలోనే మానవీయతను చాటుకుంటుందనీ తన కులం పైచాచిక రాతల చట్రంలో ఇరుక్కోలేదనీ రచయిత చెప్పకనే చెప్పిండు.(పేజీ నెంబర్ 32-33) పెదమాదిగ వొతన్ చేబట్టాలనుకున్న కక్కనికి తాత పకీరయ్య కుల చాకిరీ తోలుపనితో మొదలై సబ్బండ కులాలతో ఎటువంటి సంబంధాలు వైరుధ్యాలను చలవిచూడాలనో తెలుసుకుంటడు కక్కడు. మాదిగ బతుకులను సచ్చిన గొడ్ల తునకలను ఆకలితో స్వీకరించి దానినే అస్థిత్వంగా ప్రకటించుకున్న మాదిగల ఆచార సంప్రదాయాలను కళలను, కన్నీళ్లను కళ్ళముందే ఆవిష్కరించారు రచయిత. ఈ నవల ప్రపంచ దృష్టిని ఆకర్షించి కేంబ్రిడ్జి యూనివర్సిటీలో పరిశోధనా గ్రంథంగా నిలిచింది. ఇదే తరహాలో మరొక నవల సిద్ధి. ఆరుగురి ఆడోళ్ళతోడన పుట్టిన ఆఖరిది సిద్ధి. పేదరికం వల్ల తనకంటే ముప్పైయేండ్ల పెద్దవాడైన పాపిగానికి ఇచ్చి పెండ్లి చేస్తరు. మాదిగల కుటుంబాలు నిత్యం తాగుడుతో ఉదయించి పొద్దు గూకే క్రమాన్ని అయినా కుటుంబ బరువును నిలబెట్టుకునే స్త్రీని రచయిత సిద్ధి, ఈమె భర్త పాపయ్య ద్వారా చూపిస్తడు. కాయకష్టం చేసుకునే తమ పిల్లలను ఎలాగైనా చదువించుకోవాలని ఆరాటపడే మాదిగల తల్లిదండ్రుల కష్టాన్ని ఆశతో కూడిన ఆరాటాన్ని మనకు ప్రత్యక్షంగా చూపెట్టారు రచయిత. సిద్ధి కొడుకు సైదిగాడు బడికిపోయిన సందర్భంలో అక్కడి పిల్లలు వీడిని వివక్షగా చూడటం, గూడెంలో తనతోటి ఈడు పోరంగాడ్లంతా జీతాలు ఉండటం వలన ఎదిగే పోరడైనా సైదిగానికి బాల్యం దిగాలుగానే ఉండేది. వేదన భరించిన మాదిగ మనసు కాస్త ప్రేమను ఉన్నతంగానే కోరుకుంటది. సైదిగానికి తనతో పాటు చదివే పటేళ్ళ బిడ్డ పద్మను ప్రేమించాలనుకోవడం, బడిలో ఆకృత్యాలు, అలాగే బడి హెడ్ మాస్టర్‌గా దళితుడైన సత్తయ్యను అగ్రవర్ణాల బెదిరింపుల తీరును, సైద్గాడిని జైలు పాలుచేయడం వీడితోపాటు చదువుకున్న పటేల్ బిడ్డ అదే బడిలో టీచ్చరమ్మ కావడం, సైద్గాడు తిరిగి గ్రామంలోకి వొచ్చి ఊరిని చైతన్యపథంలో నడిపేందుకు కులానికి పీడిత వర్గాలకు అంబేద్కర్ను పరిచయం చేయడం ప్రాంతీయతలో జరిగే దోపిడీకి ప్రాంతీయతపై మమకారాన్ని చాటుతూ తెలంగాణ కోటిరత్నాల వీణంటూ పాటతో నడిపించడం మన చరిత్ర గీ పాతాలలో లేదని వాపోవడం అంబేద్కర్ బాటలో పోరాటాన్ని చూపడం మనకు పుస్తకంలో కనబడుతుంది. మాదిగల జీవన శైలి, వారి తత్వానికి ధైర్యానికి త్యాగాలకు ప్రతీకగా ఈ రెండు నవలలు నిలబడినవి.

◆ వరకుమార్ గుండెపంగు

డిక్షన్ పేరుతో డిక్టేటర్‌షిప్!



ఈ మధ్యకాలంలో రా జకీయాలలో కనిపించే నియంతల ధోరణులు మన తెలుగు సాహిత్యంలో ప్రవేశిస్తున్నాయి. కొద్దికాలంగా ఈ ధోరణులు డిక్షన్ పేరు తో మొదలై డిక్టేటర్‌షిప్‌గా కూడా మారింది. అందుకు తాజా ఉదాహరణ బిక్కి కృష్ణ విడుదల చేసిన 'కవి త్వం-డిక్షన్' వ్యాస సంకలనం కనిపిస్తుంది. ఇందులో ఆధునిక వచన కవిత - నిర్మాణ పద్ధతులు అంటూ నేటి మన కవిత్వంపై కూర్చిన వ్యాసాలు, అనుబంధంగా మరో రెండు ఉన్నాయి. ఈ పుస్తకం అంతటా తాను చెప్పే విషయాలందు నియంత పోకడలే కనిపిస్తు న్నాయి. ఉదాహరణకు 'ప్రతి ఊహ ఒక వ్యూహం' అనే వ్యాసంతో ఒక చోట ఇలా రాశారు. 'చక్కని తెలుగు పదాలు, పద బంధాలు ఉన్నప్పటికి ఆంగ్లపదాలను ఇ రికిస్తే, అదేదో గొప్ప కవిత్వమనుకుంటారని అవసరం లేకు న్నా ఆంగ్లపదాలను కృతకభాషను సృష్టించుకుం టున్నారు' అంటారు బిక్కి కృష్ణ. ఇందుకు మనకు ఒక ఉదాహరణ కూడా చూపాలని అటువైపు ప్రయత్నమే చేయరు. తెలుగు భాషలోకి ఇవాళ వచ్చే ఆంగ్లపదాలు రోజురోజుకీ పెరుగుతున్న దానికి పై సందర్భం ఉదాహరణగా ఉంటుంది. అయితే మీరు ఈ రచనలో ఒక్క వ్యాసం రాయటానికి ఇంగ్లీషు పదాలు ఎన్ని ఉన్నాయో ఎప్పుడైనా లెక్కించారా? కనీసం ఓ యాభై ఆంగ్ల పదాలు అనేకమార్లు దొర్లించేశారు. దీన్ని ఏమంటారు? ఎదుటివారిని తప్పుపట్టే ఆలోచన చేయటంలో కనిపించే నియంతధోరణి తనకు మాత్రం వర్తించదా? ఇలాంటివే ఈ రచన నిండా ఎదురివారిని ఎత్తి పొడవటం, తను మాత్రం అందుకు అతీతంగా లేకున్నా, ఉన్నట్టుగా రాతల్లో కనిపించటం చాలా ఎక్కువ శాతం కనిపిస్తుంది. అందువలన ఏర్పడే గందరగోళాలన్నీ ఇన్నీ కావు. పై వ్యాసంలోనే చివరి వాక్యాలు ఇలా ఉన్నాయి. 'నీ లోపాలు చెప్పేవాడే నిజమైన మిత్రుడు. కవిత్వం లోనూ, జీవితంలోనూ అన్నది మరిచిపోకు' అని ముగించారు. నా ఈ ప్రయత్నం ఇక్కడ నుంచే మొదలైంది. శ్రీశ్రీ మహా ప్రస్థానం నుంచి మాట్లాడటం మొదలుపెట్టి మరో ప్రస్థానంతో శ్రీశ్రీ కవితా డిక్షన్ మారిపోయిందని సెలవిచ్చారు. (ఈ డిక్షన్ అనే మాట ఎన్నిసార్లు వస్తుందో లెక్కేలేదు) అందుకు దారిచూపిన పరీక్షలు పరిస్థితుల ఊసే కనిపించదు. ఊపిరి తీసేసి బొమ్మను చూపటమంటే ఇదే! మహాప్రస్థానం గేయాల పుట్టుకకు ప్రధాన నేపథ్యమైన ఆంగ్రీథర్టీస్‌ను గురించి కేవలం నామమాత్రంగానే ఉచ్చరించినా, మరో ప్రస్థానం గూర్చిగానీ, దాని నేపథ్యాన్ని గురించి నామమాత్రంగా కూడా చెప్పకుండానే భాషలో అభివ్యక్తిలో వచ్చిన మార్పును ఎలా గుర్తించటం చేస్తారో గానీ, శబ్దచిత్రణ కవిత్వం కాదని శ్రీశ్రీ తెలుసుకున్నాడని కృష్ణ రాశారు. మార్పుకు సంబంధించిన మూలాలు శ్రీకాకుళ పోరాటం వైపునే ఉన్నాయి. ఈ విషయాల్ని శ్రీశ్రీనే అనేక సందర్భాలలో చెప్పారు. కీలకమైన ఈ అంశాన్ని ఎలా వదిలేసి 'మార్పు'ను గూర్చి ఎలా ముచ్చటిస్తారు? అలాగే, ఊహకీ వ్యూహనికి ఉన్న వ్యత్యాసాన్ని కూడా అసలు పట్టించుకునే ప్రయత్నమే చేయకుండా పోయారు. అనిర్దిష్ట రూపంలో ఉండేది 'ఊహ' ఒక నిర్దిష్ట రూపంతో కొనసాగేది 'వ్యూహం' దేనికుండే పరిధి దానికి స్పష్టంగా ఉన్నాయి. అయినా, ఇలాంటి పదప్రయోగం చేశారంటే ఆయనలోని గందరగోళాల్ని పాఠకుల ముందుపెట్టి వారినీ గందరగోళం చేసే ప్రయ త్నమే ఇది. ఇలాంటిదే మరొకటి

చర్చ



'రుచికరమైన వంట ను చూడగానే నోట్లో లాలాజలం ఊరినట్టి కవిత్వాన్ని చదవగానే కాసేపైనా ఆశ్చర్యం కలగాలి' అంటారు. ఇదో చౌకబారు విశ్లేషణ కవిత్వంపై ఎటువంటి విశ్వా సాలు లేకుండానే. ఇవాళ మన ముందుకొస్తున్న కవి త్వాన్ని గానీ, కవులనుగానీ అర్థం చేసుకునే ప్రయత్నం చేస్తే, కొన్ని చేదునిజాలు బయట పడతాయి. గారడీ వాని మాటల్లాగా, అల్లిక పని తెలిసిన లేదా నైపుణ్యం ఉన్న వారిలాగా కనిపి స్తారు. నిజాయితితో కనిపించే రచన కనిపించటం చా లా కష్టమైపోతుంది. అన్నింటా ఆశ్చర్యార్థకాలే. ఇంగ్లీ షు చదువుల్లోకి పంపుతూ, మాతృభాషపై కవితలల్లే నైపుణ్యం కనిపిస్తుంది. కవిత్వ నిర్మాణంలో ఉండే అంశాలు, మరీ శుద్ధ మాటల గారడీలుగా కనిపిస్తాయి తప్ప జీవం తొణికిస లాడుతున్నట్టుగా ఈ వ్యా సాలు లేవు. ప్రాణంలేని తనంతో కవిత్వాన్ని తయారు చేసేందుకు ఈ రచన దోహదపడ తుందేమో కాలం చెల్లిన పదాల విన్యా సాలను గూర్చి మళ్ళీమళ్ళీ ఇక్కడ ముచ్చటిం చటం ఉంది. తోటమాలి గిలకబావి కవిత్వపు తాబేలును పైకి లాగటం ఎందుకోఏమో, కవికైనా తెలుసోలేదో! భోజనం ముందు కూర్చొని ఎన్నెన్ని నాజూకులైనా వెళ్ళే మనుషులు న్నారు. కానీ, అసలు భోజనం ఎందుకు చేస్తామో మరిచి పోకూడదుగదా! ఇలా కొనసాగించిన దానికి మరింత వికృత రూపం 'కవిత్వ ముద్రణ ఒక కళాత్మక క్రియ! అనే వ్యాసం. కొత్తగా రాసే కవులు సంకలనా లుగా వారి కవిత్వాన్ని కూర్చే దగ్గర 12 రకాల అంశాలు తప్పక పాటించాలని ఒకవిధంగా శాసించే పద్ధతి లోనే కృష్ణ తన అభిప్రాయాలు వెల్లడించారు. నియంత ధోరణిలో సాగే ఆరోపణలు కోకొల్లలుగా దర్శనమిస్తాయి. కవులు వారి కవర్ పేజీలపై కవుల బొమ్మలు వేయించుకోవటం ఫ్యాషన్ అయిందని వాపోవటం ఎందుకు? మహాప్రస్థానానికి మా గోఖలే గీసిన ముఖ చిత్రం సంగతి ఎలా మర్చిపోయారు? కవర్‌పేజీని 'సింబాలిక్' ఉండాలని మంచి సూచనే చేశారు. కానీ, ఈ పుస్తకానికే వేసిన ముఖచిత్రంలో ఏమాత్రం సింబాలిక్ ఉంది? కవిత్వానికిగానీ, డిక్షన్ అనే పదానికి గానీ ఇందులోని ఏ ఒక్క అంశానికి గానీ దగ్గర సంబంధంతో ఈ ముఖచిత్రం వచ్చిందా? ఇవాళ కవిత్వంగానీ, డిక్షన్ గానీ ఇలా ఉన్నాయని అంటారా సింబాలిక్‌గా. కవితా సంపుటి బ్యాక్ పేజీలో కవి పరిచయం వెయ్యా కూడదట. కవిత్వ పరిచయం ఉంటే, అవి వేసుకొని కవి పరిచయాన్ని లోపలి పేజీల్లో ఉంచాలట. అంటే ముందుమాటల్లో కొంతభాగాన్ని తిరిగి చివరిపేజీలో ముద్రణ చేయటంలో కొత్తగా ఒనగూడేది ఏమిటో గమనిస్తే, పబ్లిసిటీ కోసం మాత్రమే ఇలా చేస్తారు గానీ, మరో ప్రయోజనం అక్కడ ఒనగూడదు. సూచనలు చెయ్యటం తప్పుగాదు కానీ, అవతలి వారిని తక్కువ చేయటం సరికాదు. బిక్కి వాడే పరుష పదాలు, అసందర్భ ప్రేలాపనల మధ్య కూడా అతని కవితాభిమానం గౌరవిద్దాం. ఎవరి స్వేచ్ఛ అయినా, ఎదుటివారిని ఇబ్బంది కలిగించేది కాకుడదు! కవుల్ని, కవిత్వాన్నీ వస్తువుతోనే ప్రేమిద్దాం! విశ్లేషిద్దాం!!

నియంతల్లాంటి విమర్శకుల్నీ ప్రజాస్వామ్య వాదుల్ని చేద్దాం!!!

◆ సజ్జా వెంకటేశ్వర్లు

'ఫాస్ట్‌ఫుడ్' ప్రమాదకరం

భారత్‌లో వినియోగిస్తున్న యాంటిబయోటిక్స్‌ను తొలగించేందుకు బహుళ జాతి సంస్థల (ఎంఎన్‌సీ)కు చెందిన ఫాస్ట్‌ఫుడ్ కంపెనీలు నిరాకరిస్తున్నాయి. యాంటిబయోటిక్స్‌ను తొలగించేందుకు ఎటువంటి నిర్ణీత తేదీని ప్రకటించేందుకు ఈ కంపెనీలు అంగీకరించడం లేదని ఒకసర్వేలో తేలింది. ప్రముఖ ఫాస్ట్‌ఫుడ్ కేంద్రాల్లో విక్రయించే చికెన్ సంబంధిత పదార్థాలు యాంటీ మైక్రోబియాల్ (ఏఎంఆర్) నిరోధకాన్ని కలిగివుంటాయని తమ సర్వేలో తేలిందని ఘజియాబాద్‌కు చెందిన నితిన్ రావత్ తెలిపారు. రోగ నిరోధానికి సంబంధించి వాడు యాంటిబయోటిక్స్‌ను పనిచేయకుండా ఈ మైక్రోబియాల్ పనిచేస్తుంది. ఈ ఏఎంఆర్ వల్ల ఏడాదికి పది మిలియన్ మరణాలు సంభవిస్తున్నాయని సర్వే అభిప్రాయపడింది. 2050 నాటికి 100 ట్రిలియన్ డాలర్ల నష్టం వాటిల్లుతుందని అంచనా. భారత్‌లో రోగాలకు కారణమవుతున్న ఈ ఏఎంఆర్ వల్ల చిన్నపాటి బ్యాక్టీరియా రోగాలను తగ్గించడం కూడా సాధ్యపడడం లేదు. ఏఎంఆర్ అంటువ్యాధులకు కారణమవుతోంది. ఈ వ్యాధుల్ని తగ్గించాలంటే సుదీర్ఘకాలం పడుతోంది. ఫలితంగా ఎక్కువకాలం ఆసుపత్రుల్లో ఉండాల్సిరావడం, అధిక మొత్తంలో డబ్బు ఖర్చుకావడం జరుగుతోంది. భారత్‌లో అత్యంత వేగంగా ఫాస్ట్‌ఫుడ్ సంస్కృతి పెరుగుతుండడం ఆందోళన కలిగించే అంశం. 2015లో ఎఎంఆర్‌పై ప్రపంచ ఆరోగ్యం సంస్థ ఆధ్వర్యంలో ప్రపంచ కార్యాచరణ ప్రణాళికను రూపొందించారు. దీని ఆధారంగా పలుదేశాలు జాతీయ కార్యాచరణను తయారుచేసుకున్నాయి. మనుషులకు ఎక్కువ హాని కలిగించే ఎఎంఆర్ పదార్థాల జాబితాను డబ్ల్యుటిఓ రూపొందించింది. 2016లో ఐక్యరాజ్యసమితి సమావేశం ఎఎంఆర్‌ను నిరోధించే యత్నాలకు అంగీకారం తెలిపింది.

తాడేపల్లి శివరామకృష్ణారావు

కంపెనీ పేరు	భారత్‌లో పరిస్థితి	ప్రపంచవ్యాప్త లేదా అమెరికాలో పరిస్థితి
మెక్‌డొనాల్డ్స్ కన్నాట్ ప్లాజా రెస్టారెంట్స్ ప్రై.లిమిటెడ్, హార్డ్ కాజిల్ ప్రై.లిమి.	ఎలాంటి యాంటిబయోటిక్స్ వాడకం తగ్గించడానికిగానీ, నిలిపివేయడానికి గానీ కట్టుబడి లేవు.	యాంటీ మైక్రోబియాల్‌పై మాంసాహారంలో అదుపు, వినియోగాన్ని నిరోధించడం, అసలు వినియోగించకుండా చూడడం. అమెరికా, కెనడా జపాన్, దక్షిణ కొరియా, ఆస్ట్రేలియా, రష్యా, యూరప్, బ్రెజిల్, చైనా దేశాలో కట్టుబడడం.
పిజ్జా హట్ ఎం రెస్టారెంట్స్ ఇండియా ప్రై.లిమిటెడ్	తగ్గించడానికి, నిరోధించడానికి ఎటువంటి కట్టుబాటు లేదు.	యాంటీ మైక్రోబియాల్‌పై మంచి అవగాహన పెంచడం, చట్టం అనుమతించినప్పటికీ యాంటీ మైక్రోబియాల్‌ను నిరోధించే యత్నాలు.
కెఎఫ్‌సీ ఎం రెస్టారెంట్స్ ఇండియా ప్రై. లిమిటెడ్	తగ్గించడానికి, నిరోధించడానికి ఎటువంటి కట్టుబాటు లేదు.	
టాటా స్టార్ బక్స్ ప్రై. లిమిటెడ్	తగ్గించడానికి, నిరోధించడానికి ఎటువంటి కట్టుబాటు లేదు.	వైద్యపరంగా ఉపయోగించే యాంటిబయోటిక్స్ కోసం తగువిధంగా యాంటిమైక్రోబియాల్‌ను నిరోధించడం అమెరికాకు వీలుగా కట్టుబడివుండడం

అనుసంధానం అనర్థం!



ఇంటర్వ్యూ

నదుల అనుసంధానం వల్ల భవిష్యత్తులో ఆయా రాష్ట్రాల మధ్య కలహాలకు కారణమవుతుందని ప్రముఖ పర్యావరణతేత్త, నీటి యాజమాన్య నిపుణుడు రవి చోప్రా అభిప్రాయపడ్డారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో నదుల అనుసంధానం ప్రక్రియ కొన్ని ఇబ్బందుల నెదుర్కొంటోంది. ప్రభుత్వం ప్రకటించిన నదుల అనుసంధానం పథకం వల్ల సమస్య పరిష్కారం కాకపోగా మరిన్ని సమస్యలకు దారితీస్తుందని ఆయన చెప్పారు. డెహ్రాడూన్‌లోని పీపుల్స్ సైన్స్ ఇన్‌స్టిట్యూట్‌కు ఆయన డైరెక్టర్‌గా ఉన్నారు. న్యూఢిల్లీలోని హిమాలయ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు కూడా! ఆయనతో ఇంటర్వ్యూ వివరాలు...

ప్ర: ఇటీవలి కాలంలో నదుల అనుసంధానం పథకం పునరుద్ధరించబడింది. ప్రస్తుత ప్రభుత్వం వివిధ శాఖలతో ఈ పథకం ఖర్చు అంచనాలు, అధ్యయనాలతో ముందుకెళ్తోంది. విస్తృత ప్రతిపాదికన ఈ పథకం పట్ల మీ అభిప్రాయమేమిటి? మన నదుల్ని నిర్వహించేందుకు ఇది మంచి ఆలోచనేనా?

జ: ఇదంతా హాస్యాస్పదం (జోక్). ఈ పథకాన్ని మొట్టమొదట 1960లో ఎయిర్ లైన్ కెప్టెన్ డస్టర్ ప్రతిపాదించారు. అప్పుడతను పూలదండ కాలువ(గార్లెండ్ కెనాల్)ను ప్రతిపాదించారు. ఉత్తర భారతదేశంలోని గంగ నుంచి దక్షిణ భారతదేశంలోని నదులను అనుసం ధానం చేసేందుకు కాలవల ద్వారా నీటిని పంపిణీ చేయాలన్నది ఆ ప్రతిపాదన. 1960లో దేశంలోనే ప్రఖ్యాత సివిల్ ఇంజినీర్, కేంద్ర మాజీ మంత్రి కెఎల్‌రావు కూడా ఇదే ప్రతిపాదనను చేశారు. గార్లెండ్ కెనాల్‌ను ఆయనే మొట్టమొదటి సారిగా నదుల అనుసంధానం అని వ్యవహరించారు.

ప్ర: ఇది హాస్యాస్పదం అని మీరంటున్నారు. ఈ జోక్ ఎక్కడ మొదలైంది?

జ: మనకిప్పటికే ఒక గార్లెండ్ కెనాల్ ఉంది. దానిపేరే గంగ. హిమాలయాల్లోని నదులన్నింటి నీటిని గంగానది సేకరించి సముద్రంలోకి చేరుస్తుంది. దురదృష్టవశాత్తు ఈ గార్లెండ్ కెనాల్‌ను మనం సక్రమంగా వినియోగించుకోలేక గందరగోళ పరుస్తున్నాం. ఉత్తర భారతం నుంచి దక్షిణ భారతం వరకు, నీరు ఎక్కువగా లభించే చోటు నుంచి తక్కువగా లభించే చోటుకు తరలించాలన్న ఆలోచనే జోక్ అంటే! ప్రస్తుతం ఉత్తరభారతంలోని నదుల్లో రుతుపవనాల సమయంలో నీరు ఎక్కువగా ప్రవహిస్తుంది. వరదలు వస్తుంటాయి. ఇదే సమయంలో దక్షిణ భారతదేశంలో పరిస్థితి కూడా ఇందుకు భిన్నంగా ఉండదు. హిమానీ నదాలు పెద్దగా ఉంటే ఏడాది పొడవునా ఉత్తర భారతదేశంలోని నదులు నిండుగా ఉంటాయి. గంగ గురించి ఒక చిన్న ఉదాహరణ చెబుతాను... దేవప్రయాగ వద్ద భగీరత, అలకానంద నదులు గంగతో కలుస్తాయి. దేవ ప్రయాగ వద్ద ఏడాదిలో హిమానీ నదాల ప్రవాహం 27 శాతం మాత్రమే ఉంటుంది. అంటే హిమానీ నదాలు ఏడాది పొడవునా నదులను జీవనదులుగా ఉంచలేవు. ఈ అంశంలో ఇక్కడే చాలామందిలో అపార్థం చోటుచేసుకుంది. హిమాలయాలుకదా. అక్కడ మంచు కరిగి హిమానీ నదాలుగా మారి నదుల్లోకి నీరుచేరుతుందని చాలామంద అపోహపడుతుంటారు. వరదలు సంభవించేవేళ దక్షిణ ప్రాంతంలోని నదులు నీటిని తీసుకునేందుకు సిద్ధంగా ఉండవు.

ప్ర: మొట్టమొదటి నదుల అనుసంధానం కెన్ - బెత్వాకు కొన్ని నెలల క్రితం పర్యావరణ అనుమతి వచ్చింది. ఈ అనుసంధానం వల్ల కలిగే ప్రమాదమేమిటో వివరించండి?

జ: ప్రస్తుత పరిస్థితుల్లో వాళ్లు కెన్-బెత్వా అనుసంధానం ప్రస్తావిస్తున్నారు. ఈ అనుసంధానం గురించి పీపుల్స్ సైన్స్ ఇన్‌స్టిట్యూట్ ఎంతో అధ్యయనం చేసింది. ఈ రెండూ పక్కపక్కనే ఉంటాయి. కెన్ తూర్పు దిక్కులో ఉంటే బెత్వా పడమర దిక్కులో ఉంటుంది. కెన్ ప్రాంతం కరవు పరిస్థితుల్లో మునిగితే బెత్వా కూడా అంతే! కెన్‌లో వరదలొస్తే బెత్వాలోనూ వస్తాయి. ఇదే పరిస్థితి దేశవ్యాప్తంగా నెలకొనివుంది.అంటే వాతావరణ పరిస్థితులు అన్నిచోట్లా ఒకేలా ఉంటాయి. కాబట్టి కెన్‌లోమిగులు నీరుంటుంది, బెత్వాలో తక్కువ ప్రమాణంలో నీరుండటమేమిటి? కెన్ కంటే బెత్వాకు పరివాహిక ప్రాంతమెక్కువ. కెన్ పరివాహిక ప్రాంతమంతా అడవులతోను, అందువల్ల మధ్యభారత్‌లో కెన్ నది ప్రధానభూమిక పోషిస్తోంది. కెన్‌ప్రాంతంలో జనా భా తక్కువ. ఆ ప్రాంతంలో పెద్దపెద్ద నగరాలు, పరిశ్రమలు లేవు. అందువల్ల అక్కడ నీటి అవసరం తక్కువ. అక్కడ ఎక్కువ గిరిజనులుండడం వల్ల సాగునీటితో వ్యవసాయం చేయరు. ఇవన్నీ కలిసి ఆ ప్రాంతంలో తక్కువ నీటి అవసరం కలిగేలా చేస్తున్నాయి. కెన్ అభివృద్ధి నమూనా ఏమిటి? కెన్ నమూనా అంటూ ఇంకొకటి ఉండదు. బెత్వా స్థాయి అభివృద్ధి సాధించిన తరువాత దేశంలోని ఇతర ప్రాంతాల్లో నెలకొన్న పరిస్థితులే భవిష్యత్తులో కెన్ ప్రాంతంలోనూ ఏర్పడవచ్చు. అప్పుడు కెన్వా ప్రజలు మా వద్ద మిగులు నీరులేదని వాదిస్తారు. భోపాల్ వైపు బెత్వా ఉంటుంది. బెత్వా పరివాహిక ప్రదేశంలోకి భోపాల్, ఝాన్సీ వస్తాయి. ఆ ప్రాంతంలో సోయాబిన్ ఎక్కువగా సాగుచేస్తారు. వాణిజ్యపంటల సాగుకూడా ఉండడం వల్ల అక్కడ నీటి అవసరం ఎక్కువగా ఉంటుంది. నీటి డిమాండ్ ఎక్కువగా ఉండడం వల్ల సహజంగా నీటి కొరత వస్తుంది. మరోవిధంగా చెప్పుకోవాలంటే దేవుడు వర్షం ఇస్తాడు; ప్రకృతి వర్షం ఇస్తుంది. అలాగే ఇది కూడా! ఇప్పుడు మధ్యప్రదేశ్ ప్రభుత్వం నుంచి వచ్చిన నివేదిక కొత్త విషయాన్ని చెబుతోంది. బెత్వా ప్రాంతంలో మిగులు నీరు ఉందట. ఇందులో ఎవరి లెక్కలు నమ్మాలి? మేముసేకరించిన వివరాల ప్రకారం, రెండు ప్రాంతాల్లోను ఒకేమాదిరి వర్షపాతం ఉంటుంది. డిమాండ్ తక్కువగా ఉండడం వల్లే కెన్ ప్రాంతంలో ప్రస్తుతం మిగులు నీరుంటోంది. ఈ రెండు నదులను అనుసంధానం చేయడం వల్ల కర్ణాటక – తమిళనాడు మధ్య చెలరేగుతున్న కావేరి జలాల సమస్య, పంజాబ్, రాజస్థాన్, హర్యానాల మధ్య ఏర్పడి విధంగా భవిష్యత్తులో నీటి తగాదాలు ఏర్పడే అవకాశాలుంటాయి.

> **నదుల అనుసంధానం ప్రక్రియ వల్ల భవిష్యత్తులో నీటి సమరాలు తలెత్తుతాయని ప్రముఖ పర్యావరణవేత్త, నీటి యాజమాన్య నిపుణుడు రవి చోప్రా అభిప్రాయపడ్డారు. వాజ్‌పేయి హయాంలో నదుల అనుసంధానంపై ఊపందుకుంది. ఇందుకు సంబంధించి సాధ్యాసాధ్యాలపై చర్చ జరిగింది. అనుసంధానం భారీ ఖర్చుతో కూడుకున్న ప్రక్రియలు కావడంతో అప్పటికి దానికి స్వస్తిపలికారు.**

ప్ర: ప్రాజెక్టు ఖర్చు అంచనాలకొస్తే సంక్లిష్టత, ప్రణాళిక స్థాయిలో ఎన్నో అంకెలు చూస్తున్నాం. దేశంలోనే చేపడుతున్న పెద్ద అవస్థాపన ప్రణాళికగా కొంతమంది అభివర్ణిస్తున్నారు. మరికొంతమంది ఇది శక్యంకాని ప్రాజెక్టని అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రాజెక్టుకు మీ అంచనాలేమిటి? ఖర్చు అంచనాలు వేసేటప్పుడు మనం గమనించాల్సిన అంశాలేమిటి?

జ: ఈ ప్రాజెక్టుకు వాస్తవ అంచనాలుగా 5.56 లక్షల కోట్లని చెబుతున్నారు. ఈ లెక్కలు పదిహేనేళ్ల క్రితంవి.అదంత అవుతుందని నేననుకోవడం లేదు. ఈ ప్రాజెక్టు ఎప్పటికి పూర్తవుతుందో ఎవరూ చెప్పలేరు. పూర్తయితే అది 25 లక్షల కోట్లకు చేరుకోగలదని అంచనా. ఇటువంటి ప్రాజెక్టులను మనం ఇంతకుముందు గమనించాం. ఆ అనుభవంతో దీన్ని ఖర్చు అంచనానుమించి నాలుగైదు రెట్లు పెరుగుతుం దని భావించవచ్చు. ఉదాహరణకు నర్మదా వ్యాలీ ప్రాజెక్టును పరిశీలించవచ్చు. భైసేకరణ బిల్లు ఆమోదం పొందకముందు అంచనాలివి. భూసేకరణ, పునరావాసం చట్టాన్ని అనుసరించి భూసేకరణ జరిపితే ప్రాజెక్టు ఖర్చు తడిసి మోపెడవుతుంది.

ప్ర: నదుల అనుసంధానమనేది బీజేపీ అభిమాన పుత్రిక. కాంగ్రెస్, బీజేపీ ప్రభుత్వాల తీరును గమనిస్తే, వాజ్‌పేయి ప్రభుత్వం హయాంలో ఆలోచన వచ్చింది. మళ్లీ ఇప్పుడు తెరపైకి వచ్చింది కదా?

జ: వాజ్‌పేయి హయాంలో నదుల అనుసంధానం ఊపందుకుంది. జాతీయ జల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో సాధ్యాసాధ్యాలపై అధ్యయనాలు జరిగాయి. ఇది ఎంతో ఖర్చుతో కూడుకున్న ప్రాజెక్టు అయినప్పటికీ దీన్ని వదిలిపెట్టే ఆలోచన ప్రస్తుత పాలకులకు లేదు. అన్నివర్గాల నుంచి వారికి వ్యతిరేకత కూడా వ్యక్తమవుతోంది. ఒకనొకదశలో మా నీళ్లు ఇవ్వమని బిహార్ ప్రభుత్వం స్పష్టం చేసిన విషయం విదితమే.

ఆరిఫ్ హుస్సేన్
(ఎకాలజైజ్ సౌజన్యంతో)



(మార్చి 14న అంతర్జాతీయ నదుల నిర్వహణ దినోత్సవం)

శీతాకాల వ్యవసాయం కుదేలు

మథనం


భూతాపం పెరగడంతో భూగోళంపై చోటు చేసుకుంటున్న వాతావరణ మార్పుల కారణంగా సుదీర్ఘ వాసవి కాలాలు, కురచ శీతాకాలాల కారణంగా జీవవైవిధ్యంలో అనూహ్యమైన పరిణామాలు సంభవిస్తున్నాయి. రుతు కాలాల్లో సంభవిస్తున్న మార్పులను సాంకేతికపరమైన చిట్కాలతో పరిష్కరించడం సాధ్యం కాదు. 'భారత ఆర్థిక వ్యవస్థ పర్యవేక్షణ కేంద్రం' రూపొందించిన సమాచారం ప్రకారం వారాలవారీగా రుతుపవన వర్షపాతం అతి తక్కువ నమోదైంది. ఫిబ్రవరి చివరి నాటికి సాధారణ వార్షిక వర్షపాతం సంచిత లోటు 64 శాతంగా నమోదైంది. వర్షాభావ పరిస్థితులు నెలకొన్న 2014 –15 నాటి కరువు కాలంలో మొత్తం వర్షపాతం దీర్ఘకాల సగటు (ఎల్పీఏ) కేవలం 15 శాతం మాత్రమే నమోదైంది. 2017లో ఖరీఫ్ పంటల (తొలకరిలో సాగు) కంటే రబీ పంటలు (వర్షాకాలం ముగిసిన అనంతరం పండించే పంట) బాగా సాగైనట్లు సమాచారం. పంజాబ్, హర్యానా తదితర ప్రాంతాలలో పండించే గోధుమ పంట, వరి సాగులాగా వర్షాధారం పంట కాదు. అయితే ఈ ఉదంతం అసాధారణమైనదేమీ కాదు. వర్షపాతం క్షీణించడమంటే చలికాలం నిడివి తగ్గిపోవడమన్నమాట. దీని వల్ల ముందస్తుగా పండిపోవడం, గింజలు గిడసబారి బరువు తగ్గిపోగా, పంటల దిగుబడిపై ప్రతికూల ప్రభావమేస్తుంది. శీతాకాల వర్షాలు దారి తప్పితే, దేశంలోని కొన్ని ప్రాంతాల్లో అకాల, అసాధారణ అతివృష్టి సంభవిస్తుంది. విదర్భ సబ్ డివిజన్‌లో 2017 డిసెంబర్ చివరాఖరు దాకా అన్ని వారాల్లోనూ సాధారణ వర్షపాతం నమోదైంది. 2018 జనవరి 14న వారాంతంలో 1000 శాతానికి మించిన వర్షపాతం ఆ ప్రాంతంలో నమోదైంది. తీవ్రమైన తుఫానుల మూలంగా పంటలకు భారీ నష్టం వాటిల్లిన విషయం అందరికీ తెలిసిందే. భూతాపం కారణంగా సంభవించిన వాతావరణ మార్పు పర్యవసానాలే ప్రపంచవ్యాప్తంగా కొనసాగుతున్న ఈ అతివృష్టి, అనావృష్టి పరిస్థితులు.

తీవ్రంగా మారుతున్న వాతావరణ మార్పు పరిస్థితుల రీత్యా భారత వ్యవసాయ రంగంలో చోటు చేసుకోనున్న ప్రతికూల పరిస్థితులపై ఈ ఏడాది ఆర్థిక సర్వే ఒక అధ్యాయంలో సవివరంగా చర్చించింది. రబీ సీజన్‌లో గోధుమ, ఆవాల పంటల సాగు విస్తీర్ణం క్షీణించింది. పప్పుదినుసుల సాగు గత ఏడాదితో పోలిస్తే సాగు విస్తీర్ణం 8 శాతం (గత ఏడాది 143.4 హెక్టార్ల నుంచి ఈ ఏడాది 154.9 హెక్టార్లకు) పెరిగింది. మార్కెట్ ధరలు, నీటి లభ్యత, తేమ శాతం తదితర కీలక అంశాలపై పంటల సాగు విస్తీర్ణం ఆధారపడి ఉంటుంది. వాతావరణ మార్పు కారణంగా దేశంలో కొన్ని ప్రాంతాల్లో అతివృష్టి, కొన్ని ప్రాంతాల్లో అనావృష్టి పరిస్థితులు ఏకకాలంలో కొనసాగుతుండడం సమకాలీన ప్రత్యేక వాతావరణ పరిస్థితి. అతివృష్టి కారణంగా పంటల దిగుబడులపై ప్రతికూల ప్రభావమేయడం వల్ల ఖరీఫ్‌లో 13.7 శాతం, రబీలో 5.5 శాతం ఆదాయాలు క్షీణిస్తాయని ఆ నివేదిక వివరించింది. సాగుచేయని ప్రాంతాలు బాగా దెబ్బతిన్నాయి.

అతివృష్టి, అనావృష్టి వంటి ప్రకృతి వైపరీత్యాలు నేడు సాధారణ వాతావరణ పరిస్థితులుగా మారాయి. ఈ నేపథ్యంలో వ్యవసాయ విధానాన్ని సమకాలీన పరిస్థితులకు అనుగుణంగా రూపొందించుకోవాలి. సమస్య వ్యవసాయ రంగంలోని సాగుకు మాత్రమే పరిమితమై లేదు. దేశవ్యాప్తంగా అనేక చోట్ల భూగర్భ జలనిల్వలు ఘోరంగా దెబ్బతిన్నాయి. ఎలాంటి సుస్థిర నీటి వనరులు లేకుండానే మనం స్మార్ట్ సిటీల పేరుతో భారీ ఎత్తున పట్టణీకరణకు శ్రీకారం చుట్టాము. దక్షిణాదిలో శీతాకాల వర్షాలు చాలా కీలక పాత్ర పోషిస్తాయి. ఇప్పటికే దక్షిణాదిలో ప్రతిష్ఠాత్మక నగరంగా పేరొందిన బెంగళూరు నీటి కొరత సంక్షోభంతో కొట్టుమిట్టాడుతోంది. దక్షిణాఫ్రికాలోని కేప్‌టౌన్ నగరం లాగా నీటి వనరులు పూర్తిగా అడుగంటిపోయే 'డే జీరో' స్థితికి త్వరలో చేరుకుంటుందని అధ్యయనాలు హెచ్చరిస్తున్నాయి. వాతావరణ మార్పు కారణంగా సన్నగిల్లిన శీతాకాల సమస్య పరిష్కారానికి చిట్కాలేవీ ఉండవు. భూతాపం పెరిగి తీవ్ర ప్రతికూల వాతావరణ పరిస్థితులు నెలకొంటున్న తరుణంలో సంప్రదాయక వ్యవసాయక పద్ధతులకు భిన్నమైన వాటిని రూపొందించుకోవాలి. నీటిని అధికంగా వినియోగించే వంగడాలతోను, ఎరువులు, పురుగుమందులు అధికంగా వినియోగించే హరిత విప్లవం కారణంగా భూసారం దెబ్బతిని వ్యవసాయ దిగుబడులు ఘోరంగా పడిపోయాయి. అదే సమయంలో ఎరువులు, పురుగు మందుల వినియోగంవల్ల ప్రజారోగ్యం సంక్షోభంలో కూరుకపోయింది. ఈ నేపథ్యంలో భారీ ప్రాజెక్టుల నిర్మాణంపై కాకుండా వరద నీటి స్థాయి ప్రాజెక్టులు, చెక్ డ్యాంలు, నీటి కుంటలు, భూగర్భజలాశయాలు, చెరువులు వంటి వికేంద్రీకృత నీటి యాజమాన్య పద్ధతులు చేపట్టాలి. నీటి వినియోగం తక్కువగా ఉండే వాతావరణ పరిస్థితులకు తగిన పంటలను, విత్తనాలతో సాగు చేయాలి. మారుతున్న కాలాలు, గతి తప్పిన రుతుపవనాల నేపథ్యంలో ఎంతటి అనావృష్టి పరిస్థితులలో సైతం పండే తృణ ధాన్యాల సాగుతో పాటు, ప్రకృతి వ్యవసాయాన్ని జాతీయ విధానంగా చేపట్టాలి.

ది స్టోరీ ఆఫ్ కార్బన్ కొలోనైజేషన్

పుస్తక పరిచయం



మనం ప్రస్తుతం వాతావరణ మార్పుల కాలంలో నివశిస్తున్నాం. ప్రపంచ వ్యాప్తంగా వేడి గాలులు, తీవ్ర వాతావరణ పరిస్థితులు, అటవీ నిర్మూలన కారణంగా వ్యాధులు పెరిగిపోవడం, ఎడారి ప్రాంతాల్లో మంచు పెరగడం, వరదలు, అనూహ్య తుపానులు, కరవు పరిస్థితులు ఇలా అనేక వాతావరణ మార్పుల్ని ఎదుర్కొంటున్నాయి. ఆర్థికాభివృద్ధికి, జీవావరణ మధ్య సమతుల్యత సాధించేందుకు మార్గాలు కనుగొనవలసి ఉంది. అయితే, ప్రపంచంలో అత్యధిక ఉద్గారాలను వెదజల్లే అమెరికా పారిస్ ఒప్పందం నుంచి వైదొలగడంతో గత 25 ఏళ్లగా వాతావరణ మార్పులపై కొనసాగుతున్న చర్చల్లో ప్రతిష్ఠంభన ఏర్పడింది. వాతావరణ మార్పుల వల్ల సమస్యలు ఎదుర్కొంటున్న అభివృద్ధి చెందుతున్న దేశాల వాణితో ఈ పుస్తకాన్ని సంపాదకులు రిచర్డ్ మహాప్రాత, ఎస్.ఎస్.జీవన్ రాశారు. ఈ దేశాలకు, ఎలాంటి వాతావరణ మా ర్పులకు సంబంధం లేదు. ధనిక దేశాలు సృష్టించే ఉపద్రవాలతో కూడా ఈ దేశాలకు సంబంధం లేదు. అభివృద్ధి చెందుతున్న దేశాలకు, అభివృద్ధి చెందిన దేశాలకు మధ్య అంతరం పెరుగుతోంది. ఈ నేపథ్యాన్ని స్పర్శిస్తూ రచయిత ఈ పుస్తకం 'ది స్టోరీ ఆఫ్ కార్బన్ కొలోనైజేషన్' రాశారు.

పుస్తకం పేరు: ది స్టోరీ ఆఫ్ కార్బన్ కొలోనైజేషన్
సంపాదకులు రిచర్డ్ మహాప్రాత, ఎస్.ఎస్.జీవన్
వెల: 210 రూపాయలు (తగ్గింపు ధరతో)
ప్రచురణ సంస్థ: డౌన్ టు ఎర్త్

కాలుష్య నివారణలో 'స్థానిక' పాత్ర కీలకం

మనదేశంలో వివిధ రకాల ఘన, ద్రవ వ్యర్థాలు చాప కింద నీరులా అంతకంతకూ విస్తరిస్తూ యావత్‌జాతి ఆరోగ్యాన్ని కబళిస్తున్నాయి. చెత్తను శాస్త్రీయంగా నిర్మూలించగల విధానాల్లో భారత్ ఎంతో వెనుకబడి ఉంది. పోగుబడిన చెత్తను నగర శివార్లలో పారబోసి తగులబెట్టి చేతులు దులుపుకుంటున్నారు. ఆ వ్యర్థాల నుంచి వెలువడే పొగ, దుర్గంధం పరిసరాల్లో కాలుష్య, పారిశుధ్య సమస్యలకు అంటుకడుతోంది. పారిశ్రామిక రసాయన వ్యర్థాల వల్ల అనేకచోట్ల భూగర్భ జలాలూ కలుషితమవుతున్నాయి. ఈ విపత్తును ఎదుర్కోవాలంటే అందరూ పరిశుభ్రతను బాధ్యతగా గుర్తించాలి. స్వచ్ఛ భారత్ ప్రభుత్వ కార్యక్రమంగా భావించకూడదు. ప్రధాని మోదీ ఇచ్చిన స్వచ్ఛభారత్ పిలుపు దేశంలో బహిరంగ మల మూత్ర విసర్జన విషయంలో మెరుగైన ఫలితాలు రాబట్టింది.



ఇప్పుడు వ్యర్థాల నియంత్రణను ప్రాధాన్యాంశంగా చేపట్టి స్వచ్ఛ భారత్ కార్యక్రమాలను ప్రభుత్వాలు వ్యూహాత్మకంగా తీర్చిదిద్దాలి. వాస్తవానికి ఏయే వ్యర్థాన్ని ఎలా నిర్మూలించాలన్న విషయంలో ప్రభుత్వాలు ప్రజలకు స్పష్టత ఇవ్వలేకపోతున్నాయి. ఈ విషయంలో పాలకులు చేయవలసింది ఎంతో ఉందని చెప్పవచ్చు. వ్యర్థాల నిర్మూలనలో స్వీడన్ స్ఫూర్తిదాయకంగా పని చేస్తోంది. అక్కడ 99 శాతం వ్యర్థాలు విద్యుత్ తయారీ ఇంధనంగా మారుతున్నాయి. ఒకశాతం వ్యర్థాలు మాత్రమే చెత్త కుంటకను చేరుతున్నాయి. ప్లాస్టిక్, కాగితం, అట్టముక్కలు, చెక్క, లోహాలు, గ్లాస్ ముక్కలు, ఔషధాలు, వైద్యపరికరాలు, విద్యుత్, ఎలక్ట్రానిక్ వస్తువులు వాటిలో కొన్ని. ఆహార పదార్థాలు, రసాయనాలు వంటి తడిచెత్త మరోరకం. పాలనాపరమైన విధానాలు, చట్టబద్ధ కట్టుబాట్లు స్వీడన్ ప్రజలను పరిశుభ్రత వైపు మళ్ళించాయి. స్వీడన్ ప్రభుత్వం తమ స్థానిక సంస్థలకు విశేష అధికారాలు కట్టబెట్టింది. వ్యర్థాల నియంత్రణ అన్నది పూర్తిగా పురపాలక సంఘాల వ్యవహారం. చెత్త నుంచి స్థానిక సంస్థలు ఇంధనం తయారు చేస్తుంటే, పౌరులు దాన్ని ఆదాయ మార్గంగా మలచుకున్నారు. వస్తువులను వాడేసి పడేసే పద్ధతి ఆ దేశంలో ఉండదు. అవసరమైతే అవి మరమ్మతు చేసుకొని వాడేలా ఉంటాయి. ప్రతి నివాస ప్రాంతానికి మైలుదూరంలో వ్యర్థాల సేకరణ కేంద్రాలుంటాయి. వీటిని ప్రైవేటు సంస్థలు నిర్వహిస్తాయి. నిర్ణీత కాలావధుల్లో స్వీడన్ ప్రజలు విభాగాల వారీగా వ్యర్థాలను సేకరించి సంస్థలకు అప్పగిస్తారు. అందుకు ప్రజలు కొంత రుసుము చెల్లించాల్సి ఉంటుంది. బహిరంగ ప్రదేశాల్లో ప్రజలే వ్యర్థాలను స్వచ్ఛందంగా చెత్తకుండీల్లో పడేస్తుంటారు. వ్యర్థం పడేసినప్పుడు సంగీతం వినిపించే కుండీలు పిల్లలను, పెద్దలను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. గ్రామస్వరాజ్యం కోసం జాతిపిత కలలుగన్నారు. ఏడు దశాబ్దాల స్వతంత్ర భారతంలో ఆయన కలలు అక్షరాలా కల్లలయ్యాయి. స్థానిక సంస్థలు అంతకంతకూ బలహీనపడ్డాయి. స్థానిక సంస్థలకు కఠిన నిర్ణయాలు కట్టబెట్టినప్పుడే కాలుష్య నియంత్రణను ఆపడం సాధ్యమవుతుంది.

శ్రీనివాస్ చిరిపోతుల, తెలంగాణ సామాజిక రచయితల సంఘం, జయశంకర్ భూపాల పల్లి జిల్లా.



జీవితకాలం షి జిన్‌పింగే

(మొదటిపేజీ తరువాయి)

ఇలా జీవితకాలం అధ్యక్షుడిగా, సైన్యాధిపతిగా ఉన్న ఏకైక నాయకుడు జిన్‌పింగే కావడం విశేషం. 64 ఏళ్ల షి.. ఈ నెలలోనే రెండోసారి తన ఐదేళ్ల పదవీ కాలానికి ఎన్నిక కావాల్సి ఉంది. ఈలోపే పార్లమెంటు చట్టసవరణను ఆమోదించడంతో ఇక ఆ లాంఛనప్రాయ ఎన్నిక కూడా అవసరం లేకుండా పోయింది. చైనా కమ్యూనిస్టు పార్టీ ఏం నిర్ణయిస్తే అది మాత్రమే చేయాల్సిన రబ్బరు స్టాంపుగా నేషనల్ పీపుల్స్ కాంగ్రెస్ (ఎన్‌పీసీ)అని పిలిచే పార్లమెంటు మిగిలిపోయింది. అందులో దాదాపు 3వేల మంది డిప్యూటీలుంటారు. వాళ్లలో మూడింట రెండొంతుల మంది అధ్యక్షుడి పదవీకాల పరిమితిని ఎత్తేస్తూ చేయాల్సిన రాజ్యాంగ సవరణకు ఆమోదం తెలిపారు. పార్లమెంటు స్థాయీసంఘంలో ఉన్న ప్రతి ఒక్కరం ఈ రాజ్యాంగ సవరణకు మద్దతు తెలిపి ఆమోదించామని ఎన్‌పీసీ చైర్మన్ జాంగ్ డెజియాంగ్ తెలిపారు.

సమష్టి నాయకత్వం గల్లంతు

ఈ సవరణతో సమష్టి నాయకత్వం పూర్తిగా అంతమైనట్లయింది. మావో హయాంలో ఏక వ్యక్తి పాలన కారణంగా తలెత్తిన నియంతృత్వం ఉండకూడదని గతంలో చైనా కమ్యూనిస్టు పార్టీ సమష్టి నాయకత్వాన్ని ప్రవేశపెట్టింది. మావో హయాంలో సాంస్కృతిక విప్లవం లాంటి దారుణమైన ఘటనలు జరిగి లక్షలాది మంది ప్రజలు హతమయ్యారు.

పడక గది ముచ్చట్లు ఆపండి

చైనా జీవితకాల అధ్యక్షుడిగా ఖరారైన షి జిన్‌పింగ్ తమ దేశ అధికారులను అవినీతి విషయంలో ఒళ్లు దగ్గర పెట్టుకోవాలని హెచ్చరించారు. పడకగది ముచ్చట్లు ఆపాలని.. అలాగే తమ కుటుంబ సభ్యులు కూడా అవినీతికి పాల్పడకుండా చూసుకోవాలని చెప్పారు. అధికారులు స్వయం నియంత్రణ పాటించాలని, పిల్లలు మీ పేరు ఉపయోగించుకుని డీలింగ్ చేయకుండా చూసుకోవాలని తెలిపారు. మీ చుట్టూ ఉండే వారి వల్ల బురదలోకి కూరుకుపోకుండా జాగ్రత్త పడాలన్నారు. నిబంధనలు అతిక్రమించకూడదని, గీత దాటొద్దని, అవినీతి లేకుండా చూసుకోవాలని అన్నారు. ఇటీవలి కాలంలో అవినీతి విషయంలో అత్యంత కఠినంగా ఉన్న అధ్యక్షుడిగా జిన్‌పింగ్ పేరొందారు. దేశవ్యాప్తంగా గత ఐదేళ్లలో కోటిన్నర మంది ఉద్యోగులను శిక్షించారు. వారిలో 101 మంది ఉన్నతాధికారులు, సైనిక జనరళ్లు కూడా ఉన్నారు. అయితే.. అవినీతి పేరుతో పార్టీలోను, ప్రభుత్వంలోను తనను వ్యతిరేకించేవారిపై జిన్‌పింగ్ వేటు వేశారన్న ఆరోపణలూ ఉన్నాయి.



సాయుధ పోరాట యోధురాలు
కమలమ్మ కన్నుమూత

- పురుషులకు దీటుగా పోరాడిన వీరనారి



హైదరాబాద్, మార్చి 11 (మనం ప్రతినిధి): నిజాం వ్యతిరేక తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, కామ్రేడ్ చెన్నబోయిన కమలమ్మ(87) అనారోగ్యంతో ఆదివారం కన్నుమూశారు. కొంతకాలంగా వృద్ధాప్య సంబంధిత అనారోగ్యంతో బాధపడుతూ ఇక్కడి ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కమలమ్మ.. పరిస్థితి విషమించడంతో ఆదివారం మృతిచెందారు. 'సై..సై.. గోపాల్‌రెడ్డి-నిలిచావూ ప్రాణాలొడ్డి' అంటూ ఎన్నో జనం గుండెల్లో నిలిచిపోయే జానపదాలన్నెంటినో కమలమ్మ పాడారు. ఇక్కడి సీపీఐ రాష్ట్ర కార్యాలయంలో ఆమె భౌతికదేహానికి సీపీఐ నేతలు సహా సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, పార్టీ కార్యకర్తలు, అభిమానులు, తదితరులు నివాళులర్పించారు. అనంతరం వరంగల్ జిల్లాకు ఆమె పార్థివ దేహాన్ని తరలించి అక్కడి పోచమ్మ మైదానంలో కుటుంబ సభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు. కమలమ్మ ఆమె పోరాటాన్ని, ఉద్యమ స్ఫూర్తిని గుర్తించిన తెలంగాణ ప్రభుత్వం 2016లో ఆమెను మహిళా అవార్డుతో సత్కరించింది. తెలంగాణ సాయుధ పోరాటంలో పురుషులతో సమానంగా పోరాడిన వీరనారి కమలమ్మ వరంగల్ జిల్లా నెల్లికుదురు మండలం నైనాల గ్రామంలో జన్మించారు. తెలంగాణ సాయుధ పోరాట యోధుడు రంగాపురానికి చెందిన ముకుందాన్ని వివాహమాడారు. కమలమ్మ ఖ్యాతి ఇతర దేశాలకు కూడా వ్యాపించింది. ఉద్యమ జీవితంలో చూపిన గుండె ధైర్యానికి రష్యా, జర్మనీ దేశాలు కమలమ్మ చరిత్రను పుస్తకాలలో పొందుపరిచాయి. కమలమ్మ చరిత్రను రాష్ట్ర ప్రభుత్వం పాఠ్యాంశంగా చేసింది. కమలమ్మ తన గానంతో, గొల్లసుద్దులతో రజాకార్ల దురాఘతాలను కళ్లకుకట్టినట్లు చెప్పి కోయప్రజలను ఉత్తేజపరిచారు.

13న బంద్ వాయిదా

మొదటిపేజీ తరువాయి

ఉండేందుకు ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లాలని డిమాండ్‌తో ఈ నెల 19వ తేదీన మహా ధర్నా చేస్తామని చెప్పారు. రాజ్యసభలో వర్గీకరణ కోసం మాట్లాడాలని, రాహుల్‌గాంధీ ప్రధానమంత్రికి లేఖ రాయాలని చెప్పారు. డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి వర్గీకరణపై ప్రధానికి రాసిన లేఖను బహిర్గతం చేయాలన్నారు. 19 నుంచి పార్లమెంట్‌లో బిల్లు పెట్టాలని ఢిల్లీలో ధర్నా చేపట్టనున్నట్టు పేర్కొన్నారు. వర్గీకరణ కోసం సైద్ధాంతికపరంగా బీజేపీ అనుకూలంగా ఉంటే.. ఎంపీలు మాట్లాడడంలేదని తెలిపారు. వర్గీకరణ అంశంపై సోమవారం నుంచి ఎంపీలు మాట్లాడకపోతే వారిని మాదిగలకు శత్రువులుగా గుర్తించి రాజకీయ భవిష్యత్తు లేకుండా చేస్తామని హెచ్చరించారు. ప్రభుత్వం ఓవైపు బంద్‌ను వాయిదా వేసుకోవాలని కోరుతూనే.. మరోవైపు ఎంఎస్ఎఫ్ లీడర్లను అరెస్ట్ చేసి జైల్లో పెడుతుందని చెప్పారు. టీఆర్ఎస్ కంటే విద్యార్థుల భవిష్యత్తు గురించే ఎమ్మార్పీఎస్ ఎక్కువగా ఆలోచిస్తుందని మంద కృష్ణ చెప్పారు. బంద్‌కు మద్దతు తెలిపిన నేతలందరికీ ఈ సందర్భంగా ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు.

సమరానికి సై

- ఎవరైనా కలిసొస్తామంటే సరే..
- లేకుంటే 175 నియోజకవర్గాల్లో పోటీ
- 2019 ఎన్నికలకు సిద్ధమవుతున్న టీడీపీ
- కసరత్తు ప్రారంభించిన ఏపీ సీఎం చంద్రబాబు



(మనం - అమరావతి): అసెంబ్లీ ఎన్నికల సమరానికి తెలుగుదేశం పార్టీ సిద్ధమవుతోంది. కేంద్ర మంత్రి వర్గం నుంచి వైదొలగిన టీడీపీ, మరికొద్ది రోజుల్లో ఎన్డీఏ నుంచి కూడా వైదొలగే సూచనలు కనిపిస్తున్నాయి. ఎవరైనా కలిసొస్తారో.. రారో అనేది ఖరారు కాకపోయినా మొత్తం 175 నియోజకవర్గాల్లో నేరుగా తన అభ్యర్థుల్ని బరిలోకి దించేందుకు సిద్ధమవుతోంది. ఆదివారం రాజ్యసభ అభ్యర్థుల ఎంపిక ప్రక్రియను ముగించిన చంద్రబాబు తరువాతి వ్యూహంపై కసరత్తు ప్రారంభించారని సమాచారం. సీఎం రమేశ్‌కి రెండో టర్మ్ ఇస్తారనేది ముందునుంచి అందరూ అనుకున్నదే అయినా లీగల్‌సెల్ అధ్యక్షుడు కనకమేడల రవీంద్ర కుమార్ పేరు అనూహ్యంగా చిట్టచివరి నిముషంలో ఖరారు కావడం టీడీపీ వర్గాలను ఒకింత ఉలిక్కిపడేలా చేసింది. ఢిల్లీ నుంచి అత్యున్నత స్థాయి వర్గాల సిఫార్సు మేరకు కనకమేడల అభ్యర్థిత్వాన్ని చంద్రబాబు ఖరారు చేసినట్లు పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. కనకమేడల అభ్యర్థిత్వం బట్టే అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల అభ్యర్థుల ఎంపిక ఎలా ఉండనుందో చంద్రబాబు చెప్పకనే చెప్పేశారు. వైసీపీ నుంచి టీడీపీలో చేరిన 23 మంది ఎమ్మెల్యేల నియోజకవర్గాలతో పాటు చంద్రబాబు సర్వేలో డి-గ్రేడ్ వచ్చిన మరో 18 నియోజకవర్గాలపై చంద్రబాబు స్వయంగా కసరత్తు చేయడంతో పాటు.. తనకు అత్యంత విశ్వాసపాత్రులకు అప్పగించారని చెబుతున్నారు. సాధారణంగా చంద్రబాబుకు 8 మార్గాల ద్వారా ప్రతి అంశంపై నివేదిక తెప్పించుకోవడం ఆనవాయితీ. ఆయన తొలిసారి ముఖ్యమంత్రిగా ఉన్నప్పటి నుంచి ఈ 8 మార్గాల ద్వారా నియోజకవర్గాల వారీగా, మండలాల వారీగా, నగర, పట్టణ, గ్రామ బూత్ కమిటీల నివేదికను తెప్పించుకుని కూలంకషంగా మదింపు చేసేవారని చెబుతారు. తొలుత టీటీడీ పాలక మండలి నియామకం పూర్తి చేసే దిశగా చంద్రబాబు అడుగులు వేశారు. ఈ నేపథ్యంలోనే ఎస్వీబీసీ చానల్ సీఈవో నరసింహారావును తొలగించి, ఇన్‌చార్జ్ సీఈవోను నియమించారు. టీటీడీ చైర్మన్ పదవికి దాదాపు పేరు ఖరారైందని అనుకుంటున్న యనమల వియ్యంకుడు పుట్టా సుధాకర్ యాదవ్‌ను చంద్రబాబు వెలగపూడి సచివాలయానికి పిలిపించి మాట్లాడారు. ఇప్పటికే లోక్‌సభ నియోజకవర్గాల వారీగా సమీక్షా సమావేశాలు నిర్వహిస్తున్న చంద్రబాబు, అభ్యర్థుల ఎంపికపై ప్రాథమికంగా ఒక అంచనాకు రావడం ప్రారంభించారని చెబుతున్నారు. జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి, జిల్లా పార్టీ అధ్యక్షుడు, నియోజకవర్గాల పరిశీలకులు ఈ సమీక్షలో పాల్గొంటున్నారు. చంద్రబాబు నేరుగా ఇన్‌చార్జ్ మంత్రి, జిల్లా అధ్యక్షులు, పరిశీలకులతో ముఖాముఖి చర్చించి, తన దగ్గర ఉన్న సమాచారాన్ని బేరీజు వేసుకుంటున్నారు. ఇప్పటికే పదవీకాలం పూర్తయిన అన్ని కార్పొరేషన్లకు చైర్మన్లను నియమించేందుకు జాబితాలను సిద్ధం చేయమని ఆదేశించినట్లు చెబుతున్నారు.

ఈడే ఉంటా



ఈడనుంచే జాతీయ రాజకీయాలు చేస్త

- ఎవరూ అపోహ.. ఆందోళన చెందొద్దు
- సిట్టింగు ఎమ్మెల్యేలందరికీ టికెట్ల చాన్స్
- 106 స్థానాలు కచ్చితంగా గెలుస్తం
- టీఆర్ఎస్ఎల్పీ భేటీలో సీఎం కేసీఆర్

హైదరాబాద్, మార్చి 11: తాను జాతీయ రాజకీయాలకు వెళ్లిపోతున్నానంటూ వస్తున్న వదంతులపై ముఖ్యమంత్రి కేసీఆర్ తొలిసారి స్పందించారు. తాను ఇక్కడే ఉంటానని.. ఇక్కడినుంచే జాతీయ రాజకీయాలు చేస్తానని తెలిపారు. సోమవారం నుంచి ప్రారంభం కానున్న అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల నేపథ్యంలో అసెంబ్లీలో అనుసరించాల్సిన వ్యూహాలపై పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ముఖ్య నేతలతో ఆయన ఆదివారం ఓ సమావేశం నిర్వహించారు. 2019 వరకు తాను రాష్ట్ర రాజకీయాల్లోనే ఉంటానన్నారు. ఆ తర్వాత దేశ రాజకీయాల్లో మార్పు కోసం ప్రయత్నిస్తానన్నారు. దేశంలో ఇన్నాళ్లూ రెండు పార్టీల మధ్యనే అధికారం దోబూచులాడుతున్నదని ఆయన విమర్శించారు. ఇప్పటికైనా బీజేపీ, కాంగ్రెసేతర పార్టీలు ఏకం కావాలని పిలుపునిచ్చారు.



సిట్టింగులందరికీ...

ప్రస్తుతం ఉన్న సిట్టింగ్‌ల్లో ముగ్గురు నలుగురికి తప్ప దాదాపు అందరికీ తిరిగి టిక్కెట్లు ఇస్తానని ముఖ్యమంత్రి కేసీఆర్ తెలిపారు. తాను మూడు సార్లు పక్కాగా సర్వే చేయించానని, అందులో భాషరాని వాళ్లతో కూడా సర్వే చేయించానని ఆయన చెప్పారు. ఈసారి అసెంబ్లీ ఎన్నికల్లో టీఆర్ఎస్ కచ్చితంగా 106 స్థానాలు గెలుచుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. అలాగే రాజ్యసభలో మూడు స్థానాలు మనమే సాధిస్తామని స్పష్టం చేశారు. రాజ్యసభ ఎన్నికల బాధ్యతను మంత్రులు కేటీఆర్, ఈటల రాజేందర్, జగదీశ్ రెడ్డిలకు అప్పగించారు. అసెంబ్లీ సమావేశాల తర్వాత తాను ఢిల్లీ వెళ్తానని, అక్కడ ముస్లిం రిజర్వేషన్ల అంశంపై వివిధ పార్టీల నేతలతో చర్చలు జరుపుతానని కేసీఆర్ అన్నారు. అవసరమైతే పార్టీ ఎంపీలతో కలిసి ధర్నా చేస్తానని చెప్పారు.

డబుల్ ధమాకా!



- బీసీలకు రెండు రాజ్యసభ సీట్లు
- జోగినపల్లి, లింగయ్య, బండ ప్రకాశ్ ఖరారు
- టీఆర్ఎస్ఎల్పీ భేటీలో సీఎం కేసీఆర్ ప్రకటన
- బీసీల ఓట్లే లక్ష్యంగా పావుల కదిపిన సీఎం

హైదరాబాద్, మార్చి 11 (మనం ప్రతినిధి): టీఆర్ఎస్ తరపున రాజ్యసభ అభ్యర్థులను సీఎం కేసీఆర్ అధికారికంగా ఖరారు. ఆదివారం తెలంగాణ భవన్‌లో జరిగిన టీఆర్ఎస్ఎల్పీ భేటీలో పేర్లను వెల్లడించారు. టీఆర్ఎస్ రాజ్యసభ అభ్యర్థులుగా జోగినపల్లి సంతోష్‌కుమార్, బడుగుల లింగయ్య యాదవ్, బండ ప్రకాశ్‌ను బరిలో నిలపుతున్నట్లు ప్రకటించారు. వీరు సోమవారం నామినేషన్లు దాఖలు చేసే అవకాశాలు ఉఆన్నయి. బీసీలు (యాదవుల) కోటాలో బండ ప్రకాశ్, బడుగుల లింగయ్య యాదవ్‌కు స్థానం దక్కింది. ఒక సీటు మైనారిటీలకు కేటాయిస్తారని రాజకీయ వర్గాల్లో చర్చ జరిగిప్పటికీ.. బీసీల ఓట్లే లక్ష్యంగా కేసీఆర్ పావులు కదిపారు. ఇందులో భాగంగానే ఇద్దరు బీసీలకు రాజ్యసభ సీట్లిచ్చారని విశ్లేషకులు పేర్కొంటున్నారు. ఈ మూడు స్థానాలనూ గెలిచే సంఖ్యాబలం టీఆర్ఎస్‌కు ఉండటంతో వీరి ఎన్నిక లాంఛనమే కానుంది. సమావేశం అనంతరం జోగినపల్లి సంతోష్‌కుమార్, ప్రకాశ్, లింగయ్య యాదవ్ మీడియాతో మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. యాదవ, ముదిరాజ్ కుటుంబాలకు చెందిన తమను రాజ్యసభ అభ్యర్థులుగా ప్రకటించిన సీఎం కేసీఆర్‌కు రుణపడి ఉంటామని లింగయ్య, ప్రకాశ్ పేర్కొన్నారు. సీఎం కేసీఆర్ భారతదేశ దిక్సూచి అని బండ ప్రకాశ్ అభివర్ణించారు. రెండు సీట్లను బీసీలకు ఇవ్వడం సామాజిక న్యాయానికి గొప్ప ప్రతీక అని తెలిపారు. తనను రాజ్యసభ అభ్యర్థిగా ప్రకటించిన సీఎం కేసీఆర్‌కు జోగినపల్లి సంతోష్‌కుమార్ కృతజ్ఞతలు తెలిపారు. ఉద్యమ సమయంలో కేసీఆర్‌కు అండగా నిలిచానని, ఇకముందూ అలాగే కొనసాగిస్తానని పేర్కొన్నారు.

కేసీఆర్‌కు ఆప్తుడు..



కరీంనగర్, మార్చి 11 (మనం ప్రతినిధి): సీఎం కేసీఆర్‌కు అత్యంత ఆప్తుడైన జోగినిపల్లి సంతోష్‌కుమార్ రాజ్యసభకు పంపడం అందరూ ఊహించింది. కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం కొదురుపాక గ్రామానికి చెందిన సంతోష కుమార్.. టీ-న్యూస్ ఎండీ మలిదశ తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించారు. మొదటి నుంచీ కేసీఆర్‌కు ఆయన ఆప్తుడు. ఎంబీఏ చదివిన సంతోష్‌కుమార్ తెలంగాణ ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నారు. ఒకరకంగా ఉద్యమకారులకు, పార్టీ వర్గాలకు మధ్య వారధిగా నిలిచారు. దేవనార్ అంధుల పాఠశాలలోని విద్యార్థులకు అండగా నిలిచారు. సినీ రంగానికి చెందిన కళాకారులు చేపట్టిన 'మనం సైతం' అనేక సహాయ సహాకారాలు అందించారు.

సుదీర్ఘ అనుభవమున్న నేత..



నల్లగొండ, మార్చి 11 (మనం ప్రతినిధి): సీఎం కేసీఆర్ ప్రకటించినట్లుగానే.. రాజ్యసభ సీటు యాదవులకు కట్టబెట్టారు. యాదవుల కోటాలో నల్లగొండ నేత బడుగు లింగయ్య యాదవ్ పేరును సీఎం కేసీఆర్ ప్రకటించారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో తెలుగుదేశం పార్టీకి సుదీర్ఘకాలం అధ్యక్షునిగా పనిచేసిన బడుగు లింగయ్య యాదవ్ ఆ తర్వాత కాలంలో తెలంగాణ వచ్చిన తర్వాత టీఆర్ఎస్‌లో చేరారు. లింగయ్య యాదవ్ స్వస్థలం నల్లగొండ జిల్లా కేతేపల్లి మండలం భీమారం గ్రామం. చెందిన వారు. 1982లో టీడీపీ కార్యకర్తగా రాజకీయ ప్రస్థానం ప్రారంభించారు. 1985-87లో కేతేపల్లి మండలం తెలుగు యువత అధ్యక్షులుగా, 87-97 మధ్య కాలంలో టీడీపీ మండల పార్టీ అధ్యక్షునిగా పనిచేశారు. 1995లో భీమారం నుంచి ఎంపీటీసీ సభ్యునిగా గెలుపొందారు. 1998 -2012 మధ్య కాలంలో టీడీపీ జిల్లా అధ్యక్షునిగా సుదీర్ఘకాలం పనిచేశారు. 2012- 2015 మధ్య టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీగా పనిచేస్తూ పార్టీకి రాజీనామా చేశారు. 2015, మార్చి 16న సీఎం కేసీఆర్ సమక్షంలో టీఆర్ఎస్‌లో చేరిన లింగయ్య ప్రస్తుతం టీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శిగా పనిచేస్తున్నారు. వాస్తవానికి.. నల్లగొండ జిల్లాలో యాదవ వర్గం నుంచి లింగయ్య యాదవ్, నోముల నర్సింహయ్య తీవ్రంగా పోటీ పడ్డారు. అయితే మంత్రి జగదీశ్‌రెడ్డితో లింగయ్యకు ఉన్న సత్సంబంధాలవల్లే రాజ్యసభ సీటు దక్కిందని భావిస్తున్నారు.

అంకితభావానికి దక్కిన పట్టం..



వరంగల్, మార్చి 11 (మనం న్యూస్): పార్టీ పట్ల అంకితభావంతో పని చేసిన వారికి టీఆర్ఎస్‌లో పదవులు దక్కుతాయనేందుకు బండా ప్రకాశ్‌కు రాజ్యసభ సీటు దక్కడం నిదర్శనంగా నిలుస్తోంది. బీసీ (ముదిరాజ్) నేతగా ఓరుగల్లుకు సుపరిచితులైన ప్రకాశ్.. కాంగ్రెస్‌లో మూడు దశాబ్దాలకు పైగా కొనసాగారు. మత్స్యసొసైటీల నిర్వహకునిగా, మత్స్యకార్మిక సంఘాలకు గౌరవ అధ్యక్షునిగా పని చేశారు. వరంగల్ తూర్పు నియోజకవర్గం నుంచి పోటీ చేసేందుకు ప్రయత్నించినా సీటు దక్కలేదు. దాంతో టీఆర్ఎస్‌లో చేరారు. పార్టీలో అత్యంత క్రియాశీలంగా వ్యవహరించారు. ఆయన అంకిత భావాన్ని గుర్తించిన సీఎం కేసీఆర్ రాజ్యసభకు పంపాలని నిర్ణయించారు.

నేటి నుంచే 'బడ్జెట్' అసెంబ్లీ

(మొదటిపేజీ తరువాయి)


బడ్జెట్‌ను ప్రవేశపెడతారు. ఈటలకు ఇదే చివరి బడ్జెట్ కానుంది. షెడ్యూల్ ప్రకారం ఎన్నికలు జరిగితే వచ్చే సంవత్సరం ఓటాన్ అకౌంట్ మాత్రమే ప్రవేశపెట్టే అవకాశం ఉంటుంది. చివరి సమావేశాలు కావడంతో ఈ సారి వీటికి చాలా ప్రాధాన్యం ఉంది. ఎన్నికల సమీపిస్తున్న వేళ సహజంగానే ఈ సారి బడ్జెట్‌లో సంక్షేమ పథకాలకు, మరికొన్ని కొత్త పథకాలకు పెద్దపీట వేస్తారని భావిస్తున్నారు.

అస్త్రాలతో విపక్షాలు సిద్ధం..

చివరి సమావేశాలు కావడంతో ప్రతిపక్షాలు కూడా ప్రభుత్వంపై పెద్దఎత్తున ఎదురు దాడి చేసేందుకు వ్యూహ రచనలు చేసుకుంటున్నాయి. ఈ సమావేశాల్లో దూకుడుగా వ్యవహరిస్తామని కాంగ్రెస్ పార్టీ ఇప్పటికే ప్రకటించింది. కాంగ్రెస్‌తో పాటు, రాష్ట్రంలో ఎలాగైనా పాగా వేయాలని భావిస్తున్న బీజేపీ సైతం దూకుడును ప్రదర్శించే అవకాశం ఉంది. ప్రధానంగా రైతుల గిట్టుబాటు ధరలు, రైతుల ఆత్మహత్యలు, రుణ మాఫీ, మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ పనుల్లో అవినీతి, నేరళ్ళ ఘటన, ఇసుక మాఫీయా, విద్యార్థులకు ఫీజు రీఎంబర్స్ మెంట్, ఉద్యోగాల కల్పన, విభజన హామీలు సాధించడంతో ప్రభుత్వ వైఫల్యాలు ఇలా అనేక సమస్యలపై ఈ సారి సభలో విపక్షాలు అధికార పార్టీపై అన్ని వైపులా నుంచి దాడి చేయనున్నారు. ముస్లిం, గిరిజన రిజర్వేషన్లు, ఆదివాసీలు, గిరిజనుల మధ్య వివాదం వంటి సమస్యలపై కూడా విపక్షాలు పట్టుబట్టే అవకాశం ఉంది. ప్రజా ఉద్యమాల పట్ల పోలీసులు వ్యవహరిస్తున్న తీరు కూడా చర్చకు వచ్చే అవకాశం ఉంది. మరో వైపు కేసీఆర్ జాతీయ రాజకీయాల్లో వెళ్లాలని చేసిన ప్రకటన ప్రభావం కూడా ఈ సమావేశాల్లో పడే సూచనలు ఉన్నాయి.

దూకుడుగా వ్యవహరిస్తాం: కాంగ్రెస్

ఈ సారి సమావేశాల్లో దూకుడుగా వ్యవహరించాలని కాంగ్రెస్ నిర్ణయించింది. వివిధ సమస్యలపై ప్రభుత్వాన్ని గట్టిగా నిలదీస్తామని ప్రకటించింది. బడ్జెట్ సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహంపై కాంగ్రెస్ ఇప్పటికే ఒక నిర్ణయానికి వచ్చింది. ప్రధానంగా రైతుల రుణ మాఫీ విషయంలో ముఖ్యమంత్రి సభను తప్పుదోవ పట్టించేలా వ్యవహరించారని, అందుకు సంబంధించిన వివరాలు, ఆధారాలతో




సభలో నిలదీయాలని భావిస్తోంది. కాగా, కేంద్రం ఏ సాయం చేయడంలేదన్న టీఆర్ఎస్ వాదలను సమర్థవంతంగా ఎదుర్కోవాలని బీజేపీ భావిస్తోంది.

ఎదుర్కొనేందుకు పాలక పక్షం..

విపక్షాల ఆరోపణలు, విమర్శలను ఎదుర్కొనేందుకు పాలక టీఆర్ఎస్ కూడా సంసిద్ధమైంది. ఆరోపణలను ఎదుర్కొనేందుకు ఆధారాలతో సహా వివరించేందుకు సిద్ధమైంది. టీఆర్ఎస్‌కు ఇవే చివరి సమావేశాలు కావడంతో విపక్షాలను ఏకిపారేసేందుకు టీఆర్ఎస్ నేతలు సంసిద్ధమవుతున్నారు. కాగా, సమావేశాల సందర్భంగా ఈ సారి భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. అదనంగా అసెంబ్లీ ప్రాంగణంలో సీసీ కెమెరాలను అమర్చారు. సమావేశాలు జరిగినన్నీ రోజులు అసెంబ్లీ నుంచి రెండు కిలో మీటర్ల వరకు నిషేధాజ్ఞలు అమల్లో ఉంటాయి.

టీడీపీ రాజ్యసభ అభ్యర్థులు వీరే..

- రెండు స్థానాల్లోనూ ఓసీలకు చాన్స్
- సీఎం రమేశ్‌కు మరోసారి అవకాశం



అమరావతి, మార్చి 11 (మనం ప్రతినిధి): రాజ్యసభ అభ్యర్థుల ఎంపికలో తీవ్ర ఉత్కంఠ వీడింది. అధికార తెలుగుదేశం పార్టీ తరపున రాజ్యసభ ఎన్నికలకు అభ్యర్థులు ఖరారయ్యారు. ఎంపీ సీఎం రమేష్ రాజ్యసభ సభ్యత్వం గడువు ముగియగా ఆయనకు రెండోసారి అవకాశం ఇవ్వాలని టీడీపీ నిర్ణయించింది. రెండోసీటును కృష్ణా జిల్లా దివిసీమకు చెందిన పార్టీ లీగల్ సెల్ అధ్యక్షుడు కనకమేడల రవీంద్రకు కేటాయించారు. కేంద్ర మాజీమంత్రి సుజనా చౌదరి కూడా కృష్ణాజిల్లాకు చెందినవారు కావడంతో.. రాజ్యసభలో ఒకే జిల్లాకు చెందిన ఇద్దరు ఎంపిక కావడం ఇదే తొలిసారి అని కృష్ణా జిల్లా టీడీపీ అభిమానులు చెబుతున్నారు. రాజ్యసభ అభ్యర్థుల ఎంపికపై శనివారం ఉదయం నుంచి ఆదివారం మధ్యాహ్నం వరకు పార్టీ అధినేత, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్రమైన కసరత్తు చేశారు. పార్టీ ముఖ్యనేతలు కళా వెంకట్రావు, యనమల రామకృష్ణుడుతో చర్చించిన తర్వాతే ఈ నిర్ణయం తీసుకున్నారు. రాజ్యసభ అభ్యర్థుల ఎంపికపై చంద్రబాబు రెండు రోజుల నుంచి పార్టీ ముఖ్యనేతలతో ప్రాంత, సామాజిక సమీకరణాలపై పార్టీ ముఖ్యనేతలతో సుదీర్ఘంగా చర్చలు జరిపారు. తర్వాత విడివిడిగా ఆశావహులతో మాట్లాడి వారిని బుజ్జగించారు. రాజ్యసభ అభ్యర్థులుగా ఓసీ- ఎస్సీ, ఓసీ-బీసీ కాంబినేషన్‌లో అభ్యర్థులను ఖరారు చేస్తారని అందరూ ఊహించారు. అయితే చివరి నిమిషంలో పేర్లు మారిపోయాయి. చివరి వరకు రేసులో ఉన్న వర్ల రామయ్య, బీద మస్తాన్‌రావులకు రాజ్యసభ చాన్స్ దక్కలేదు.

రైతన్నల 'లాంగ్ మార్చ్'

ముంబై చేరిన మహా పాదయాత్ర.. నేడు మహారాష్ట్ర అసెంబ్లీ ముట్టడి

- 35 వేల మంది రైతుల.. 180 కి.మీ.పాదయాత్ర
- ముట్టడిలో పాల్గొననున్న 80 వేల మంది
- నిండా ముంచేసిన అకాల వర్షాలు
- వడగళ్లతో అన్నదాతలకు కడగళ్లు..
- 19 జిల్లాల్లో కరువు పరిస్థితులు
- ఆదుకోవాలంటూ రైతన్నల గర్జన

ముంబై, మార్చి 11: కరువు దెబ్బకు కుదేలైన తమను ఆదుకోవాలంటూ మహారాష్ట్ర రైతన్నలు చేపట్టిన మహాపాదయాత్ర ఆదివారం ముంబై చేరుకుంది. వామపక్ష అనుబంధ ఆల్ ఇండియా కిసాన్ సభ(ఏఐకేఎస్) ఆధ్వర్యంలో దాదాపు 35 వేల మంది రైతులు.. 180 కిలోమీటర్ల మేర.. సర్రున కాలుతున్న ఎండలో పాదయాత్ర నిర్వహించారు. మహారాష్ట్రలోని వివిధ ప్రాంతాలకు చెందిన వేలాది మంది రైతులు ఇందులో పాల్గొంటున్నారు. ఆదివారం సియాన్‌లోని కేజే సోమయ్య మైదానానికి ఈ పాదయాత్ర చేరుకుంది. సోమవారం మహారాష్ట్ర అసెంబ్లీ ముట్టడి చేయనున్నారు. ఈ కార్యక్రమంలో అదనంగా మరో 50 వేల మంది రైతన్నలు పాల్గొననున్నారని ఏఐకేఎస్ నేత సునీల్ మల్సూరే తెలిపారు. రైతుల పాదయాత్రపై మహారాష్ట్ర సర్కార్ ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. కానీ, రాష్ట్ర ఆర్థికమంత్రి సుధీర్ ముంగంటివర్ స్పందించారు. రైతుల సమస్యల పరిష్కారానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని, రుణమాఫీని అమలుచేస్తున్నామని తెలిపారు. కాగా, రైతుల ముట్టడి నేపథ్యంలో ముంబైలో పోలీసులు భద్రతా ఏర్పాట్లును పటిష్టం చేశారు. ఎక్కడికక్కడే ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. ఉద్యోగులు, విద్యార్థులు ముందుగానే బయలదేరాలని సూచించారు.



నాసిక్ నుంచి పాదయాత్ర మొదలు..

నాసిక్‌లో ఈ నెల 6న మొదలైన మహాపాదయాత్ర ఐదురోజుల్లో దాదాపు 180 కిలోమీటర్ల దూరం సాగింది. ఈ యాత్రలో విదర్భ, మరాఠ్వాడ, ఖండేశ్‌సహా వివిధ ప్రాంతాలకు చెందిన రైతులు పాల్గొంటున్నారు. ముంబై ఆగ్రా జాతీయరహదారి మీదుగా ఈ 'లాంగ్ మార్చ్' కొనసాగుతోంది. ఈ పాదయాత్రలో మహిళా రైతులు, 90 ఏళ్ల పై బడిన వృద్ధులు కూడా పాల్గొంటున్నారు.



రైతులు డిమాండ్లు ఇవీ..

ఈ ఏడాది కరువు పరిస్థితులతో మహారాష్ట్ర రైతులు తీవ్రంగా నష్టపోయారు. అకాల వర్షాలు, వడగళ్లతో పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. తెగుళ్ల కారణంగా పత్తి రైతులు నిండా మునిగారు. ముఖ్యంగా అమరావతి, మరఠ్వాడ, నాగపూర్, నాసిక్ ప్రాంతాల్లో రైతులు దారుణంగా నష్టపోయారు. ఈ నేపథ్యంలో తమను ఆదుకోవాలని, రుణ మాఫీ చేయాలని కోరుతూ రైతులు పాదయాత్ర చేపట్టారు. దాంతో పాటు వ్యవసాయ కరెంట్ బిల్లులను రద్దు చేయాలని, స్వామినాథన్ కమిటీ సిఫారసులను అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. కనీస మద్దతు ధరకు బదులు చట్టబద్ధమైన ధర కల్పించాలని, నష్టపోయిన రైతులకు నష్టపరిహారం పెంచాలని కోరుతున్నారు. ముఖ్యంగా.. అభివృద్ధి కార్యక్రమాల పేరుతో పంట భూములను బలవంతంగా తీసుకోవద్దని, ఆదివాసీలకు అటవీ భూములపై యాజమాన్య హక్కుల కల్పించాలంటున్నారు. నాసిక్, ఠాణె, పాల్‌గఢ్ మధ్య నదుల అనుసంధానంతో ఆదివాసీ గ్రామాలు నష్టపోతున్నాయని, ఈ మార్గాన్ని మార్చాలని డిమాండ్ చేస్తున్నారు.



'ఓటర్'కు ఆధార్ తప్పనిసరి

- సుప్రీంకోర్టులో ఈసీ సవరణ పిటిషన్

న్యూఢిల్లీ, మార్చి 11: ఓటర్ ఐడీ కార్డులతో ఆధార్ సంఖ్యల అనుసంధానంపై ఎన్నికల కమిషన్ మనసు మార్చుకుంది. విశ్వసనీయం సమాచారం ప్రకారం ఓటర్లు స్వచ్ఛందంగా, ఇష్టపడితే తమ ఓటర్ ఐడీని ఆధార్ సంఖ్యతో అనుసంధానం చేసుకోవచ్చునని గతంలో సుప్రీంకోర్టుకు చెప్పినప్పటికీ, తాజాగా దీనికి సవరణ పిటిషన్‌ను సమర్పించింది. ఓటర్ ఐడీ కార్డుకు ఆధార్ సంఖ్యను తప్పనిసరిగా అనుసంధానం చేయాలని ఆదేశించాలని సుప్రీంకోర్టును కోరింది. ఓటర్ ఐడీకి ఆధార్ సంఖ్యను అనుసంధానం చేయడం వల్ల ఓటర్ల మోసాలను నిరోధించవచ్చునని ఎన్నికల కమిషన్ తెలిపింది. అంతే తేకాకుండా ఒక వ్యక్తికి ఒకే ఓటు ఉండేవిధంగా జాగ్రత్తలు తీసుకోవచ్చునని పేర్కొంది. ఇప్పటి వరకు 32 కోట్ల ఓటర్ ఐడీ కార్డులకు ఆధార్ సంఖ్యలను అనుసంధానం చేసినట్లు ప్రధాన ఎన్నికల కమిషనర్ ఓ పీ రావత్ తెలిపారు. సుప్రీంకోర్టు ఆదేశాలు వస్తే మిగిలిన 54.5 కోట్ల ఓటర్ కార్డులను ఆధార్ సంఖ్యలతో అనుసంధానం చేస్తామన్నారు.



జయప్రద.. ఓ ఆడిపాడేది!

- ఆమె వ్యాఖ్యలను పట్టించుకోను: ఆజంఖాన్

లఖ్‌నవ్, మార్చి 11: తనను ఖిల్జీతో పోల్చిన నటి జయప్రదపై ఉత్తరప్రదేశ్ మాజీ మంత్రి, ఎస్పీ నేత ఆజం ఖాన్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. 'నాచ్‌నే గానే వాలీ' (ఆడిపాడేది) అంటూ జయప్రదపై అనుచిత వ్యాఖ్యలు చేశారు. శనివారంనాడు మీడియాతో మాట్లాడిన జయప్రద, పద్మావత్ చిత్రంలో అల్లావుద్దీన్ ఖిల్జీ పాత్ర ఆజంఖాన్‌ను గుర్తు చేసిందని, తాను ఎన్నికల్లో పోటీ చేసిన సమయంలో ఆయన ఏవిధంగా వేధించేవారో కళ్లకు కట్టినట్టయిందని ఆజంఖాన్‌పై విమర్శలు ఎక్కుపెట్టారు. దాంతో ఆజంఖాన్ ఆదివారం మీడియాతో మాట్లాడారు. ''పద్మావత్ చిత్రం వచ్చింది. ఖిల్జీ పాత్ర చెడ్డదని కూడా విన్నా. అయితే ఖిల్జీ రాకముందే పద్మావతి ప్రాణత్యాగం చేసింది. ఇప్పుడు ఒక మహిళ, అందులోనూ ఒక డాన్సర్ నాపై వ్యాఖ్యలు చేస్తోంది. ఆ డాన్సర్ పాటలు వింటూ కూర్చుంటే రాజకీయాలపై నేనెలా దృష్టి సారించగలను?''అంటూ ఆజంఖాన్ వ్యాఖ్యానించారు.

జైల్లో ఖైదీల సెల్ఫీ.. ఆపై ఫేస్‌బుక్‌లో పోస్టింగ్

- యూపీ ముజఫర్ నగర్ జైలులో ఘటన



ముజఫర్ నగర్, మార్చి 11: ఉత్తరప్రదేశ్ జైళ్లలో భద్రతా ఏర్పాట్లకు సంబంధించి చర్యలపై ఆందోళన నేపథ్యంలో ముజఫర్‌నగర్ జైల్లో మరోసారి భద్రత డొల్లతనం బయటపడింది. జైలు ప్రాంగణంలో ఓ ఖైదీ తన తోటి ఖైదీలతో కలిసి సెల్ఫీ దిగి ఆ ఫొటోను ఫేస్‌బుక్‌లో పోస్టు చేసిన ఘటన ఆదివారం వెలుగులోకి వచ్చింది. శనివారం జైల్లో ఉన్న ఖైదీలు సెల్ఫీ దిగి.. మొబైల్ ద్వారా వాట్సాప్, ఫేస్‌బుక్ వంటి సామాజిక మాధ్యమాల్లో సెల్ఫీ ఫొటోలను పోస్టు చేశారు. ఇప్పుడా ఆ ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారడం వివాదాస్పదమైంది. ఈ ఘటనపై స్పందించిన జిల్లా మెజిస్ట్రేట్ ఆ ముగ్గురి ఖైదీలపై మరో కేసు నమోదు చేసినట్టు పోలీసు అధికారి ఒకరు మీడియాకు వెల్లడించారు. వారి వద్ద ఉన్న మొబైల్‌ను జైలు అధికారులు స్వాధీనం చేసుకున్నారు. జైల్లో ఉన్న ముగ్గురు ఖైదీలు ఓ హత్య, హత్యాయత్నం కేసులో నిందితులుగా ఉన్నట్టు జైలు సూపరింటెండెంట్ పేర్కొన్నారు. కొన్నిరోజుల క్రితం ఇదే జైల్లో తన కక్షిదారుడుని (క్లాయింట్) కలిసేందుకుకు వచ్చిన ఓ న్యాయవాది తన షూలో దాచిన రెండు మొబైల్ ఫోన్లతో పోలీసులకు అడ్డంగా దొరికిపోయాడు. జైల్లో మొబైల్ ఫోన్లను అక్రమ రవాణా చేసినందుకు ఆ న్యాయవాదిని పోలీసులు అరెస్టు చేశారు.జెల్లో ఖైదీలు మొబైల్ ఫోన్లు వాడుతూ దొరికిపోవడం ఇది తొలిసారి కాదు. గతంలో కూడా ఇలాంటి ఘటనలు వెలుగు చూశాయి. మార్చి 2016లో జైలు అధికారులు తనిఖీలు చేపట్టగా జైలు ప్రాంగణంలో దాదాపు 22 మొబైల్ ఫోన్లు బయటపడటంతో పోలీసులే ఆశ్చర్యపోయారు. మరోవైపు ఈ ఘటనపై ముజఫ్ఫర్ నగర్ జిల్లా మేజిస్ట్రేట్ రాజీవ్ శర్మ మాట్లాడుతూ.. ఖైదీల చేతికి మొబైల్ ఫోన్లు ఎలా వచ్చాయి అనేదానిపై పూర్తి నివేదికను సమర్పించాల్సిందిగా జైలు అధికారులను ఆదేశించినట్టు చెప్పారు. నివేదిక ఆధారంగా బాధ్యులపై తగిన చర్యలు తీసుకుంటామని శర్మ తెలిపారు.

సౌరశక్తితో సౌభాగ్యం




సమ్మతమైన నిధులతో ప్రాజెక్టులు

- తక్కువ ఖర్చుతో విద్యుత్ తయారీ
- పర్యావరణానికి ముప్పు ఉండదు
- 2022 నాటికి 175 గిగావాట్ల విద్యుత్
- ప్రపంచంలో సౌరవిప్లవం రావాలి
- ఐఎస్ఏ సదస్సులో ప్రధాని మోదీ
- హాజరైన 23 దేశాల అధినేతలు

న్యూఢిల్లీ, మార్చి 11: సౌరశక్తి అభివృద్ధి దేశ సౌభాగ్యానికి దారి తీస్తుందని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ఇంధన రంగంలో సౌర విద్యుత్ వినియోగాన్ని పెంచాలని, సమ్మతమైన, భరించగల నిధులతో సౌర సాంకేతిక పరిజ్ఞానాన్ని అందరికీ అందుబాటులోకి తీసుకు రావాలని పిలుపునిచ్చారు. దీనివల్ల తక్కువ ఖర్చుతో విద్యుత్‌ను తయారు చేయడంతో పాటు భూమిపై కార్బన్ ఉద్గారాలు తగ్గుతాయన్నారు. ఆదివారం ఢిల్లీలో జరిగిన అంతర్జాతీయ సౌరకూటమి (ఐఎస్ఏ) సదస్సులో మోదీ పాల్గొన్నారు. ఈ సదస్సుకు మోదీతో పాటు రామ్‌నాథ్ కోవింద్, ఫ్రాన్స్ అధ్యక్షుడు ఎమ్మాన్యుయెల్ మెక్రాన్ హాజరయ్యారు. భారత్, ఫ్రాన్స్ సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ సదస్సులో 23 దేశాల అధినేతలు పాల్గొన్నారు. దేశ పునరుత్పాదక ఇంధన వనరుల నుంచి 2022 నాటికి 175 గిగావాట్ల విద్యుత్తును ఉత్పత్తి చేస్తుందని మోదీ వెల్లడించారు. దీనిలో 100 గిగావాట్లు సౌర శక్తి నుంచి వస్తుందని తెలిపారు. పర్యావరణాన్ని పరిరక్షిస్తూ ప్రజల ఇంధన అవసరాలను తీర్చేందుకు ప్రపంచవ్యాప్తంగా సౌరవిప్లవం రావాలని ఆకాంక్షించారు. ఇందుకోసం అన్ని దేశాలు కలిసికట్టుగా పనిచేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. పునరుత్పాదక ఇంధన రంగంలో భారత్ ఇప్పటి వరకు సాధించిన పురోగతిని ఫ్రాన్స్ అధ్యక్షుడు మెక్రాన్ సహా 23 దేశాల అధినేతలకు మోదీ వివరించారు. మూడేళ్లలో 28 కోట్ల ఎల్ఈడీ బల్బులను పంపిణీ చేయడం వల్ల రూ.13 వేల కోట్లు, 4 గిగావాట్ల విద్యుత్తు ఆదా అయినట్లు చెప్పారు. సౌరవిప్లవ సాధనకు కార్యాచరణ ప్రణాళికను మోదీ వెల్లడించారు. ఈ యజ్ఞంలో ప్రపంచ దేశాలకు భారత్ తనవంతు తోడ్పాటు అందిస్తుందని హామీ ఇచ్చారు. ఉత్తమమైన, ఇతర రూపాల్లోని ఇంధనాన్ని సౌర శక్తితో అనుసంధానం చేస్తే ఫలితాలు మరింత బాగుంటా యన్నారు. అంతర్జాతీయ సౌరకూటమి పటిష్టంగా, వృత్తిపరమైన సామర్థ్యంతో పని చేసేలా అందరూ కృషి చేయాలని ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు.

వేదాల సారం ఉపయోగించుకోవాలి

వాతావరణ మార్పుల సమస్య పరిష్కారానికి వేదాల సారాన్ని ఉపయోగించుకోవాలని నరేంద్ర మోదీ ప్రపంచానికి పిలుపునిచ్చారు. సూర్యుడు ఈ విశ్వానికి ఆత్మ అని వేదాలు ఘోషిస్తున్నాయని, జీవాన్ని పరిపుష్టం చేసే శక్తి సూర్యుడికి ఉందని చెబుతున్నాయని తెలిపారు. ప్రస్తుతం ప్రపంచాన్ని వేధిస్తున్న వాతావరణ మార్పులతో పోరాడేందుకు తగిన మార్గాన్ని అన్వేషించడంలో భాగంగా ఈ ప్రాచీన దృక్పథాన్ని పరిశీలించాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. సౌరవి ద్యుత్‌కు మరింత ప్రాచుర్యం కల్పించే అంశాలపై ఈ సదస్సు ప్రధా నంగా దృష్టి సారించనుంది. ఆస్ట్రేలియా, యూఏఈ, నైగర్, రువాం డా, ఫిజీ, బంగ్లాదేశ్, శ్రీలంక, సిషెల్స్, ఘనా, మడగాస్కర్, మలావీ, మారిషస్, వెనుజులా, గాబన్ తదితర దేశాధినేతలు హాజరయ్యారు. సౌరశక్తి కూటమి సదస్సు నాలుగు రోజుల పాటు జరగనుంది.



ఆరేళ్ల చిన్నారిపై అత్యాచారం

- హరియాణాలో ఘటన

అంబాలా, మార్చి 11: చిన్నపిల్లలపై అత్యాచార ఘటనలు రోజురోజుకి అధికమవుతున్నాయి. అంతర్జాతీయ మహిళా దినోత్సవం రోజున కొల్‌కతాలో మూడేళ్ల బాలికపై అత్యాచారం జరిగిన విషయం మరువక ముందే హరియాణాలో మరో ఘటన జరిగింది. ఆరేళ్ల వయస్సున్న చిన్నారిపై 27 ఏళ్ల యువకుడు అత్యాచారం చేశాడు. హరియాణా రాష్ట్రంలోని అంబాలా



సమీపంలో ములానా పోలీసు స్టేషన్ పరిధిలోని ఓ చిన్న గ్రామంలో ఆదివారం ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. శనివారం సాయంత్రం ఓ చిన్నారి తన ఇంటి సమీపంలో ఆడుకుంటుండగా, అదే గ్రామానికి చెందిన ఓ యువకుడు బాలికకు మాయమాటలు చెప్పి దగ్గర్లోని పొలాల్లోకి తీసుకెళ్లాడు. అక్కడ బాలికపై దుశ్చర్యకు పాల్పడ్డాడు. తిరిగి ఆమెను ఇంటి సమీపంలో విడిచిపెట్టి పారిపోయాడు. అప్పటికే పాప కోసం వెతుకుతున్న తల్లిదండ్రులు బాలిక కనిపించగానే ఎక్కడికి వెళ్లావని అడుగగా, పాప జరిగిన దారుణాన్ని వివరించింది. దీంతో ఆదివారం ఉదయం బాధిత తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు నిందితుడిని అరెస్టు చేసి వివిధ సెక్షన్‌ల కింద కేసులు నమోదు చేశారు. బాలికను వైద్య పరీక్షల నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

తొలగించిన కాలే.. తలగడ

- యూపీలో వైద్యుల నిర్వాకం
- నలుగురు సిబ్బందిపై వేటు
- ఝాన్సీ మెడికల్ కాలేజీలో ఘటన

ఝాన్సీ(ఉత్తరప్రదేశ్), మార్చి 11: ఆస్పత్రిలో ఓ రోగి చికిత్స పట్ల నిర్లక్ష్యం ప్రదర్శించిన వైద్య సిబ్బందిపై ఉన్నతాధికారులు సస్పెన్షన్ వేటు వేశారు. ప్రమాదంలో తీవ్రంగా దెబ్బతిన్న కాలును తొల గించి దానినే బాధితుడి తలగడగా ఉపయోగించడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమైన నేపథ్యంలో ఆరోగ్యశాఖ స్పందించింది. ఈ ఘటన వివరాలు.. ఉత్తరప్రదేశ్‌లోని ఝాన్సీ జిల్లాలో పాఠశాల బస్సు రోడ్డు ప్రమాదానికి గురైంది. ఈ ఘటనలో బస్సులో ఉన్న పిల్లలతో పాటు హెల్పర్ జ్ఞాన్ శ్యామ్(25) గాయపడ్డారు. స్థానికులు స్పందించి క్షతగాత్రులను దగ్గర్లోని ఝాన్సీ మెడికల్ కాలేజీకి తరలించారు. జ్ఞాన్‌శ్యామ్‌ను పరీక్షించిన వైద్యులు అతడి కాలును తొలగించాల్సిందేనని నిర్ణయించారు. శస్త్ర చికిత్సచేసి కాలును తొలగించారు. ఆ తర్వాత కాలును శ్యామ్ తల కింద దిండుగా అమర్చారు. ఈ విషయాన్ని గమనించిన బాధితుడి బంధువులు తీవ్ర ఆగ్రహం వెలిబుచ్చారు. శ్యామ్ తల కింద దిండు పెట్టాలని బంధువులు కోరగా..ఆస్పత్రి సిబ్బంది పెడచెవిన పెట్టింది. ఈ తతంగాన్ని అంతా అక్కడున్న వ్యక్తి తన సెల్‌ఫోన్‌లో చిత్రీకరించి సామాజిక మాధ్యమాలలో పోస్ట్ చేశాడు. ఈ వైరల్ వీడియోపై స్పందించిన ఉన్నతాధికారులు.. బాధితుడికి చికిత్స అందించిన డాక్టర్ అలోక్ అగర్వాల్, డాక్టర్ మహేంద్ర పాల్ సింగ్, ఇన్‌చార్జి సిస్టర్ దీపానారంగ్, శశి శ్రీవాత్సవలను సస్పెండ్‌చేస్తూ ఆదేశాలు జారీచేశారు.





మాజీ ప్రధానిపై బూటు.. విదేశాంగ మంత్రిపై ఇంకు

పాక్‌లో సామాన్యుడి నిరసనలు

లాహోర్, మార్చి 11: పాక్ మాజీ ప్రధాని నవాజ్ షరీఫ్‌కు చేదు అనుభవం ఎదురైంది.. శనివారం గర్హీ సాహూలో ఓ మీటింగ్‌లో పాల్గొనేందుకు వచ్చిన షరీఫ్‌పై ఓ యువకుడు షూతో దాడిచేశాడు. విదేశాంగ శాఖ మంత్రికీ ఇదే తరహా అనుభవం ఎదురైంది. ఓ మత ఛాందసవాది ఆయన ముఖంపై ఇంకు పోశాడు. రెండు ఘటనలలోనూ నిందితులను పట్టుకున్న కార్యకర్తలు వారిని చితకబాది పోలీసులకు అప్పగించారు. గర్హి సాహూలో జరిగే ఓ సభకు పాక్ మాజీ ప్రధాని నవాజ్ షరీఫ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వేదికపై ప్రసంగించేందుకు లేచారు. అదేసమయంలో ఓ యువకుడు తన షూ తీసి షరీఫ్ పైకి విసిరేశారు. ఈ దాడికి పాల్పడిన యువకుడిని షరీఫ్ మద్దతుదారులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. అయితే స్థానికుల దెబ్బలతో తీవ్రంగా గాయపడిన నిందితుడిని పోలీసులు ఆస్పత్రికి తరలించారు. ఇక మరో ఘటనలో పంజాబ్ ప్రావిన్స్‌లో శనివారం రాత్రి జరిగిన పార్టీ కార్యకర్తల సమావేశంలో పాకిస్థాన్ విదేశాంగ మంత్రి ఖవాజా ఆసిఫ్ ముఖంపై ఓ మత ఛాందసవాది ఇంకు పోశాడు. ఈ సమావేశంలో ఖవాజా ఆసిఫ్ ప్రసంగిస్తుండగా ఈ ఘటన జరిగింది. ఇంకుపూసిన వ్యక్తిని రసూల్‌గా గుర్తించారు. ఘటన అనంతరం రసూల్‌ను చితకబాదిన కార్యకర్తలు పోలీసులకు అప్పగించారు. ముస్లింల మనోభావాలు దెబ్బతీసేలా రాజ్యాంగంలో మహ్మద్ ప్రవక్త సిద్ధాంతాలను మార్చేందుకు ప్రభుత్వం ప్రయత్నించిందని రసూల్ ఆరోపించాడు. కాగా, దీనిపై స్పందించిన ఖవాజా ఆసిఫ్.. అతడెవరో తనకు తెలియదని, బహుశా ప్రతిపక్ష నేతలు అతడికి డబ్బిచ్చి ఇలా చేయించి ఉండొచ్చన్నారు. తన ముఖానికి ఇంకు పూసిన వ్యక్తిని క్షమిస్తున్నానని,



అతడిని విడిచిపెట్టాల్సిందిగా పోలీసులకు చెబుతానని అన్నారు. అయితే, ఇలాంటి ఘటనల వల్ల తన రాజకీయాలేమీ మారవని, వీటి వల్ల తనకు సానుభూతి పెరుగుతుందని చెప్పుకొచ్చారు. కాగా, ప్రవక్త మహమ్మద్ గురించి రాజ్యాంగంలో మార్పులు చేయడానికి పీఎంఎల్-ఎన్ పార్టీ ప్రయత్నించిందని, అది తన మనోభావాలను దెబ్బతీసిందని నిందితుడు ఫయాజ్ రసూల్ తెలిపాడు. దానికి నిరసనగానే తానీ పనిచేసినట్లు పోలీసులకు వివరించాడు.

పాటలు పాడుకుంటున్న భరత్


మహేష్

'శ్రీమంతుడు' వంటి విజయవంతమైన చిత్రం తరువాత మహేశ్ బాబు, కొరటాల శివ కాంబినేషన్‌లో రూపొందుతున్న సినిమా 'భరత్ అనే నేను'. కైరా అద్వాని హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రాన్ని డి.వి.వి.దానయ్య నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ఓ సాంగ్‌ను అన్నపూర్ణ సెవెన్ ఏకర్స్‌లో చిత్రీకరిస్తున్నారు. దేవిశ్రీ ప్రసాద్ సంగీతమందిస్తున్న ఈ చిత్రాన్ని ఏప్రిల్ 20న విడుదల చేయడానికి సన్నాహాలు జరుగుతున్నాయి. ఇదిలా ఉంటే.. ఈ సినిమా ఆడియోని ఏప్రిల్ 7న రిలీజ్ చేయబోతున్నారని తెలిసింది. త్వరలోనే ఆడియో రిలీజ్ డేట్, వేదికపై క్లారిటీ వస్తుంది.

ఏయన్నార్ పాత్రలో...

యువ కథానాయకుడు అక్కినేని నాగచైతన్య.. తన తాతయ్య అక్కినేని నాగేశ్వరరావు పాత్రలో సందడి చేయనున్నారా? అవుననే వినిపిస్తోంది టాలీవుడ్ సర్కిల్స్‌లో. కాస్త వివరాల్లోకి వెళితే.. నటీమణి సావిత్రి జీవితకథ ఆధారంగా 'మహానటి' పేరుతో సినిమా తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. నాగ అశ్విన్ రూపొందిస్తున్న ఈ చిత్రంలో కీర్తి సురేష్ టైటిల్ రోల్‌లో నటిస్తోంది. జెమిని గణేశన్ పాత్రలో దుల్కర్ సల్మాన్, ఎస్వీఆర్ పాత్రలో మోహన్ బాబు, జర్నలిస్ట్ పాత్రల్లో సమంత, విజయ్ దేవరకొండ నటిస్తున్నారు. అలాగే సావిత్రి సినీ జీవితంలో కీలక పాత్రలు పోషించిన నందమూరి తారక రామారావు, అక్కినేని నాగేశ్వరరావు పాత్రలకు కూడా ఈ సినిమాలో చోటు ఉందని చాలా రోజులుగా వార్తలు వినిపించాయి. అంతేగాకుండా, ఆ పాత్రల్లో నటించే తారలపై రకరకాల కథనాలు వినిపించాయి.

అయితే.. ఎట్టకేలకు ఏఎన్నార్ పాత్రకు సంబంధించి క్లారిటీ వచ్చేసింది. ఏఎన్నార్ మనవడు నాగచైతన్య ఆ పాత్రలో కనిపించడానికి అంగీకారం తెలిపారని సమాచారం. అందులో భాగంగా.. రెండు రోజులు షూటింగ్ చేయడానికి డేట్స్ కూడా ఇచ్చారని.. త్వరలోనే చైతన్యపై ఏఎన్నార్‌కు సంబంధించిన సన్నివేశాలను తెరకెక్కించనున్నారని తెలిసింది. దీనికి సంబంధించిన అధికారిక సమాచారం రావాల్సి ఉంది. ఇదిలా ఉంటే.. ఎన్టీఆర్ పాత్రలో ఎవరు నటిస్తారు? అనే దానిపై ఇంకా క్లారిటీ రాలేదు. తమిళ కథానాయకుడు సూర్య నుంచి నాని వరకు చాలామంది పేర్లు వినిపించాయి. త్వరలోనే దీనిపైనా క్లారిటీ వస్తుంది.


నాగచైతన్య

రీమేక్‌లో ప్రియా ప్రకాశ్?

ప్రియా ప్రకాశ్ వారియర్.. సోషల్ మీడియాలో వింక్ గర్ల్‌గా సెన్సేషన్ సృష్టించిన ఈ మలయాళీ భామ గురించి పరిచయ వాక్యాలు అవసరం లేదు. 'ఒరు అదార్ లవ్' అనే మలయాళ చిత్రం ద్వారా తెరంగేట్రం చేయబోతున్న ఈ సుందరికి తొలి చిత్రం విడుదల కాకముందే.. టాలీవుడ్ నుంచే కాదు బాలీవుడ్ నుంచి కూడా వరుస ఆఫర్లు క్యూ కడుతున్నాయి. అయితే ప్రియా మాత్రం ఆచితూచి అడుగులు వేస్తోంది. ఇదిలా ఉంటే.. ఎన్టీఆర్ హీరోగా



నటించిన 'టెంపర్' చిత్రం.. హిందీలో 'సింబా' పేరుతో రీమేక్ అవుతున్న సంగతి తెలిసిందే. రణ్‌వీర్ సింగ్ కథానాయకుడిగా నటిస్తున్న ఈ సినిమాని సక్సెస్‌ఫుల్ డైరెక్టర్ రోహిత్ శెట్టి రూపొందిస్తుండగా.. కరణ్ జోహార్ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. ఈ సినిమాలో రణ్‌వీర్‌కి జోడీగా అలియా భట్, శ్రద్ధా కపూర్, జాన్వి కపూర్ వంటి పేర్లు పరిశీలనలోకి వచ్చాయి. అయితే వీరిలో ఎవరూ కన్‌ఫర్మ్ కాలేదు. తాజాగా ఈ లిస్ట్‌లోకి మరో పేరు వచ్చి చేరింది. ఆ పేరే.. ప్రియ ప్రకాశ్. త్వరలోనే ప్రియ ఎంపికపై క్లారిటీ వస్తుంది.

ఎంటర్‌టైన్మెంట్+మెసేజ్= కిరాక్‌పార్టీ



నిఖిల్ హీరోగా నటించిన చిత్రం 'కిరాక్ పార్టీ' ఎ.కె.ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై రామబ్రహ్మం సుంకర ఈ చిత్రాన్ని నిర్మించారు. శరణ్ కోపిశెట్టి దర్శకుడు. నిఖిల్ సరసన సంయుక్త హెగ్డే, సిమ్రాన్ పరీంజా కథానాయికలుగా నటిస్తున్నారు. ఈ చిత్రానికి యువ దర్శకులు సుధీర్ వర్మ స్క్రీన్ ప్లే, చందు మొండేటి సంభాషణలు సమకూర్చారు. తాజాగా ఈ చిత్రం ఆడియో వేడుకను విజయవాడలో నిర్వహించారు. అల్లరి నరేశ్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. అల్లరి నరేష్ ఆడియో సీడీని విడుదల చేసి మొదటి సీడీని నిర్మాత రామబ్రహ్మం సుంకరకు అందించారు. అనిల్ సుంకర మాట్లాడుతూ.. ''ఈ చిత్రం కోసం వర్క్ చేసిన సుధీర్ వర్మ, చందు మొండేటిలకు ప్రత్యేక కృతజ్ఞతలు. కాలేజ్ లో షూటింగ్‌కి పర్మిషన్ ఇవ్వడమే కాక ఆడియో రిలీజ్‌కి కూడా సహకరించిన ఉషారామా విద్యాసంస్థ యాజమాన్యానానికి కృతజ్ఞతలు. మార్చి 16న సినిమా విడుదలవుతుంది'' అన్నారు. అల్లరి నరేష్ మాట్లాడుతూ ''ఈ సినిమా కన్నడలో ఎంత పెద్ద హిట్ అయ్యిందో.. అదే స్థాయిలో తెలుగులోనూ సూపర్ హిట్ అవ్వాలని ఆశిద్దాం'' అన్నారు. చిత్ర కథానాయకుడు నిఖిల్ మాట్లాడుతూ.. ''కన్నడలో ఇంత మంచి సినిమా ఒకటి ఉందని గుర్తించి.. నాకు ఈ కథలో నటించే అవకాశాన్ని ఇచ్చిన అనిల్ సుంకర గారికి స్పెషల్ థ్యాంక్స్ చెప్పాలి. ''కార్తికేయ''తో చందు మొండేటి, ''స్వామి రారా''తో సుధీర్ వర్మకు ఎలాంటి మంచి పేరు వచ్చిందో.. ''కిరాక్ పార్టీ''తో శరణ్ కి కూడా అదే స్థాయి పేరొస్తుంది. ఎంటర్‌టైన్మెంట్‌తోపాటు మంచి మెసేజ్ కూడా ఉన్న సినిమా ఇది'' అన్నారు. చిత్ర దర్శకుడు శరణ్ కొప్పిశెట్టి మాట్లాడుతూ.. ''మార్చి 16న స్టూడెంట్స్ అందరూ మాస్ బంక్ కొట్టి మరీ ''కిరాక్ పార్టీ'' ఎంజాయ్ చేస్తారని కోరుకొంటున్నాను. ప్రతి ఒక్క విద్యార్థి ఎంజాయ్ చేసేలా సినిమా ఉంటుంది'' అన్నారు.

ప్రేమికుల వీరగాథ

ప్రియమణి టైటిల్ పాత్రలో శ్రీ శంఖు చక్ర ఫిలింస్ పతాకంపై కోటి తూముల, ఎ.హితేష్ రెడ్డి సంయుక్తంగా నిర్మిస్తోన్న చిత్రం 'అంగుళీక'. ప్రేమ్ ఆర్యన్ దర్శకుడు. దీపక్ హీరోగా నటించారు. ఈ చిత్ర టీజర్‌ను ప్రముఖ దర్శకులు కోడి రామకృష్ణ విడుదల చేశారు. కోడి రామకృష్ణ మాట్లాడుతూ ''టీజర్ చాలా బాగుంది. ఎన్ని అడ్డంకులు వచ్చినా అన్నింటినీ తట్టుకుంటూ నిర్మాతలు ఇంత వరకూ తీసుకొచ్చారు. డైరక్టర్‌కు అండగా నిలబడ్డారు. ఈ చిత్రం ద్వారా పరిచయం అవుతున్న నిర్మాతలకు మంచి లాభాలు, దర్శకుడికి మంచి పేరు రావాలి'' అన్నారు. నిర్మాతలు మాట్లాడుతూ''సూర్యగ్రహణం, కాలచక్రంతో కూడుకున్న కథాంశం ఇది. దర్శకుడు చాలా కాలం ఈ స్క్రిప్ట్‌పై వర్క్ చేసి అద్భుతంగా తెరకెక్కించారు. ప్రస్తుతం గ్రాఫిక్స్ వర్క్ జరుగుతోంది. సినిమా అనుకున్న దానికన్నా చాలా బాగా వచ్చింది. అన్ని వర్గాల ప్రేక్షకులకు నచ్చే చిత్రంగా భారీ బడ్జెట్ తో ఎక్కడా రాజీ పడకుండా నిర్మించాం'' అన్నారు. దర్శకుడు ప్రేమ్ ఆర్యన్ మాట్లాడుతూ ''కోడి రామకృష్ణగారి ఇనిస్పిరేషన్‌తో ఈ చిత్రాన్ని డైరెక్ట్ చేశాను. ఎన్ని అడ్డంకులు వచ్చినా మా నిర్మాత అన్నింటినీ అధిగమిస్తూ సినిమాను అనుకున్న విధంగా తెరకెక్కించడానికి సహకరించారు. కాలచక్రంతో ముడిపడిన ఇద్దరు ప్రేమికుల వీరగాథ ఈ చిత్రం. కాలచక్రం, సూర్యగ్రహణం ఈ రెండు అంశాల చుట్టూ సినిమా తిరుగుతుంది''అన్నారు.


ప్రియమణి

ఈ నెల 23న కథ రివీల్


శ్రీవిష్ణు, సాట్నా టైటస్

శ్రీవిష్ణు హీరోగా నటించిన 'నీది నాది ఒకే కథ' చిత్రం మార్చి 23న విడుదల కానుంది. శ్రీ విష్ణు ఇందులో స్టూడెంట్ గా కనిపిస్తారు. వేణు ఊడుగుల దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో 'బిచ్చగాడు' ఫేమ్ సాట్నా టైటస్ హీరోయిన్‌గా నటించింది. అరాన్ మీడియా వర్క్స్, శ్రీ వైష్ణవి క్రియేషన్స్ బ్యానర్స్‌పై .ప్రశాంతి, కృష్ణ, విజయ్, అట్లూరి నారాయణ రావు ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఈ సినిమాకి సురేశ్ బొబ్బిలి సంగీతం అందిస్తున్నారు. 'మెంటల్ మదిలో' తర్వాత శ్రీవిష్ణు హీరోగా వస్తున్న సినిమా ఇది.

సల్మాన్‌తో ప్రభుదేవా

బాలీవుడ్ కండల వీరుడు సల్మాన్‌ఖాన్ మరోసారి ప్రభుదేవా దర్శకత్వంలో సినిమా చేయబోతున్నారు. వివరాల్లోకెళ్తే.. ఇంతకు ముందు సల్మాన్‌ఖాన్, ప్రభుదేవా కాంబినేషన్‌లో వచ్చిన 'వాంటెడ్' సినిమా మంచి విజయాన్ని సొంతం చేసుకున్న సంగతి తెలిసిందే. ఈ సినిమాతో సల్మాన్ క్రేజ్ మాస్‌లో మరింత పెరిగింది. ఈ సినిమా తర్వాత సల్మాన్, ప్రభుదేవా కలయికలో మరో సినిమా రాలేదు. ఇప్పుడు మరో సినిమా రానుంది. అది కూడా సల్మాన్ కెరీర్‌లో వన్ ఆఫ్ ది బిగ్గెస్ట్ హిట్‌గా నిలిచిన 'దబాంగ్'కి సీక్వెల్‌గా రూపొందుతోన్న 'దబాంగ్ 3'ని ప్రభుదేవా డైరెక్ట్ చేయనున్నారు. సల్మాన్‌ఖాన్‌తో సినిమా చేసే అవకాశాన్ని అసలు వదులుకోనని ప్రభుదేవా తెలియజేయడం విశేషం. ఈ సినిమా ప్రభుదేవాకు బాలీవుడ్‌లో ఏడో సినిమా. కాగా ఇప్పటి వరకు దక్షిణాదిన కూడా ప్రభుదేవా ఏడు చిత్రాలనే డైరెక్ట్ చేయడం గమనార్హం.





సన్నీ బయోపిక్

సన్నీ లియోన్.. భారతీయ ప్రేక్షకులకు పరిచయం అక్కర్లేని హాట్ బ్యూటీ పేరిది. కెనడాలో పోర్న్ స్టార్‌గా మొదలైన ఈమె ప్రయాణం.. ఆపై బాలీవుడ్ వైపుగా సాగింది. తరువాత బాలీవుడ్‌తో పాటు దక్షిణాదిలోనూ నటిగా, ఐటమ్ గర్ల్‌గా తనదైన ముద్ర వేసింది ఈ హాట్ బ్యూటీ. ఇదిలా ఉంటే.. ఈ అందాల తార జీవితం త్వరలోనే తెరపైకి రానుంది. అయితే సినిమాగా కాదు.. వెబ్ సిరీస్‌గా ఆమె జీవితం తెరపై ఆవిష్కృతం కానుంది. సన్నీ లియోన్ అసలు పేరు కరణ్‌జీత్ కౌర్ వోరా అన్న సంగతి తెలిసిందే. ఇప్పుడు ఆ పేరులోని 'కరణ్‌జీత్'ని టైటిల్‌గా పెట్టి ఈ వెబ్ సిరీస్ రూపొందిస్తున్నారు.

ఈ వెబ్ సిరీస్‌లో.. సన్నీ తన పాత్రని తానే చేస్తుందా? లేకుంటే.. మరెవరైనా చేస్తారా? అనేది ప్రస్తుతానికి సస్పెన్స్. తన సోషల్ మీడియా ఖాతాలో ఈ వెబ్ సిరీస్ విషయాన్ని సన్నీయే స్వయంగా అభిమానులతో పంచుకుంది. ఈ సిరీస్‌లో తన జీవితంలో చోటుచేసుకున్న కొన్ని ఆసక్తికరమైన సంఘటనలకు తెర రూపం ఇస్తున్నట్లుగా ఈ ముద్దుగుమ్మ చెప్పుకొచ్చింది. మొత్తం మీద.. సన్నీ అభిమానులకు ఇది శుభవార్తే.


సన్నీ లియోన్



మార్చి 30న 'అమీర్ పేట్ టు అమెరికా'

శ్రీమతి స్వప్న కొమండూరి సమర్పణలో రాధా మీడియా బ్యానర్‌పై తెరకెక్కుతోన్న చిత్రం 'అమీర్ పేట్ టు అమెరికా'. ఈ చిత్ర మొదటి ట్రైలర్ ను నటుడు తనికెళ్ళ భరణి విడుదల చేయగా రెండవ ట్రైలర్‌ను రవికుమార్ లాంచ్ చేశారు. బందూక్ లక్ష్మణ్, డా. శ్రీనివాస్, నిర్మాత పద్మజ, కాసర్ల శ్యామ్, నటి మణిచందన, డా. రాజేశ్వరి, అంబర్ పేట్ శంకర్, మ్యూజిక్ డైరెక్టర్ కార్తీక్, మల్లన్న, సత్తి, మంగ్లీ, గాంధీ, గాయత్రి గుప్తా తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

తనికెళ్ల భరణి మాట్లాడుతూ ''టైటిల్ చాలా రియలిస్టిక్ గా ఉంది. అమీర్ పేట్ టు అమెరికా ఈ ప్రయాణాన్నంతా ఈ సినిమాలో చూపించడం జరిగింది. నేను ఇందులో మంచి పాత్రను పోషించాను. సినిమాకు అన్నీ తానై రామ్మోహన్ భుజాలమీద వేసుకున్నారు. యూత్‌ను అలరించే అన్నీ అంశాలు ఈ చిత్రంలో ఉన్నాయి. మార్చి 30న ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నారు'' అని అన్నారు. రామ్మోహన్ కొమండూరి మాట్లాడుతూ ''80 శాతం చిత్రాన్ని అమెరికాలో మిగతా 20 శాతం ఇండియాలో చిత్రీకరించాం. ఈ నెల 3న ఆడియో 30న చిత్రాన్ని విడుదల చేస్తాం'' అన్నారు. నిర్మాత పద్మజ మాట్లాడుతూ ''ఈ చిత్రాన్ని తెరకెక్కించిన రామ్మోహన్ గారు నా మరిది. సినిమాను చాలా కష్టపడి తీశారు. నటీనటులు అందరూ ఎంతో సహకరించారు. మంచి సబ్జెక్ట్ ఉన్న సినిమా కనుక తప్పకుండా విజయం సాధిస్తుందని ఆశిస్తున్నా'' అన్నారు.

'బంగారు తెలంగాణ' పాటలు విడుదల



బిపిన్, రమ్య, అక్షర, లయన్ ఏవీ స్వామి, బాబూమోహన్, సాయి త్రిశాంక్ ప్రధాన పాత్రల్లో రూపొందుతోన్న చిత్రం 'బంగారు తెలంగాణ'. షిరిడి సాయి క్రియేషన్స్ పతాకంపై బిపిన్ దర్శక నిర్మాణంలో ఈ సినిమా తెరకెక్కుతోంది. ఈ సినిమా పాటలు శనివారం విడుదలయ్యాయి. అదే రోజు ఉదయం సినిమాటోగ్రఫీ మినిస్టర్ తలసాని శ్రీనివాస యాదవ్ కార్యాలయంలో బంగారు తెలంగాణ ఆడియో సీడీలను రిలీజ్ చేశారు. నటుడు, నిర్మాత, దర్శకుడు బిపిన్ మాట్లాడుతూ ''తెలంగాణ కోసం ఎంతోమంది పోరాటం చేసి ఆత్మ బలిదానాలు చేసుకొన్నారు. ముఖ్యంగా కేసీఆర్ గారు ఆమరణ నిరాహార దీక్ష చేసి తెలంగాణ కోసం ప్రాణాలు లెక్క చేయకుండా పోరాటం చేసి తెలంగాణను సాధించారు. కేసీఆర్ గారి కృషి వల్లే బంగారు తెలంగాణ సాధ్యం అయింది. అసలు తెలంగాణ ఎలా వచ్చింది? అనే కథాంశంతో ఈ చిత్రాన్ని తెరకెక్కించాం. ఈ చిత్రంలో ఐదు పాటలు వున్నాయి. బండారు దానయ్య సహకారంతో ఈ పాటలన్ని నేనే రాశాను'' అన్నారు. కో ప్రొడ్యూసర్ ఏవీ స్వామి మాట్లాడుతూ ''1969 నుండి ఇప్పటి వరకు ఆరు దశాబ్దాలుగా తెలంగాణ సాధించడానికి ఎంతో మంది ఆత్మ బలిదానాలు చేసుకొని ప్రాణాలు అర్పించారు. కేసీఆర్ గారు తెలంగాణ వచ్చుడో... నేను సచ్చుడో.. అనే నినాదంతో ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాటం చేసి తెలంగాణను సాధించారు. బిపిన్ తెలంగాణ గురించి నేటి ప్రజలకు యువకులకు తెలిసేలా ఈ చిత్రాన్ని అద్భుతంగా రూపొందించారు. ఈ చిత్రంలో నేను లాయర్ పాత్ర చేశాను'' అన్నారు.

కమలం గూటికి కవిత

- తెలుగుదేశం పార్టీకి షాక్
- రాజీనామా.. వెంటనే చేరిక
- టీడీపీ కోసం ఎంతో కష్టపడ్డా
- ఎన్నో అవమానాలు ఎదుర్కొన్నా
- పనిచేసి వారికి మొండిచేయి: నటి



అమరావతి, మార్చి 11: తెలుగుదేశం పార్టీ రాష్ట్ర మహిళా నాయకురాలు, సినీ నటి కవిత ఆ పార్టీని వీడి బీజేపీలో చేరారు. ఆదివారం విజయవాడలో జరిగిన బీజేపీ కోర్ కమిటీ సమావేశంలో ఆమె బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. టీడీపీలో కొంతకాలంగా అసంతృప్తిగా ఉన్న కవిత కమలం గూటికి వెళతారని వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. ఆదివారం టీడీపీకి సడన్ షాకిచ్చి బీజేపీ గూటికి చేరుకున్నారు. ఏపీ బీజేపీ అధ్యక్షుడు, విశాఖ ఎంపీ హరిబాబు.. కవితకు కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు.

టీడీపీ నాయకత్వంపై అసంతృప్తి!

టీడీపీలో ఆర్య వైశ్యులకు తీవ్ర అన్యాయం జరుగుతోందని ఆమె అసంతృప్తికి లోనయ్యారని తెలుస్తోంది. పార్టీలో కష్టపడిన వారికి గుర్తింపు లభించడం లేదన్న ఆగ్రహంతో ఈ నిర్ణయం తీసుకున్నట్టు సమాచారం. పార్టీలో ఎమ్మెల్సీ పదవులతో పాటు నామినేటెడ్ పదవులు వైశ్యులకు దక్కలేదని, తనకు ఎమ్మెల్యే టికెట్ ఇస్తానని చెప్పి కూడా ఇవ్వలేదని ఆమె ఆవేదన చెందినట్టు తెలుస్తోంది. ఎన్టీఆర్ ఉన్నప్పటి టీడీపీకి, ఇప్పుడున్న పార్టీకి పోలిక లేదని కవిత వ్యాఖ్యానించారని సమాచారం.

కమలం గూటికి చేరిన అనంతరం కవిత మీడియాతో మాట్లాడుతూ.. ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రవేశపెట్టిన పథకాల స్ఫూర్తితో బీజేపీలో చేరానని చెప్పారు. తాను టీడీపీ నుంచి బయటకు రాలేదనీ.. ఆ పార్టీ నుంచి గెంటివేతకు గురయ్యానని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. టీడీపీ బలోపేతానికి అహర్నిశలు కష్టపడ్డానని, టీడీపీలో అనేక అవమానాలు ఎదుర్కొన్నానని, చంద్రబాబును తిడుతున్నవారికి పదవులిచ్చారని, పార్టీ కోసం పనిచేసినవారికి మొండిచేయి చూపారని కవిత విమర్శించారు.


టీడీపీ నుంచి గెంటివేతకు గురయ్యా

మహానాడులో కలత చెందిన కవిత

టీడీపీ అధికారంలోకి రానప్పుడు తనకు ఎంతో గౌరవం ఇచ్చారని, పార్టీకి సంబంధించిన ఏ చిన్న మీటింగ్ జరిగినా తనకు ఆహ్వానం అందించేవారని, అధికారంలోకి వచ్చాక పూర్తిగా తనను పక్కన పెట్టారని వాపోయారు. మహానాడులో తనను అవమానించారని, తనతో కన్నీరు పెట్టించారని కవిత గతంలో వ్యాఖ్యానించారు. ''తెలుగుదేశం పార్టీలో మహిళలకు కనీస గౌరవం లేదు. సినిమా వాళ్లంటే మరీ చిన్నచూపు. గడిచిన మూడేళ్లుగా ఎన్నో అవమానాలకు గురిచేశారు.. చేస్తున్నారు. చాలా క్షోభపెట్టారు. ఇలాంటి పార్టీలో ఎందుకు ఉండాలి. అందుకే ఆ పార్టీలో కొనసాగదాలచుకోలేదు'' అని కవిత అన్నారు. తెలుగుదేశం పార్టీ మహానాడులో జరిగిన అవమానం తర్వాత పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటూ వస్తున్నారు. అప్పట్లోనే బీజేపీ గూటికి చేరటానికి ఆమె ప్రయత్నాలు కూడా చేశారు. ఈ క్రమంలో తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు లక్ష్మణ్‌తో భేటీ అయ్యారు. అప్పట్నుంచి వేచి చూసిన కవిత ఎట్టకేలకు కమలం గూటికి చేరుకున్నారు.

అయ్యో.. ఆఫ్‌షోర్!

- మంజూరైన నిధులు..రూ.466 కోట్లు
- ప్రారంభించాల్సిన తేదీ.. జూలై 31
- ఇప్పటివరకు అతీగతీ లేని పనులు
- పునాదుల స్థాయి దాటనివే ఎక్కువ
- మట్టి.. కాంక్రీటు పనులది అదే తీరు
- పురోగతిని పట్టించుకోని పాలకులు
- నిధులున్నా..ముందుకు సాగని వైనం



శ్రీకాకుళం, మార్చి 11 (మనం న్యూస్‌బ్యూరో): వెనకబడిన ఉత్తరాంధ్ర ప్రాంతంలోని శ్రీకాకుళం జిల్లాకు వరప్రదాయినిగా ఉండి, పంటలు పండేందుకు ఉపయోగపడుతుందనుకున్న ఆఫ్‌షోర్ రిజర్వాయర్ పనులు నత్తతో పోటీ పడుతున్నాయి. జిల్లాకు సాగునీటి వనరులను పుష్కలంగా అందించాలన్న ఉద్దేశంతోనే ఒకవైపు వంశధార రిజర్వాయర్, మరో వైపు పలాస, టెక్కలి నియోజకవర్గాలకు సాగునీరు అందించేందుకు ఉద్దేశించిన ఆఫ్‌షోర్ రిజర్వాయర్ పనులను వేగవంతం చేశాయి. అధికార యంత్రాంగం ప్రత్యేక శ్రద్ధ కనబరచడంతో వంశధార పనులు పరుగు పెడుతున్నా.. ఆఫ్‌షోర్ రిజర్వాయర్ పనులు మాత్రం ఎక్కడివక్కడే ఉండిపోయాయి. జూలై 31 నాటికి రిజర్వాయర్ పనులు పూర్తి చేసి, సాగునీరు అందించాలని ప్రభుత్వం భావించింది. కానీ ఇప్పటికి కనీసం 30 శాతం పనులు కూడా పూర్తికాలేదు.

ప్రత్యేక శ్రద్ధ అవసరం

శ్రీకాకుళం జిల్లాలో ప్రస్తుతం వంశధార ప్రాజెక్ట్ పరిధిలో నిర్మిస్తున్న హిరమండలం జలాశయం తరువాత నిర్మించే మరో జలాశయం ఆఫ్‌షోర్ ప్రాజెక్టే. దీని సామర్థ్యం 2.05 టీఎంసీలుగా నిర్ణయించారు. జలాశయం గట్టు నిర్మాణం బాలారిష్టాలు దాటలేదు. ఇక కాంక్రీట్ నిర్మాణాలు పునాదుల దశను కూడా దాటలేదు. ఇదిగో.. అదిగో పూర్తి చేస్తున్నామంటూ అధికారులు, ప్రజా ప్రతినిధులు హడావిడి చేస్తున్నారు తప్ప.. క్షేత్రస్థాయిలో ఆ పరిస్థితి లేదు. పనుల్లో ఎక్కడా వేగం కనిపించడం లేదు. మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడి సొంత నియోజకవర్గం టెక్కలి కాబట్టి ఆయన కలగజేసుకుంటే తప్ప పనులు ముందుకు సాగేలా లేవు.

వ్యూహం ఇలా..

మహేంద్రతనయ నుంచి కాలువలోకి నీటిని విడుదల చేసి, ఆపై నియంత్రించి, పంపించే నిర్మాణాలు మెళియాపుట్టి మండలం చాపర వద్ద ప్రారంభం కావాలి. ఇక్కడి ఇన్‌లెట్ రెగ్యులేటర్ మొదలుకొని కాలువ ప్రవహించే 13 కి.మీ. పొడవునా అనేక నిర్మాణాలు చేపట్టాలి. కానీ అవేమీ చేయడం లేదు. కాలువ శివారైన.. నందిగాం మండలం పెదగురువూరు వద్ద కాలవలో నుంచి నీటిని జలాశయంలోకి పంపించేందుకు హెడ్ రెగ్యులేటర్ నిర్మించాలి. ఇలా మొత్తంగా 29 కట్టడాలు పూర్తి కావాలి. వీటిలో ఇప్పటి వరకు కేవలం 9 కట్టడాలు మాత్రమే ప్రారంభమయ్యాయి. అది కూడా గోతుల వరకే. కానీ జలవనరుల శాఖ మాత్రం వింత నివేదికలు సమర్పిస్తోంది. పనులు శరవేగంగా సాగుతున్నాయని, ఇప్పటికే కొన్ని పూర్తయ్యాయని, మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయని చెబుతోంది. ఇక టెక్కలి–మెళియాపుట్టి ప్రధాన రహదారిలో రెండు వరుసల వంతెనలు మూడు నిర్మించాలి. వీటికి చాలా సమయమే పట్టేలా ఉంది. కొండను తొలిచే టన్నెల్ నిర్మాణమే అసలు సిసలైన పరీక్ష. కొండకు రెండువైపులా ఇంకా పదేసి మీటర్ల లోతుకు వెళ్తే గానీ సొరంగం పనులు పూర్తి కావు. అవి పూర్తి కాకుండా.. ఒక్క అడుగు కూడా ముందుకు పడే అవకాశం లేదని సాగునీటి రంగ నిపుణులే చెబుతున్నారు.

పనుల పురోగతి ఇలా..



వాస్తవానికి ఈ ప్రాజెక్టుకు సంబంధించి..72.61 లక్షల క్యూబిక్ మీటర్ల మేర మట్టి పని చేపట్టాలి. కానీ ప్రస్తుతం 35.93లక్షల క్యూబిక్ మీటర్ల మేర మాత్రమే పనులు పూర్తయ్యాయి. కాంక్రీట్ పని 68,704 క్యూబిక్ మీటర్లకు గాను 1,761 క్యూబిక్ మీటర్ల మేర మాత్రమే పూర్తయింది. మొత్తం జలాశయం గట్టు 2.5 కి.మీ. పొడవునా రాతి కట్టడం సాగాలి. ఇప్పటికి 800 మీటర్ల మేర పనులు మాత్రమే పూర్తయ్యాయి. నిర్మించాల్సిన కాంక్రీట్ కట్టడాలు.. 29, ప్రారంభించినవి..(గోతులు తీసినవి) 9.

ప్రైవేటు రంగంలో రిజర్వేషన్లు

- కాంగ్రెస్ కృషి చేస్తుంది: రఘువీరా రెడ్డి
- పార్టీకి పునర్‌వైభవం వచ్చింది: కేవీపీ
- మోదీకి వైసీపీ, టీడీపీ సరెండర్: పల్లంరాజు
- కాంగ్రెస్‌లో చేరిన బీసీ నేత గంగాధర్



అమరావతి, మార్చి 11 (మనం ప్రతినిధి): ప్రైవేటు రంగంలో రిజర్వేషన్లు తెచ్చేందుకు కాంగ్రెస్ పార్టీ కృషి చేస్తుందని ఏపీసీసీ అధ్యక్షుడు ఎన్.రఘువీరా రెడ్డి అన్నారు. ఆదివారం రఘువీరా రెడ్డి సమక్షంలో బీసీ జనసభ అధ్యక్షుడు డాక్టర్ గంగాధర్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. రఘువీరాతో పాటు రాజ్యసభ సభ్యుడు కేవీపీ రామచంద్రరావు, కేంద్ర మాజీ మంత్రి పల్లం రాజు.. ఆయనకు పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా రఘువీరా మాట్లాడుతూ.. బడుగు, బలహీన వర్గాలతో పాటు అగ్రవర్ణాలలోని పేదలను ప్రభుత్వం విస్మరించిందన్నారు. రాష్ట్ర విభజనలో పాలు పంచుకున్న ప్రతి పార్టీ రాజకీయ ప్రయోజనాల కోసం దొంగ పోరాటాలు చేశాయని ఆయన ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ తప్పు చేసి ఉంటే విభజన చట్టాన్ని ఎందుకు అమలు చేయాలని అడుగుతున్నారని ఆయన ప్రశ్నించారు. కేవీపీ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీకి పునర్ వైభవం వచ్చిందన్నారు. రాష్ట్ర పునర్విభజన చట్టం అమలు, ప్రత్యేక హోదా కోసం కాంగ్రెస్ చేపట్టిన కోటి సంతకాల సేకరణ విజయవంతమైందన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలు, కాంగ్రెస్ పార్టీకి వస్తున్న ఆదరణ చూసి గంగాధర్ పార్టీలో చేరారని ఆయన వ్యాఖ్యానించారు. టీడీపీ, వైసీపీలు రెండూ ప్రధాని మోదీకి లొంగిపోయాయని పల్లంరాజు ఆరోపించారు. హోదా కోసం కలిసి పోరాడుదామంటే రెండు పార్టీలు కలిసి రావటం లేదన్నారు. ప్రధాని మోదీకి పరిపాలన దక్షత లేదని, అన్ని వ్యవస్థలను తన ఆధీనంలోకి తీసుకుని, రాజ్యమేలుతున్నారని విమర్శించారు. దేశంలో ఎన్నడూ లేని విధంగా నలుగురు సుప్రీం కోర్టు జడ్జీలు మీడియా ముందుకు వచ్చారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు. మీడియా మద్దతు లేకపోవటంతో కాంగ్రెస్ పార్టీ చేస్తున్న కార్యక్రమాలు ప్రజలకు తెలియడం పేర్కొన్నారు.



దావానలంలో చిక్కుకున్న విద్యార్థులు


- తమిళనాడులో అడవిలోకి వెళ్లిన 20 మంది
- సహాయ చర్యలకు వైమానికదళం

మదురై, మార్చి 11: తమిళనాడులో ఘోరం జరిగింది. తేని జిల్లా కురంగని సమీపంలో అడవిలో మంటలు చెలరేగాయి. దురదృష్టవశాత్తు ఆ మంటల్లో దాదాపు 20 మంది విద్యార్థులు కూడా చిక్కుకుపోవడంతో.. వారిని కాపాడేందుకు తమిళనాడు అధికారులు భారీ ఆపరేషన్ చేపట్టారు. విద్యార్థులను సురక్షితంగా బయటకు తీసుకొచ్చేందుకు భారత వైమానిక దళం సాయం చేయాలని జిల్లా యంత్రాంగం కోరింది. వెంటనే సహాయక చర్యలలో పాల్గొనాల్సిందిగా వైమానిక దళానికి సూచనలు అందించినట్లు రక్షణ శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ట్వీట్ చేశారు. తేని జిల్లా కలెక్టర్‌తో సదరన్ కమాండ్ బృందం నిరంతర సంప్రదింపుల్లో ఉందని ఆమె తెలిపారు. రాష్ట్రంలోని ఒక కాలేజి విద్యార్థులు సరదాగా అడవిలోకి వెళ్లారని, అయితే సాయంత్రం 4 గంటల సమయంలో అక్కడ చెలరేగిన మంటలలో వారు చిక్కుకున్నారని మదురై సర్కిల్ కన్సర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్ ఆర్‌కే జెగానియా తెలిపారు. విద్యార్థులలో ఒకరు తన తండ్రికి ఫోన్ చేయడంతో ఆయన అటవీ శాఖాధికారులకు సమాచారం అందించారన్నారు. విద్యార్థులు ట్రెక్కింగ్‌కు అనుమతి తీసుకోలేదని, సహాయ కార్యకలాపాల కోసం 40 మంది సిబ్బందిని పంపామని ఆయన వివరించారు.



ఆదివారం జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ కుటుంబ సభ్యులతో కలసి విజయవాడ వచ్చారు. సోమవారం ఆయన పలు కార్యక్రమాల్లో పాల్గొననున్నారు

65 సెకన్లలో ఆపరేషన్




మీడియాతో మాట్లాడుతున్న డా.సోమయాజులు

- ఫాస్టెస్ట్ ఫైల్స్, ఫిషర్ సర్జన్‌గా ఘనత
- డా. సోమయాజులు ప్రపంచ రికార్డు

అనంతపురం, మార్చి 11 (మనం న్యూస్): ఆశా ఆసుపత్రి ఎండీ డాక్టర్ సోమయాజులు మరో అరుదైన రికార్డు నెలకొల్పారు. గత డిసెంబరు 30న 55 సెకన్లలో ఫైల్స్ ఆపరేషన్ పూర్తి చేసి గిన్నిస్ బుక్ రికార్డు నెలకొల్పిన ఆయన.. తాజాగా ఫైల్స్‌తో పాటు ఫిషర్ రెండు ఆపరేషన్లను 65 సెకన్లలో పూర్తి చేసి ఫాస్టెస్ట్ ఫైల్స్, ఫిషర్ సర్జన్‌గా రికార్డుకెక్కారు. ఆదివారం అనంతపురంలో కోర్టు రోడ్డులోని ఆశా ఆసుపత్రిలో గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డు ఇండియా ప్రతినిధి బి.ఎన్. గౌడ్, ప్రపంచ రికార్డు ప్రతినిధి డాక్టర్ కె.ఆర్.కె చార్యులు సమక్షంలో ఈ ఆపరేషన్ చేశారు. ఫైల్స్‌పై విస్తృత స్థాయిలో అవగాహన కల్పించేందుకు ఆదివారం నుంచి 19వ తేదీ వరకు ఆశా ఆసుపత్రిలో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తామని డాక్టర్ సోమయాజులు తెలిపారు. ఎంపికైన వారికి 50 శాతం రాయితీతో ఆపరేషన్లు చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మ్యాటర్ వీక్.. పబ్లిసిటీ పీక్


- టీడీపీ నేతలవన్నీ మాయ మాటలు
- బాబువి దొంగ లెక్కలు: బుగ్గన



విజయవాడ, మార్చి 11: రాష్ట్ర బడ్జెట్ లెక్కలు ఆశ్చర్యం కలిగిస్తున్నాయని వైసీపీ ఎమ్మెల్యే బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి అనారు. టీడీపీ సర్కార్ మాటలు మ్యాటర్ వీక్.. పబ్లిసిటీ పీక్ అన్నట్లుందని ఆయన ఎద్దేవా చేశారు. ఆదివారం విజయవాడలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. టీడీపీ నేతలు చెబుతున్నట్లు పెట్టుబడుల సదస్సు, ఉద్యోగాల కల్పన అన్నీ మాయమాటలేనని అన్నారు. కాగ్ లెక్కల ప్రకారం రెవెన్యూ రాబడిలో రూ. 24 వేల కోట్ల లోటు ఉందన్న విషయాన్ని బుగ్గన ప్రస్తావించారు. అలాంటప్పుడు రెవెన్యూ లోటులో అకస్మాత్తుగా మిగులు ఎలా వచ్చిందన్నారు. దీన్ని చంద్రబాబు ప్రభుత్వం ఏ విధంగా సమర్థించుకోగలదని ఆయన ప్రశ్నించారు. రాష్ట్రంలో ఏ రంగానికీ ఆదాయం పెరగలేదని.. కేవలం అడ్డగోలు అనుమతులతో మద్యం ఆదాయాన్ని మాత్రం రెట్టింపు చేశారన్నారు. ఎన్నికలు దగ్గర పడుతుండటంతో ప్రజలను అయోమయానికి గురి చేసి మాయ చేసేందుకే చంద్రబాబు దొంగ లెక్కలు చూపిస్తున్నారంటూ బుగ్గన విమర్శించారు. ఏపీ ఆర్థిక పరిస్థితి బాగుందని చెబుతుండటం వల్ల ఇంకా ఎక్కువ నష్టం జరిగే అవకాశం ఉందని అన్నారు.

విశాఖలో కిడ్నీ పరిశోధన కేంద్రం

- ఉద్దానంలో వ్యాధులకు కారణాలపై అన్వేషణ
- విమ్స్‌లో ఏర్పాటు: పూనం మాలకొండయ్య



విశాఖపట్నం, మార్చి 11 (మనం న్యూస్ బ్యూరో): శ్రీకాకుళం జిల్లా ఉద్దానం ప్రాంతాన్ని కుదిపేస్తున్న కిడ్నీ వ్యాధి మూలలను కనుగొనేందుకు పరిశోధనా కేంద్రాన్ని విశాఖలో ప్రారంభించాలని ప్రభుత్వం సూత్రపాయంగా నిర్ణయించింది. వందల కోట్ల రూపాయల ఖర్చుతో విశాఖలో అసంపూర్తిగా నిర్మించిన విశాఖ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (విమ్స్)లో దీనిని ప్రారంభించాలని నిర్ణయించినట్లు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ప్రిన్సిపల్ సెక్రటరి పూనం మాలకొండయ్య వెల్లడించారు. ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ (ఐసీఎంఆర్), జార్జి ఇనిస్టిట్యూట్ ఫర్ గ్లోబల్ హెల్త్ ఆర్గనైజేషన్‌లు సంయుక్తంగా ఈ కిడ్నీ వ్యాధుల పరిశోధనా కేంద్రాన్ని నిర్వహిస్తా యని ప్రభుత్వం ప్రకటించింది. ఈ పరిశోధనా కేంద్రం కిడ్నీ వ్యాధులకు కారణాలను అన్వేషించనుంది. దశాబ్దాలుగా వేధిస్తున్న ఉద్దానం కిడ్నీ వ్యాధులకు స్పష్టమైన కారణమేమిటన్న దానిపై ఇప్పటికీ వైద్య నిపుణులు నిర్ధారణకు రాలేకపోయారు. నీటి కాలుష్యం వల్ల వ్యాధి వ్యాప్తి చెందుతుందన్న ప్రాథమిక నిర్ధారణతోనే ప్రభుత్వం నివారణ చర్యలను ప్రారంభించింది. విమ్స్‌లో ఈ కేంద్రం త్వరగా ఏర్పాటైతే సమస్యకు మూలాలను అన్వేషించే అవకాశాలు మెరుగవుతాయి. డయాలసిస్ కేంద్రాల ఏర్పాటులో జాప్యం చేసిన విధంగా ఈ పరిశోధనా కేంద్రం ఏర్పాటులో జాప్యం జరగకుండా చూడాల్సిన అవసరం ఉంది.

మరో 14 డయాలసిస్ కేంద్రాలు

రెండేళ్ల క్రితం జనసేన అధినేత పవన్ కల్యాణ్ కిడ్నీ బాధితుల అంశాన్ని పెద్ద ఎత్తున ప్రస్తావించి, హార్వర్డ్ నుంచి నిపుణులను తీసుకువచ్చారు. ఆ తర్వాత స్పందించిన ప్రభుత్వం బాధితుల కోసం ఉచిత డయాలసిస్ సెంటర్‌లను ప్రారంభించనున్నట్లు ప్రకటించింది. పలు పర్యాయాలు వాయిదాలు, బాధితుల నిరసనల తరువాత ప్రభుత్వం ఎట్టకేలకు ఉద్దానంలో ఐదు డయాలసిస్ కేంద్రాలను ప్రారంభించింది. ఇక్కడ 13 వేల మందికిపైగా కిడ్నీ బాధితులను ఇప్పటికే ప్రభుత్వం గుర్తించినందున.. మరో 14 డయాలసిస్ కేంద్రాలను ఏర్పాటు చేయాలనే ప్రతిపాదన ఉంది. ఈ 13 వేల మందిలో సిరమ్ క్రియాటిన్ ప్రమాదకర పరిస్థితులకు చేరినట్లు గుర్తించారు. రాష్ట్ర బడ్జెట్‌లో కూడా ఈ 14 కేంద్రాల అంశాన్ని ప్రస్తావించారు. ప్రస్తుతం పలాస, సోంపేట ప్రాంతాల్లో డయాలసిస్ కేంద్రాలు పనిచేస్తుండగా, కొత్తగా వజ్రపుకొత్తూరు, హరిపురం, కవిటి కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లలో డయాలసిస్ కేంద్రాలు ఏర్పాటు చేయాల్సి ఉందని ఆరోగ్య శాఖ అధికారులు ప్రతిపాదించారు. కిడ్నీ బాధిత గ్రామాల్లో సమగ్ర ఆరోగ్య సర్వే జరిపితే బాధితుల సంఖ్య మరింతగా పెరిగే అవకాశాలు ఉన్నాయి.





టెంపో, బస్సు ఢీకొని.. నలుగురి మృతి

- మరో ఐదుగురికి తీవ్ర గాయాలు
- చిత్తూరు జిల్లాలో రోడ్డు ప్రమాదం

బంగారుపాళ్యం, మార్చి11 (మనం న్యూస్): చిత్తూరు జిల్లా బంగారుపాళ్యం మండలం మాదిగొళ్ళతొపు సమీపంలో ఆదివారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. మరో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. కేరళ నుంచి తిరుమలకు వెళ్తున్న టెంపో, చిత్తూరు నుంచి బెంగళూరు వెళ్తున్న ప్రైవేటు ట్రావెల్స్ బస్సు ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. మృతులను హరీష్ (40), సదాశివన్ (70), గిరిజ (47), పకీర్ కట్ట (52)గా గుర్తించారు. క్షతగాత్రులను బంగారుపాళ్యం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి ప్రాథమిక చికిత్స అనంతరం, వైద్యుల సలహా మేరకు మెరుగైన వైద్యం కోసం చిత్తూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం బంగారుపాళ్యం ఆస్పత్రికి తరలించారు.

ఏడాది చివరకు పెట్టుబడుల ఉపసంహరణ పూర్తి





హైదరాబాద్: ఏడాది డిసెంబర్ చివరి నాటికి ఎయిర్ ఇండియాలో పెట్టుబడుల ఉపసంహరణ ప్రక్రియ పూర్తవుతుందని కేంద్ర పౌర విమానయానశాఖ సహాయమంత్రి జయంత్ సిన్హా చెప్పారు. దీనికి సంబంధించిన కసరత్తు ప్రారంభించామని, త్వరలో దీనిపై స్పష్టమైన అవగాహన వస్తుందన్నారు.

కేంద్రం ప్రతిపాదించిన ఉడాన్ ఫ్లాట్‌ఫాంకు మంచి స్పందన వస్తుందన్నారు. గౌహతి నుంచి ఆగ్నేయ ఆసియా దేశాలకు విమాన సర్వీసులు నడిపేందుకు కొన్ని కంపెనీలు ముందుకు వచ్చాయని దీనికి రాష్ట్ర ప్రభుత్వం కూడా తగిన సహకారాలు అందిస్తుందన్నారు. శ్రీనగర్‌తో పాటు మరికొన్ని చిన్న చిన్న నగరాల నుంచి కూడా విమానాలు నడిపేందుకు ప్రైవేటు సంస్థలు ముందుకువచ్చాయని ఆయన చెప్పారు. హైదరాబాద్‌లో జరుగుతున్న వింగ్స్ ఇండియా ఎగ్జిబిషన్‌ను మంత్రి సందర్శించారు. ఎగ్జిబిషన్‌లో పాల్గొన్న విమాన సంస్థల స్టాల్స్‌ను కేంద్ర మంత్రి సందర్శించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ, విమానయానశాఖ రక్షణ అంశానికై అధిక ప్రాధాన్యత ఇస్తుందని దీనికి ప్రపంచ ప్రమాణాలు పాటిస్తున్నామన్నారు. అంతకుముందు వింగ్స్ ఇండియాలో పాల్గొన్న ఎయిర్‌కార్గో ఇండస్ట్రీ ప్రతినిధులతో కేంద్రమంత్రి సమావేశం అయ్యారు. ఎయిర్‌కార్గో రంగం ఎంతో అభివృద్ధి చెందుతుందని, ఇది ఆర్థిక వ్యవస్థలో పౌర విమాన పరిశ్రమలాగ ప్రాధాన్యతతో విస్తరిస్తుందని ఆయన అన్నారు. ఎయిర్‌కార్గోను ప్రపంచస్థాయి పరిశ్రమలా తీర్చిదిద్దాల్సి ఉందని, దీనికి ప్రభుత్వం సదుపాయకల్పనలో పాల్గొంటుందని చెప్పారు. విధానాల రూపకల్పన, నియంత్రణలోనే జోక్యం చేసుకుంటుందని చెప్పారు. ప్రైవేటు సంస్థలు తమ పెట్టుబడులు, గమ్యాలు, వ్యాపారాలను నిర్దేశించుకోవాలని జయంత్ సిన్హా సూచించారు. కార్గో రంగం యేటా 15శాతం పెరుగుతుందని, యేటా 3.7లక్షల టన్నుల వస్తువులను రవాణా చేస్తుందని ఆయన చెప్పారు. ఇందులో ముఖ్యంగా ఆహార వ్యవసాయ, ఫార్మా, లెదర్, టెక్స్‌టైల్స్ ఉత్పత్తులు ఎక్కువగా ఉన్నాయని చెప్పారు. ఈ సందర్భంగా భారత్, ఇంటర్నేషనల్ ఎయిర్ ట్రాన్స్‌పోర్ట్ అథారిటీ(ఐఏటీఏ)ల మధ్య స్కిల్ డెవలప్‌మెంట్‌పై ఒక అవగాహన కుదుర్చుకున్నారు.

అలాగే కార్గో రవాణాను సులభతరం చేసేందుకు రెండు ఈ-ఫ్రైట్ పోర్టల్స్‌ను ఆవిష్కరించారు. ఇందులో ఒక పోర్టల్ ప్రపంచంలోనే మొదటిగా ఉంటుంది. ఎయిర్‌పోర్టులలో 120రోజులకు మించి కార్గో నిలిచిపోతే దానిని తొలగించేందుకు కేంద్ర ప్రభుత్వ క్యాబినెట్ సెక్రటరీ చైర్మన్‌గా ఒక కమిటీని ఏర్పాటు చేయాలని వింగ్స్ ఇండియా సమావేశంలో నిర్ణయించారు. దీని వలన విమానశ్రయాల్లో కార్గో విమానాలను ఎప్పటికప్పుడు తరలించి కొత్తవాటికి అవకాశం కల్పించేందుకు వీలవుతుంది. ప్రస్తుతం 60శాతం ఎయిర్‌కార్గో కేవలం 10దేశీయ అంతర్జాతీయ ఎయిర్‌లైన్స్ ద్వారా, దేశంలోని 10 ప్రధాన ఎయిర్‌ఫోర్స్ నుంచి సాగుతుంది. అయితే ప్రాంతీయ ఎయిర్‌పోర్ట్స్‌లో కూడా ఎయిర్‌కార్గో సేవలు విస్తరించేందుకు కేంద్రప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. రౌండ్‌టేబుల్ సమావేశం సందర్భంగా వ్యవసాయ, ఫుట్‌పాత్‌లు, హెచ్‌వోడె వలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ డీకే.సింగ్, ఫార్మాఎక్స్‌పోర్ట్స్ కౌన్సిల్ డైరెక్టర్ జనరల్ రవి ఉదయభాస్కర్, ఎక్స్‌ప్రెస్ ఇండస్ట్రీ కౌన్సిల్, ఆన్ ఈకామర్స్ సీవోవో విజయ్‌కుమార్ తదితరులు ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొని ఇండస్ట్రీకి సంబంధించిన అంశాలపై దృశ్య ప్రదర్శన ఇచ్చారు.

వడివడిగా పోస్టల్ పేమెంట్స్ బ్యాంకు పనులు


న్యూఢిల్లీ: ఇండియా పోస్టు పేమెంట్స్ బ్యాంకు (ఐపిపిబి) భారీగా శాఖలు ఏర్పాటు చేయనుంది. ఏప్రిల్ నెలాఖరు కల్లా దేశ వ్యాప్తంగా 650 శాఖలు ఏర్పాటు చేయనున్నట్లు కమ్యూనికేషన్స్ శాఖ మంత్రి మనోజ్ సిన్హా పార్లమెంట్‌కు తెలిపారు. ఏప్రిల్ 2018 కల్లా దేశంలోని అన్ని ప్రధాన జిల్లా కేంద్రాల్లో ఈ శాఖలను అందుబాటులోకి తేనున్నట్లు లోకసభకు మంత్రి లిఖితపూర్వకంగా తెలిపారు. పోస్టల్ శాఖ పేమెంట్ బ్యాంకుల ఏర్పాటుకు 2017 జనవరి 20న రిజర్వు బ్యాంకు ఆమోదం లభించింది. పైలట్ ప్రాజెక్టు గతేడాది జనవరి 30న రారుపూర్, రాంచీలో రెండు శాఖలను ఏర్పాటు చేసింది.

IPPB
India Post Payments Bank
इंडिया पोस्ट पेमेंट्स बैंक

ఈ 650 శాఖల్లో సివిల్, విద్యుత్, ఫర్నీచర్, టెక్నాలజీ ఏర్పాటు పనులు జరుగుతున్నాయని మంత్రి తెలిపారు. ఇవి తుది దశలో 1.55 లక్షల తపాల కార్యాలయాలను పర్యవేక్షించడంతో పాటుగా వాటిని కంట్రోల్ చేయనున్నాయని తెలిపారు. అదే విధంగా 528 మంది మేనేజర్ల నియామకానికి కసరత్తు జరుగుతుందన్నారు. కొత్తగా ఐపిపిబి శాఖల ఏర్పాటు అనంతరం ఐదేళ్లలోనే 8 కోట్ల మంది ఖాతాదారులను సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు మంత్రి తెలిపారు. అదే విధంగా వచ్చే కొద్ది ఏళ్లలో వీరిని డిజిటల్ పేమెంట్స్ రంగంలోకి తీసుకురావాలని నిర్దేశించుకున్నట్లు తెలిపారు. ఐపిపిబి కోసం సమీకృత సిస్టమ్ (ఎస్ఐ) కోసం ఇటి సర్వీసెస్ ఇండియా ప్రయివేటు లిమిటెడ్‌తో ఒప్పందం జరిగిందన్నారు. ఈ అధునాతన సాంకేతికత కోసం 2017 ఆగస్టు 14న అంగీకారం జరిగిందన్నారు. ఐపిపిబి శాఖల ఏర్పాటుతో పాటు 5,000 ఎటిఎం కేంద్రాలు ఏర్పాటు చేయాలని కేబినెట్ నిర్ణయించింద న్నారు. ప్రస్తుతం ఐపిపిబి డిఒపి ఎటిఎం కేంద్రాలు కలిగి ఉందన్నారు. వీటిని ఇతర బ్యాంకుల నెట్‌వర్క్‌తోనూ అనుసంధానించినట్లు తెలిపారు.

టీసీఎస్ బ్రాండ్ విలువ 10 బిలియన్ డాలర్లపైనే!

ముంబయి: భారత ఐటీ దిగ్గజం 'టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్' (టీసీఎస్) తాజాగా అరుదైన ఘనత సొంతం చేసుకుంది. 2018లో ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతోన్న ఐటీ సర్వీసెస్ బ్రాండ్‌గా టీసీఎస్ అవతరించింది. బ్రాండ్ విలువను లెక్కించే 'బ్రాండ్ ఫైనాన్స్' నివేదికలో ఈ విషయం వెల్లడయ్యింది. దీని ప్రకారం.. టీసీఎస్ బ్రాండ్ విలువ వార్షిక ప్రాతిపదికన 1.309 బిలియన్ డాలర్ల పెరుగుదలతో 9.081 బిలియన్ డాలర్ల నుంచి 10.391 బిలియన్ డాలర్లకు ఎగసింది. బ్రాండ్ విలువలో 14.4 శాతం వృద్ధి నమోదయ్యింది. ఐటీ పరిశ్రమలోని ఏ ఇతర సంస్థ బ్రాండ్ విలువలోనూ ఈ స్థాయి వృద్ధి నమోదు కాలేదు. దీంతో గ్లోబల్ ఐటీ సర్వీసెస్ రంగంలో టాప్-3 అత్యంత విలువైన బ్రాండ్స్ సరసన టీసీఎస్ చోటు దక్కించుకుంది. తొలి రెండు స్థానాల్లో ఐబీఎం, యాక్సెంచర్ ఉన్నాయి. టాటా బ్రాండ్ విలువ (14.236 బిలియన్ డాలర్లు)లో టీసీఎస్ వాటా 73 శాతానికిపైగా ఉండటం గమనార్హం.



టీసీఎస్ సంస్థను 1968లో 50 ఏళ్ల క్రితం స్థాపించారు. జేఆర్డీ టాటా, ఎఫ్‌సీ కోహ్లి దీని వ్యవస్థాపకులు. ఈ సంస్థ ప్రధాన కార్యాలయం ముంబయిలో ఉంది. 2007లో సంస్థ రెవెన్యూ 17.57 బిలియన్ డాలర్లుగా ఉంది. నిర్వహణ వ్యయం 4.51 బిలియన్ డాలర్లు. ప్రస్తుతం టీసీఎస్ చైర్మన్‌గా నటరాజన్ చంద్రశేఖరన్, సీఈవోగా రాజేష్ గోపినాథన్ ఉన్నారు.

నిరీక్షణకు ముగింపు

ఎగిరే కార్ల విడుదలకు సర్వం సిద్ధం

రైట్ బ్రదర్స్ విమానాన్ని ప్రపంచానికి పరిచయం చేసిన కాలం నుండి ఇప్పటి వరకు ఎగిరే కారు ఒక కలగానే మిగిలిపోయింది. గాల్లో ఎగిరే విమానాలు మరియు రోడ్డు మీద దూసుకెళ్లే కార్లలో భారీ మార్పులు జరిగాయి. కానీ, ఈ రెండింటి కలయికలో గాలిలో ఎగిరే మరియు రోడ్డు మీద నడిచే వాహనాన్ని నిర్మించడానికి ఎన్నో కంపెనీలు తీవ్రంగా శ్రమిస్తున్నాయి. చాలా వరకు ప్రయత్నాలు ప్రయోగ దశలోనే నిలిచిపోయాయి. కానీ డచ్ కంపెనీ మానవ కలలు అతి కొద్ది కాలంలో నిజం చేయబోతోంది. ప్రొడక్షన్ వెర్షన్ పాల్-వి లిబర్టి గాలిలో ఎగిరే మరియు రోడ్డు మీద దూసుకెళ్లే వాహనాన్ని విజయవంతంగా అభివృద్ధి చేసి ''అసాధ్యమైనది ఏదీ లేదు అని'' నిరూపించింది.




జెనీవా: ట్రాఫిక్‌లో గంటల తరబడి నిలిచిపోయినపుడు, మనసు చిన్న పిల్లల మనస్తత్వంతో, ఉన్న ప్రదేశం నుండి మనం ఉన్న కారు లేదా బైకుతో అలాగే గాల్లోకి ఎగిరిపోతే ఎంత బాగుటుందో అని నగరాల్లో ట్రాఫిక్ కష్టాలు ఎదుర్కొనే వారంతా ఒక్కసారైనా ఆలోచించి ఉంటారు.

ఎంతో మంది కన్న ఈ కల నిజమవ్వడానికి మరెంతో సమయం పట్టదు. తాజాగా ఎగిరే కార్ల మీద జరుగుతున్న ప్రయోగాలు ఓ కొలిక్కి వచ్చాయి. జెనీవా మోటార్ షోలో పాల్-వి సంస్థ తొలి ఎగిరే కారును ఆవిష్కరించింది. వాణిజ్య అసరాలకు 2019 నుండి పూర్తి స్థాయిలో ఉత్పత్తిని ప్రారంభించనున్నట్లు సంస్థ ప్రతినిధులు పేర్కొన్నారు.

డచ్ దేశానికి చెందిన పాల్-వి ఇంటర్నేషనల్ తాజాగా పర్సనల్ ఎయిర్ అండ్ ల్యాండ్ వెహికల్(పాల్-వి)లిబర్టి ఎగిరే కారును 2018 జెనీవా ఇంటర్నేషనల్ మోటార్ షో వేదిక మీద ఆవిష్కరించింది. ఇది 2019లో ప్రొడక్షన్ దశకు చేరుకోనున్న ఎగిరే కారు యొక్క మరో కాన్సెప్ట్ రూపం.

పాల్-వి లిబర్టి ఒక మూడు చక్రాల ఎగిరే కారు. చూడటానికి హెలీకాప్టర్ మరియు మూడు చక్రాల బైకు ఆధారంగా రూపొందించిన మూడు చక్రాల కారు శైలిలో ఉంటుంది. ఫ్రంట్ వీల్‌ను చక్కగా కారు బాడీలో ఇమిడిపోయేలా డిజైన్ చేశారు. మూడు చక్రాల ఎగిరే కారు రోడ్ల మీద తిరగడానికి మరియు గాలిలో ఎగరడానికి యూరప్ మరియు అమెరికా దేశాల్లో అనుమతులు కూడా పొందింది. దీనిని పూర్తిగా, కార్బన్ ఫైబర్, టైటానియం, అల్యూమినియం వంటి విలక్షణమైన పదార్థాలతో నిర్మించడం జరిగింది. 680కిలోల బరువున్న ఈ ఎగిరే కారు, అతి తక్కువ దూరంలోనే ల్యాండింగ్ మరియు టేకాఫ్ తీసుకుంటుంది. దీనికి టేకాఫ్ కోసం 165 మీటర్లు మరియు ల్యాండింగ్ కోసం 30 మీటర్లు పొడవున్న రన్‌వేలు మరియు రహదారులు ఉంటే సరిపోతుంది.

పాల్-వి లిబర్టి గాల్లో ఎగిరే కారులో 100బిహెచ్‌పి పవర్ ప్రొడ్యూస్ చేసే రెండు ఇంజన్‌లు ఉన్నాయి. రోడ్డు మరియు గాలిలో రెండు మార్గాల్లో ఇది గరిష్టంగా గంటకు 180కిలోమీటర్ల వేగాన్ని అందుకుంటుంది. ఈ కారును కంపెనీ అందరికీ విక్రయించదు. గుర్తింపు పొందిన డ్రైవింగ్ లైసెన్స్ మరియు పైలట్ లైసెన్స్ ఉన్న కస్టమర్లకు మాత్రమే పాల్-వి సంస్థ తమ ఎగిరే కారును



విక్రయిస్తుంది, గాల్లోకి ఎగరడానికి హెలీకాప్టర్ల తరహాలో రోటార్ బ్లేడ్లు ఉంటాయి. అయితే హెలీకాప్టర్లలో మాదిరిగా రోటార్ బ్లేడ్లు అంత శక్తివంతమైనవేం కాదు. కానీ గైరోప్లేన్‌లో ఉన్న రోటార్ బ్లేడ్ల తరహాలో పనిచేస్తాయి.

కారు లోపల గల చిన్న బటన్ ప్రెస్ చేయడం ద్వారా రోటార్లు మరియు కారుకు వెనుక వైపున ఇరువైపులా స్పాయిలర్స్ ఆకారంలో ఉన్న బ్లేడ్లు అన్నీ క్రిందకు ముడుచుకుంటాయి. దీంతో రోడ్డు మీద సాధారణ వెహికల్ మాదిరగానే ప్రయాణిస్తుంది.

పాల్-వి సంస్థ 2019లో డిమాండును బట్టి 50 నుండి 100 వాహనాలను తయారు చేయాలనే లక్ష్యంతో ఉంది. 2020 నాటికి ఈ సంఖ్య రెట్టింపు అయ్యే అవకాశాలు కూడా ఉన్నాయి. ఉత్పత్తి చేసిన అనంతరం కనీసం 150 గంటల పాటు దీనిని పరీక్షించి, నడిపిన తరువాతే కస్టమర్‌కు డెలివరీ చేస్తారు.

ఒక్కో పాల్-వి లిబర్టి ఎగిరే కారు ధర 600,000 అమెరికన్ డాలర్లుగా ఉంది. ఇండియన్ కరెన్సీలో దీని ధర రూ. 3.90 కోట్ల రూపాయలు. కంపెనీ అత్యంత సరసమైన మోడల్‌ను పాల్-వి లిబర్టి స్పోర్ట్ వెర్షన్ పేరుతో లాంచ్ చేసి 2.18 కోట్ల రూపాయలు లేదా 335,000 డాలర్లకు విక్రయించనుంది.



ట్రంప్ నిర్ణయంతో భారత్‌కు ఇబ్బందే

న్యూఢిల్లీ: ప్రపంచ దేశాల్లో రక్షణాత్మక ధోరణి ఎక్కువైపోయింది. అందుకు నిదర్శనమే ఇటీవల అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఉక్కు, అల్యూమినియంపై ప్రత్యేక పన్ను విధింపు. హార్లీ డేవిడ్‌సన్ బైకులపై భారత పన్ను విధింపును వ్యతిరేకిస్తున్న ట్రంప్.. యూఎస్‌ఏలో స్టీలు, అల్యూమినియం దిగుమతిపై సుంకం పెంచనున్నారు. భారత్‌తో పాటు చైనాపై కూడా సుంకం పెంచేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు. అమెరికా టారీఫ్‌కు అనుగుణంగా నడుచుకోకపోవడంతో ట్రంప్ ఈ పరస్పర పన్ను' కు సిద్ధమయ్యారు.

భారత్‌లో విక్రయించే అమెరికా ఆధారిత హార్లీ డేవిడ్‌సన్‌పై విధించే 50 శాతం పన్ను విషయమై ట్రంప్ పలుమార్లు ప్రస్తావించారు. 'భారత్ నుంచి యూఎస్‌ఏలో దిగుమతి చేసుకునే వాహనాలపై అమెరికా పన్ను విధించడం లేదు. అలాంటిది హార్లీ డేవిడ్‌సన్‌పై భారత్ ఎందుకు 50శాతం పన్ను విధిస్తున్నదని ప్రశ్నించారు. చైనా 25 శాతం, భారత్ 75శాతం పన్ను విధిస్తుంటే తాము ఎలాంటి పన్ను విధించడం లేదు.



కనుక ఇక మేము పరస్పర పన్ను విధించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం.' అని అన్నారు. కెనడా, మెక్సికో తప్ప అన్ని దేశాలపై స్టీల్‌పై 25 శాతం, అల్యూమీనియం పై 10 శాతం పన్ను విధిస్తామని ట్రంప్ చెప్పుకొచ్చారు. 'మాపై 50 శాతం పన్ను విధిస్తే.. మేమూ 50శాతం విధిస్తాం.' అని చెప్పుకొచ్చారు. పరస్పర పన్ను విధానం అమలు ద్వారా.. ఏ దేశం మధ్య వాణిజ్యపరమైన ఇబ్బందులు తలెత్తవని, సజావుగా వ్యాపారం జరుగుతుందని ట్రంప్ అభిప్రాయపడ్డారు. ఫలితంగా యూఎస్‌ఏకు స్టీల్ ఎగుమతి చేస్తున్న భారత్‌తో పాటు చైనా మార్కెట్‌కు ప్రతికూల పరిస్థితి ఏర్పడనున్నాయి. చైనా, యూరప్ ఈ చర్యలకు దిగితే మనకు మరింత ఇబ్బందే. దేశానికి కీలకమైన ఉక్కును విదేశీ పరిశ్రమలు ప్రభావితం చేస్తున్నాయని.. మన ఉక్కును మనమే ఉత్పత్తి చేసుకుందామని ట్రంప్ అన్నారు.

శ్రీసిటీకి ఆసియా మోస్ట్ అడ్మైర్డ్ బ్రాండ్ అవార్డు

సింగపూర్: అంతర్జాతీయ స్థాయి పారిశ్రామిక నగరంగా గుర్తింపు పొందిన చిత్తూరు జిల్లా శ్రీసిటీ మరో అరుదైన ఘనత సాధించింది. ప్రపంచ స్థాయి మౌలిక వసతులతో ఇప్పటికే పలు జాతీయ, అంతర్జాతీయ అవార్డులను దక్కించుకున్న శ్రీసిటీ ఖాతాలో మరో రెండు ప్రతిష్ఠాత్మక పురస్కారాలు చేరాయి. 2017-18 ఏడాదికి గానూ ఆసియా మోస్ట్ అడ్మైర్డ్ బ్రాండ్ అవార్డుతోపాటు, దేశంలో 50లోపు బెస్ట్ సీఎఫ్‌వో అవార్డులను సొంతం చేసుకుంది. సింగపూర్‌లోని రిట్జ్ కార్ల్‌టన్‌లో వైట్ పేజ్ ఇంటర్నేషనల్, యూకే ఏసియన్ బిజినెస్ కౌన్సిల్ సంస్థలు సంయుక్తంగా నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఈ అవార్డులను అందజేశారు. గతేడాదిగా ఆసియాలోని వివిధ దేశాల నుంచి ఉత్తమ సేవలు (సర్వీసు), ఆర్థికవృద్ధి కనబరిచిన 100 ప్రశంసాత్మక సంస్థలను ఈ అవార్డుల్లో పరిగణనలోకి తీసుకున్నాయి. సత్యవేడులోని శ్రీసిటీ తరపున సీఎఫ్‌వో ఆర్.నాగరాజన్ ఈ అవార్డులను స్వీకరించారు. ప్రతిష్ఠాత్మక అవార్డులు దక్కడంపై శ్రీసిటీ వ్యవస్థాపక సంచాలకులు రవీంద్ర సన్నారెడ్డి హర్షం వ్యక్తం చేశారు. తమను ఈ అంతర్జాతీయ



అవార్డులకు ఎంపిక చేసినందుకు గర్వంగా ఉందని, వైట్ పేజ్ ఇంటర్నేషనల్‌కు ధన్యవాదాలు తెలియజేస్తున్నామని అన్నారు. అలాగే ఇలాంటి వేదికల ద్వారా పారిశ్రామిక విజయాలు సాధించిన ప్రతి ఒక్కరిని కలుసుకుని, వారి విజయగాథలను తెలుసుకునే అవకాశం ఉంటుందని సన్నారెడ్డి వ్యాఖ్యానించారు. వీటిని పారిశ్రామిక రంగంలో ఆంధ్రప్రదేశ్ సాగిస్తోన్న విజయ ప్రస్థానానికి దక్కిన గుర్తింపుగా అభివర్ణించారు. ఈ అవార్డుల కార్యక్రమంలో వివిధ సంస్థలకు చెందిన 250 మంది సీఈఓలు, ఆసియా వ్యాపారవేత్తలు, వీఐపీలు, మార్కెటింగ్, యాడ్ విభాగాలకు చెందిన అనేక మంది ప్రముఖులు పాల్గొన్నారు.

ఆర్‌కాం చేతికి రూ. 18 వేల కోట్లు

ముంబయి: రిలయన్స్ జియో ఇన్ఫోకామ్‌కు ఆస్తులు విక్రయిస్తున్న లావాదేవీలో మొదటి విడత కింద రిలయన్స్ కమ్యూనికేషన్స్ (ఆర్‌కాం) సుమారు రూ. 18,000 కోట్లను అందుకోనుంది. రుణాల ఊబిలో కూరుకుపోయిన ఆర్‌కాం ప్రతిపాదిత ఆస్తుల విక్రయానికి కాంపిటిషన్ కమిషన్ ఆఫ్ ఇండియా (సి.సి.ఐ) ఆమోదం తెలిపింది. అనిల్ అంబానీ నియంత్రణలోని ఆర్‌కాం రెండవ విడత కింద సుమారు రూ. 6,000 కోట్లు పొందవచ్చు. మొదటి దశలో ఆర్‌కాం టవర్లు, ఇండియా ఫైబర్, టెలికాం మౌలిక వసతులు, 850 మెగాహెర్ట్జ్, 900 మెగాహెర్ట్జ్ , 1800 మెగాహెర్ట్జ్ , 2100 మెగాహెర్ట్జ్‌లలో స్పెక్ట్రమ్‌ను ఇవ్వజూపుతోందని ఈ పరిణామాన్ని సన్నిహితంగా పరిశీలిస్తున్న వర్గాలవారు తెలిపారు. రెండవ విడతలో అది అఖిల భారత 850 మెగాహెర్ట్జ్, 1800 మెగాహెర్ట్జ్‌లను దత్తం చేస్తుందని ఆ వర్గాలవారు తెలిపారు. ప్రతిపాదిత ఆస్తుల అమ్మకానికి సి.సి.ఐ ఆమోదాలను కూడా ఆర్‌కాం సంపాదించింది. రిలయన్స్ జియోకి ఆస్తులు విక్రయించడానికి వీలు లేకుండా ఒక ఆర్బిట్రేషన్ ట్రైబ్యునల్ మాత్రం ఆంక్షలు విధించింది. ''రిలయన్స్ జియోకి ఆర్‌కాం ఆస్తుల అమ్మకానికి సంబంధించిన ప్రతిపాదనలన్నింటికీ సి.సి.ఐ ఆమోదం తెలిపింది. ఆమోద ముద్రపడిన ప్రతిపాదనల్లో ఆర్‌కాం టవర్లు, ఇండియా ఫైబర్ స్పెక్ట్రమ్, టెలికాం మౌలిక వసతులు కూడా ఉన్నాయి'' అని విశ్వసనీయ వర్గాలవారు తెలిపారు. ఈ నెలాఖరునాటికే ఈ అమ్మకం తతంగం పూర్తవుతుందని భావిస్తున్నట్లు తెలిపారు. అయితే, ఆర్బిట్రేషన్ ట్రైబ్యునల్‌లో ఎరిక్‌సన్ దాఖలు చేసిన కేసు తుది ఫలితంపై ఈ లావాదేవీ ఆధారపడి ఉండవచ్చు. ఆర్‌కాం, దానికి చెందిన రెండు యూనిట్లు తన అనుమతి లేకుండా ఏ రకమైన ఆస్తులను బదలీ చేయడంగానీ, అమ్మడంగానీ చేయకూడదని ట్రైబ్యునల్ ఆదేశించింది. ఈ చర్యతో మొత్తం ఆస్తుల అమ్మకం ప్రక్రియ జాప్యమయ్యే అవకాశం ఉంది. టెలికాం పరికరాల తయారీ సంస్థ ఎరిక్‌సన్ చేసిన అభ్యర్థన మేరకు మార్చి 5న ఆ తాత్కాలిక ఆదేశం జారీ అయింది. ఆర్‌కాం సంస్థకి చెందిన దేశవ్యాప్త నెట్‌వర్క్‌ను



ఆపరేట్ చేసి, మేనేజ్ చేసేందుకు 2014లో ఏడేళ్ళ ఒప్పందంపై స్వీడిష్ సంస్థ ఎరిక్‌సన్ సంతకాలు చేసింది. ఆర్‌కాం తనకు బకాయిలు చెల్లించవలసి ఉందని ఎరిక్‌సన్ చెబుతోంది. ''ఈ తాత్కాలిక ఆదేశానికి వ్యతిరేకంగా మేం ముంబయి హైకోర్టులో అప్పీలు దాఖలు చేయాలనుకుంటున్నాం. అన్‌సెక్యూర్డ్ ఆపరేషనల్ విక్రేత అయిన ఎరిక్‌సన్‌తో పోలిస్తే, సెక్యూర్డ్ ఫైనాన్షియల్ రుణ దాతల క్లైములకే అధిక ప్రాధాన్యం లభిస్తుంది. పైగా, సెక్యూర్డ్ ఫైనాన్షియల్ రుణ దాతల నిర్ణయాల మేరకే ఆస్తుల అమ్మకాన్ని చేపట్టడం జరిగింది'' అని ఆర్‌కాం ప్రతినిధి ఒకరు చెప్పారు.

11
హైదరాబాద్
మనం ఆరోగ్యం
సోమవారం, 12 మార్చి 2018
www.manamnews.com

సరికొత్త ఆరోగ్యం

శరీరానికి ఉపయోగపడే పోషకాలతో ఉన్న ఆహారమే తగిన ఆరోగ్యాన్ని అందిస్తుంది.



నిజంగా ఆనందంగా ఉండాలంటే, సుఖ సంతోషాలు ఏడాది పొడవునా మనల్ని వీడిపోకుండా ఉండాలంటే తప్పనిసరిగా అవసరమైనది తగినంత ఆరోగ్యమే. ఆరోగ్యంగా లేకపోతే ఉత్సాహం ఉండదు. ఇక వేదనలే అన్నీ. చాలా మంది కొత్త సంవత్సరంలో రకరకాల ప్రణాళికలు వేసుకుంటుంటారు. మంచి ఉద్యోగం సంపాదించాలని, ఇల్లు కట్టుకోవాలని, వాహనాలు, విలువైన ఆభరణాలు కొనుక్కోవాలని...ఇలా రకరకాల ప్లాన్లు వేస్తుంటారు. కానీ వీటన్నింటి కన్నా ముఖ్యమైనది, ఆంత్యంత అవసరమైనది...అందరూ నిర్లక్ష్యం చేస్తున్నదీ మరొకటుంది...అదే ఆరోగ్యం. ఎన్ని లక్ష్యాలను పెట్టుకుని ఎంత శ్రమపడి ఏం సాధించినా ఆరోగ్యమనేదే లేకపోతే అంతా శూన్యమే. జీవనాన్ని చురుగ్గా ఆరోగ్యవంతగా పరిపూర్ణం చేసుకోవడానికి ఎలాంటి ఆరోగ్య ప్రణాళికను రూపొందించుకోవాలో తెలుసుకుందాం...

పరిశుభ్రమైన తాగునీరు



నీరు లేక పోతే జీవనమే లేదు. నిత్యం కలుషిత నీటివల్లే 80 శాతం వరకూ అనారోగ్యాలు అందర్నీ వెంటాడుతున్నాయి. మనం తాగుతున్న నీళ్లు మంచివా కావా అన్నది ఎప్పటికప్పుడు సరిచూసుకోవాలి. ఎక్కడపడితే అక్కడ దొరికే నీటిని తాగితే సమస్యలు తప్పవు. ఎందుకంటే ఆ నీటిలో చాలా రకాల బాక్టీరియా, మలినాలు ఉండవచ్చు. అందువల్ల తాగే నీటి విషయంలో చాలా జాగ్రత్తలు పాటించాలి. ఇంట్లో ఫిల్టర్లు వాడాలి. బాగా మరిగించి చల్లార్చిన నీటిని వాడడం అవసరం. బయటికి వెళ్లినప్పుడు ఇంటి నుంచే మంచినీటిని తీసుకువెళ్లాలి. తగినంత మంచినీరు తాగడం వల్ల శరీరంలో ఉండే మలినాన్ని జీవ వ్యవస్థ ఎప్పటికప్పుడు బయటికి పంపేస్తుంది. అలా జరగడంలో తేడా వస్తే రకరకాల అలర్జీలు, ఇన్ఫెక్షన్లు, కాలేయ, కిడ్నీ సమస్యలు తప్పవు. అందువల్ల తాగే నీరు విషయంలో చాలా అప్రమత్తంగా ఉండాలి.

పోషకాహారం తప్పనిసరి



మంచి నీటి తర్వాత ఎంతో ముఖ్యమైంది పోషకారం. చాలామంది దృష్టిలో కేవలం నోటికి రుచినిచ్చేది, కడుపునింపేది మాత్రమే సరైన ఆహారం అనే అభిప్రాయం ఉంది. ఇందులో నిజంలేదు. శరీరానికి ఉపయోగపడే పోషకాలతో ఉన్న ఆహారమే తగిన ఆరోగ్యాన్ని అందిస్తుంది. తీసుకునే ఆహారం తాజాగా ఉండాలి. నిల్వ చేసిన ఆహార పదార్థాలు ఆరోగ్యానికి నష్టం కలిగిస్తాయని గుర్తించాలి. ఆహారంలో ఏదో ఒక రూపంలో ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు, చేపలు, గుడ్లు వంటివి ఉండేలా చూసుకోవాలి. ధాన్యాలు, పప్పు దినుసులు కూడా ఎక్కువగా ఆహారంలో తీసుకోవాలి. వీటిలో ఉండే యాంటీఆక్సిడెంట్స్, కెరొటినాయిడ్స్ శరీర ఆరోగ్యాన్ని అనుక్షణం కాపాడతాయి. ఒక్కసారే పొట్టపగిలేలా తినడం కంటే వీలైనంతవరకు రోజుకు నాలుగైదుసార్లు పరిమితంగా తినడం అవసరం. ఆరోగ్యంగా ఉంటేనే ఎక్కువగా శ్రమించగలుగుతామనే నిజాన్ని ప్రతి ఒక్కరూ గమనించాలి.

ఒత్తిడికి దూరంగా ఉండాలి



ప్రస్తుత సమాజంలో అన్ని వయసుల వారు ఎదుర్కొంటున్న అతి పెద్ద సమస్య మానసిక ఒత్తిడి. ప్రతి మనిషికి ఏదో రూపంలో ఈ ఒత్తిడి అనేది ఉంటుంది. ఒక సమస్యను ఏ దృష్టితో చూస్తున్నారనేదాన్ని బట్టి ఒత్తిడి ఉంటుంది. కొందరు చిన్న సమస్యలను కూడా అదేపనిగా భూతద్ధంలో చూసుకోవడం, లేని దానిని కూడా సమస్యగా ఊహించుకుని ఒత్తిడికి గురౌతుంటారు. వీరి ప్రవర్తన ఇటు ఇంట్లో వాళ్లతో పాటు అటు ఫ్రెండ్స్, ఆఫీసులోని సహచరులపై కూడా ప్రభావాన్ని చూపిస్తుంది. ఇలాంటి వారు మానసిక ఒత్తిడికి ఉపశమనం అనే అపోహతో సిగరెట్, తాగుడు, గుట్కా, జర్దా లాంటి వ్యసనాలకు వాటికి బానిసలైపోతారు శారీరక అనారోగ్యాన్ని కొనితెచ్చుకుంటారు. ఈ చెడు అలవాట్ల వల్ల ఒత్తిడి ఏ మాత్రం కూడా తగ్గదు. పని భారంగా ఉందనిపిస్తే దాన్ని తోటి ఉద్యోగులతో షేర్ చేసుకోవాలి. కాస్త సమయం తీసుకోవాలి. పూర్తి చేయాల్సిన పనికి తగిన సమయం లేకపోతే ఎవరైనా సరే కాస్త ఒత్తిడికి లోనవడం సహజమే. ఒత్తిడి నుంచి బయటపడడం సాధన చేస్తే, మానసికంగానే కాదు, శారీరకంగా కూడా ఆరోగ్యం మీ సొంతమౌతుంది.

పిల్లల ఆరోగ్యంపై శ్రద్ధ



పిల్లల ఆహారపు అలవాట్లు వారి ఆరోగ్యం మీద ప్రభావాన్ని చూపిస్తాయి, క్రమబద్ధంగా తినడం మీద వారి శరీరంలోని ప్రధానంగా మెదడులోని చక్కెర స్థాయి ఆధారపడుతుంది. శరీరం, మెదడు, సక్రమంగా పని చెయ్యాలంటే ఈ చక్కెరస్థాయి స్థిరంగా ఉండాలి. ఫ్యాషన్ కోసమో, ఏదైనా వ్యాధి కారణంగానో తక్కువ తినడం, లేదా మరీ ఎక్కుగా తినడం అజీర్తికి, స్థూలకాయానికి దారితీస్తుంది. శరీరంలో అవసరానికి మించి చక్కెర ఉండడంవల్ల మెదడు సరిగ్గా పనిచేయదు. పోషక విలువలు లేని జంక్ ఫుడ్స్ తినడం వల్ల బలహీనమౌతారు. వ్యాధి నిరోధకశక్తి తగ్గిపోతుంది. క్రమం లేకుండా తినడం, చాలా గంటలపాటు తినకుండా తరువాత ఒక్కసారే తినడం వల్ల శరీరంలోనూ, మెదడులోనూ అకస్మాత్తుగా చక్కెర ఎక్కువవుతుంది. దీని వలన నీరసంగా, అలసటగా, మత్తుగా అనిపి స్తుంది. దానితో కౌమార బాలలు చురుగ్గా పనిచేయలేరు.



ఆరోగ్యంగా జీవించడానికి ఎన్ని రకాలు మార్గాలున్నాయో... అన్ని రకాల ప్రణాళికలూ ఉన్నాయి. అయితే వాటిలో నిత్య జీవితంలో ఆచరించదగినవి కొన్ని మాత్రమే. ఈ ఆరోగ్య ప్రణాళికలో భాగంగా లక్ష్యాన్ని నిర్ధేశించుకుంటేనే సరిపోదు. ఆ లక్ష్య సాధనలకు చాలా శ్రమించాల్సి ఉంటుంది. మరి కొంతమంది ఆలోచనల్లో అయితే జిమ్‌లకు వెళ్లి అక్కడ సాధన చేస్తే మంచిదని, కఠినమైన యోగాసనాలు చేసి కడుపు మాడ్చుకుని కష్టపడితే గానీ ఆరోగ్యాన్ని, ఫిట్‌నెస్‌ని కాపాడుకోలేమని భావిస్తుంటారు. నిజానికి ఇందులో వాస్తవం లేదు. ఆరోగ్యానికి అనుకున్నంతగా ఈ విధానాలు మేలుచేయవు. చాలామంది ఆరోగ్యం విషయంలో ఎన్నో రకాల నిర్ణయాలు తీసుకున్నా వాటిని కానీ ఆచరణలో పెట్టడానికి రేపు, మాపు అని వాయిదాలతో బద్ధకిస్తుంటారు. నిత్య జీవితంలో భాగమైన నీరు, ఆహారం, వ్యాయామం వంటి వాటిలో తగిన శ్రద్ధ తీసుకోవడం కూడా ఆరోగ్య ప్రణాళికలో ఒక భాగమే




తగినంత నిద్ర

తగినంత నిద్ర లేకపోవడం అనారోగ్యానికి పునాదిగా మారుతోంది. చాలామంది ఆఫీసు, బిజినెస్ అంటూ పనిలో పడి నిద్రాహారాలు మానేస్తున్నారు. దీనివల్ల తరచూ అనారోగ్యానికి గురౌతున్నారు. అయితే శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా, ఉల్లాసంగా, ఉత్సాహంగా ఉండాలంటే రోజుకు కనీసం 7 నుంచి 8 గంటల పాటు నిద్రపోవాలి. సరిపడేటంత నిద్ర ఉంటేనే శరీరంతో పాటు మెదడుకి కూడా చాలా విశ్రాంతి లభిస్తుంది. శక్తి రీ జనరేట్ అవుతుంది. రెండింతలు ఎక్కువగా పనిచేయగలుగుతారు. ఈ విషయంలో నిద్రని నిర్లక్ష్యం చేస్తూ చాలామంది తరచూ అనారోగ్యానికి గురవుతున్నారు. అందుకే రోజూ నిర్ణీత సమయం పాటు నిద్రపోవాలన్నది ఆరోగ్య ప్రణాళికలో తప్పని సరిగా చేర్చుకోవాలి.

క్రమబద్ధమైన వ్యాయామం

ఆరోగ్యానికి క్రమబద్ధమైన వ్యాయామం అవసరం. డాక్టర్లు రోజూ చేయమన్నారుగా అనే రీతిలో మొక్కుబడిగా చేసే వ్యాయామం వల్ల ఆరోగ్యానికి ఏమీ ఫలితం ఉండదు. నడకైనా, ప్రాణాయామమైనా ఒక క్రమబద్ధంగా చేయాలి. శరీర ఆకృతిని అందంగా తీర్చిదిద్దే క్రమంలో అధిక కొవ్వును వ్యాయామం ద్వారా చాలావరకు తగ్గించుకోవచ్చు. రక్తంలో ఉండే బీపీ, షుగర్ స్థాయిలను కూడా వ్యాయామమే నియంత్రణలో ఉంచగలదు. ఏ వయసు వారైనా.. ఎలాంటి వారైనా సరే తేలికగా చేసే వ్యాయామం నడక. ఇది చాలా తేలికగా సరదాగా సాగిపోతుంది. దీనివల్ల అధిక కొలెస్ట్రాల్, బీపీ, షుగర్ లెవల్స్ లాంటివే కాకుండా మానసిక ఒత్తిడి దూరమై ఉల్లాసంగా, ఉత్సాహంగా ఎక్కువ కాలం ఆరోగ్యంగా ఉంటారు. ఆరోగ్య సమస్యలను దూరంగా ఉంచాలన్నా ఆరోగ్య ప్రణాళికలో వ్యాయామం ఉండాల్సిందే.



వృద్ధుల ఆరోగ్యం కీలకం

వయసు పెరుగుతున్న కొద్దీ అనారోగ్యాలు ఏదో రూపంలో చుట్టుముట్టడం సహజమే. అయితే వృద్ధుల ఈ తమ దైనందిన జీవితంలో చిన్నచిన్న మార్పులు చేసుకోవటం ద్వారా వ్యాధుల బారినడకుండా చూసుకోవటంతో పాటు తమ జీవితాన్ని ఆరోగ్యంగా ఉంచుకోవాలి. ముఖ్యంగా శరీర అవయవాలను నిత్యం ఉప యోగిస్తుంటేనే అవి ఆరోగ్యకరంగా ఉంటాయన్న నిజాన్ని గుర్తించాలి. అందుకే శరీరానికీ, మెదడుకూ రోజూ తగినంత శ్రమ, వ్యాయామం ఉండేలా చూసుకోవాలి. ఆహారం, వ్యాయామం, ముఖ్యంగా పరిశుభ్రతల మీద శ్రద్ధ చూపాలి. చాలామంది ఓపిక లేక పరిశుభ్రత



విషయంలో రాజీపడుతుంటారు. ఇదే పెద్దపెద్ద సమస్యలకు దారి తీస్తుంది. పొగాకు ఏ రూపంలోనూ తీసుకోకూడదు, మద్యానికి వీలైనంత దూరంగా ఉండాలి. బరువు పెరగకుండా చూసుకోవాలి. పెరిగిన బరువుని తగ్గించుకోవడం కూడా చాలా ముఖ్యం. ఆహారంలో మాంసకృత్తులు, కొవ్వులు తగినంత ఉండేలా చూసుకోవాలి. నిత్యం 30 నిమిషాలకు తగ్గకుండా నడక అవసరం. మోకాళ్ల నొప్పులుంటే వైద్యుని సలహా మేరకు వ్యాయామాలు చేయాలి. క్రమం తప్పకుండా బీపీ, సుగర్, కొలెస్ట్రాల్ పరీక్షలు, ముందస్తుగా క్యాన్సర్ చెకప్ చేయిస్తుండడం కూడా ఆరోగ్య ప్రణాళికలో భాగంగా కలుపుకోవాలి.

మహిళల ఆరోగ్య ప్రణాళికే కీలకం

మహిళలు కూడా తగిన ఆరోగ్య ప్రణాళికను రూపొందించుకోవాలి. సమాజంలో శారీరకంగా, మానసికంగా అనారోగ్యాలకు గురౌతున్నవారిలో మహిళలే ఎక్కువగా ఉన్నారు. అందరికీ నిర్ధేశించిన ఆరోగ్య ప్రణాళికను మహిళలు అనుసరిస్తూనే బాలికలు, మహిళలు, గర్భిణులు ఎవరికి వారే ఆరోగ్య ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలి. ముఖ్యంగా గర్భిణులు ప్రసవ సమయంలో సమస్యల్ని తట్టుకోవటానికి, గర్భంలోని శిశువు ఆరోగ్యంగా ఎదగడానికి తగిన సమతుల్య ఆహారం అదనంగా తీసుకోవాలి. శిశువులో వేగంగా జరిగే పెరుగుదలకు పోషకాలు పాల ద్వారా తల్లి నుంచే బిడ్డకు చేరతాయి. అందువల్ల తల్లి తన గర్భంలో ఉన్న బిడ్డ అవసరాలకు సరిపడా తినడమే కాక తన అవసరాలకు కూడా సరిపోయే విధంగా ఆహారాన్ని తీసుకోవాలి. బిడ్డ పెరుగుతున్నప్పుడు తల్లి ఆరోగ్యం మీద పోషకాహార లోప ప్రభావం ఎక్కువగా ఉంటుంది. ఇది రక్తహీనతకు దారితీస్తుంది. దీని ఫలితంగా చాలా సమస్యలుంటాయి. మహిళలు అన్ని దశల్లోనూ తగిన ఆరోగ్య ప్రణాళిను రూపకల్పన చేసుకుని తప్పని సరిగా ఆచరించాలి.



పడుకునేటప్పుడు ఫోన్ పక్కనుంటే..?



స్మార్ట్‌ఫోన్ చేతిలో ఉంటే చాలామంది అదే లోకంగా దానితోనే గడుపుతుంటారు. ఎక్కడికెళ్లినా ఫోన్ వదులరు. ఆఖరికి పడుకునేటప్పుడు కూడా ఫోన్ పక్కన ఉండాల్సిందే. అలాంటి వారికి క్యాన్సర్ వచ్చే ప్రమాదం తప్పదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. స్మార్ట్‌ఫోన్ నుంచి విడుదలయ్యే రేడియో తరంగాలకు వీలైనంత దూరంగా ఉండాలి. చార్జింగ్ పెట్టుకొని ఫోన్ మాట్లాడడం వల్ల అధికస్థాయిలో రేడియేషన్ విడుదలవుతుంది. అప్పుడు పొగలు రావడం, ఫోన్ పేలిపోవడం జరుగుతుంది. అధిక రేడియేషన్ వల్ల తీవ్రమైన అనారోగ్యాలు వస్తాయని హెచ్చరిస్తున్నారు. మొబైల్ రేడియేషన్ వల్ల వచ్చే అతిపెద్ద ప్రమాదాల్లో ఒకటి క్యాన్సర్. ఇప్పటికే చాలామంది స్మార్ట్‌ఫోన్ వాడకందారులు క్యాన్సర్ బారినపడినట్లు పలు అధ్యయనాలు చెబుతున్నాయి. దీంతో పలు మొబైల్ కంపెనీలు మొబైల్ డివైజ్‌లతో పాటు ఇచ్చే సెట్‌లో హెచ్చరిస్తున్నారు. మనం అవేం చదువం కాబట్టి తెలియదు. ఫోన్ ఎక్కువగా మాట్లాడటం వల్ల వినికిడి సమస్యలు ఎక్కువగా వస్తున్నాయి. సాధ్యమైనంత వరకూ స్మార్ట్‌ఫోన్ వాడకానికి చాలా దూరంగా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు.

బరువు వేగంగా తగ్గాలా?

నేటి తరుణంలో అధిక బరువు తగ్గడం అనేది చాలా మందికి ఎంత సమస్యగా మారిందో అందరికీ తెలిసిందే. రాత్రికి రాత్రే బరువు తగ్గడం అనేది కుదరని పని అని కూడా అందరికీ తెలుసు. ఈ క్రమంలో బరువును తగ్గించుకునేందుకు అందరూ నానా అవస్థలు పడుతున్నారు. నిత్యం వ్యాయామం చేయడం, పౌష్టికాహారం తీసుకోవడం వంటి పనులు చేస్తున్నారు. అయితే ఇవే కాకుండా కింద ఇచ్చిన పలు టిప్స్‌ను పాటిస్తే దాంతో అధిక బరువును వేగంగా తగ్గించుకునేందుకు వీలుంటుంది. బరువు తగ్గవచ్చని చెప్పి చాలా మంది ఉదయం చేసే బ్రేక్‌ఫాస్ట్‌ను మానేస్తుంటారు. కానీ ఇలా చేయరాదు. ఎందుకంటే ఉదయం బ్రేక్‌ఫాస్ట్‌ను మానేయడం వల్ల రోజులో మిగిలిన సమయంలో మరింత ఎక్కువ ఫుడ్‌ను లాగించేస్తారని పలు అధ్యయనాలు చెబుతున్నాయి. కనుక ఉదయం బ్రేక్‌ఫాస్ట్‌ను ఎట్టి పరిస్థితిలోనూ మానేయరాదు. కాకపోతే అందులో కార్బొహైడ్రేట్స్ కాకుండా, ప్రోటీన్లు, ఫైబర్ ఎక్కువగా ఉండే ఆహారాలను తింటే మంచిది.



ప్రతీకారం కోసం భారత్

- నేడు లంకతో కీలక పోరు, ట్రై సిరీస్

కొలంబో: ట్రై సిరీస్ ట్వంటీ-20 టోర్నమెంట్‌లో భాగంగా సోమవారం జరిగే కీలక మ్యాచ్‌లో భారత్ అతిథ్య శ్రీలంక జట్టుతో తలపడనుంది. తొలి మ్యాచ్‌లో లంక చేతిలో ఎదురైన ఓటమికి ప్రతీకారం తీర్చుకోవాలనే లక్ష్యంతో టీమిండియా ఈ మ్యాచ్‌కు సిద్ధమైంది. మరోవైపు బంగ్లాదేశ్‌తో శనివారం జరిగిన మ్యాచ్‌లో ఓటమి పాలైన లంకకు ఈ మ్యాచ్ కీలకంగా మారింది. తొలి మ్యాచ్‌లో భారత్‌ను ఓడించిన లంక ఈ సారి కూడా అదే సంప్రదాయాన్ని కొనసాగించేందుకు తహతహలాడుతోంది. అయితే రెండో మ్యాచ్లో బంగాదేశ్‌పై ఘన విజయం సాధించిన టీమిండియా జోరుమీదుంది. అంతేగాక తొలి మ్యాచ్‌లో ఓడించిన లంకపై బదులు తీర్చుకునేందుకు అత్రుతతో ఎదురు చూస్తోంది. రెండు జట్లు కూడా విజయమే లక్ష్యంగా పెట్టుకోవడంతో ఈ పోరు కూడా హోరాహోరీగా సాగడం ఖాయం. కాగా, టోర్నీలో భాగంగా ఇప్పటి వరకు మూడు మ్యాచులు జరిగాయి. ఇందులో శ్రీలంక, భారత్, బంగ్లాదేశ్ ఒక్కో మ్యాచ్‌లో విజయం సాధించడంతో ఫైనల్ రేసు ఆసక్తికరంగా మారింది. ఇదిలావుండగా, ఈ మ్యాచ్‌లోనూ కూడా గెలిచి ఫైనల్ బెర్త్‌ను మరింత పదిలం చేసుకోవాలనే లక్ష్యంతో ఇరు జట్లు ఉన్నాయి.

రోహిత్ ఈ సారైనా..

వరుస వైఫల్యాలతో సతమతమవుతున్న భారత స్టార్ ఓపెనర్ రోహిత్ శర్మ ఈ మ్యాచ్‌లోనైన మెరిస్తాడా.. ఈ ముక్కోణపు సిరీస్‌లో జరిగిన రెండు మ్యాచుల్లో కూడా రోహిత్ విఫలమయ్యాడు. తొలి మ్యాచ్‌లో డకౌట్ అయిన రోహిత్ రెండో మ్యాచ్‌లో కూడా నిరాశ పరిచాడు. వరుస వైఫల్యాల నేపథ్యంలో రోహిత్ తీవ్ర ఒత్తిడికి గురవుతున్నాడు. అతని వైఫల్యాలపై మాజీ క్రికెటర్లు, నెటిజన్లు, అభిమానులు సైతం తీవ్ర విమర్శలు గుప్పిస్తున్నారు. అయితే ఇప్పుడు వీరి విమర్శలకు బ్యాట్‌తో సమాధానం చెప్పేందుకు రోహిత్ సిద్ధమయ్యాడు. మరోవైపు శిఖర్ ధావన్ భీకర ఫాంలో ఉండడం భారత్‌కు కలసి వచ్చే అంశం. ఈ కీలక మ్యాచ్‌లో బ్యాటింగ్, బౌలింగ్ రెండు విభాగాల్లోనూ రాణిస్తే భారత్ విజయం ఖాయం.

జట్ల వివరాలు

భారత్: రోహిత్ శర్మ (కెప్టెన్), శిఖర్ ధావన్, లోకేష్ రాహుల్, మనీష్ పాండే, దినేష్ కార్తీక్, దీపక్ హుడా, సుందర్, చాహల్, అక్షర్ పటేల్, శార్దూల్ ఠాకుర్, ఉనద్కట్, మహ్మద్ సిరాజ్, రిషబ్ పంత్.

శ్రీలంక: దినేశ్ చండీమల్ (కెప్టెన్), ఉపుల్ తరంగ, దనుష్క గుణతిలక, కుశాల్ మెండిస్, శనక, కుశాల్ పెరీరా, జీవన్ మెండిస్, లక్మల్, ఇసురు ఉడనా, అఖిల ధనంజయ, అపొన్సొ, నువాన్ ప్రదీప్, చమీరా, ధనంజయ డిసిల్వా, తిసారా పెరీరా.



సాయంత్రం 7 గంటల నుంచి డి స్పోర్ట్స్ చానెల్‌లో ప్రత్యక్ష ప్రసారం



అఖిల్ షెరాన్‌కు స్వర్ణం

- 'యంగ్ షూటర్స్'పై బింద్రా ప్రశంసలు



మెక్సికో: ఐఎస్ఎస్ఎఫ్ షూటింగ్ ప్రపంచకప్‌లో ఆదివారం యువ ఆటగాడు అఖిల్ షెరాన్ పురుషుల 50 మీటర్ల రైఫిల్ 3 పొజిషన్ పోటీలో స్వర్ణ పతకం గెలుచుకున్నాడు. దీంతో ఇప్పటి వరకు భారత్ నాలుగు స్వర్ణాలు, ఒక రజతం, నాలుగు కాంస్య పతకాలను సాధించింది. షహజర్ రిజ్వీ, మను భకర్, మెహుల్, అంజుమ్ ముద్గిల్ భారత్‌ను అగ్రస్థానంలో నిలిపారు.

మెక్సికోలో జరుగుతున్న ప్రపంచకప్‌లో భారత యంగ్ గన్స్ అదరగొడుతున్న భారత ఆటగాళ్లపై ఒలింపిక్ స్వర్ణ పతక విజేత అభినవ్ బింద్రా ప్రశంసల వర్షం కురిపించాడు. ప్రపంచకప్‌లో తొలిసారి భారత్ పతకాల పట్టికలో అగ్రస్థానంలో నిలిచేందుకు అవకాశాలు సృష్టించుకోవడం గొప్ప విషయమన్నాడు. ఈ సందర్భంగా బింద్రా మాట్లాడాడు. 'మెక్సికోలో జరుగుతున్న ప్రపంచకప్‌లో భారత ప్రదర్శన దేశ షూటింగ్‌లో నవశకానికి నాంది. భరత భవిష్యత్తు సురక్షితమైన చేతుల్లో ఉంది. ఒలింపిక్ పోడియంపై అగ్రస్థానంలో నిలిచే సత్తా మన యువ క్రీడాకారులకు ఉందని నాకు విశ్వాసం ఉంది. ప్రపంచకప్ విజేతలకు అభినందనలు. పతకాలు సాధించేందుకు యువ ప్రతిభను గుర్తించి వారికి తీర్చిదిద్దిన జూనియర్ జట్టు కోచ్‌లకు, సహాయక సిబ్బందికి ప్రత్యేక అభినందనలు తెలిపాడు. వారి కృషి వల్లే నేడు భారత్ పతకాలు అద్భుత ఫలితాలు సాధిస్తున్నదని బింద్రా హర్షం వ్యక్తం చేశాడు.



వీనస్‌తో సెరెనా పోరు

ఇండియన్‌వెల్స్: చాలా కాలం తర్వాత మళ్లీ రాకెట్ పట్టిన అమెరికా దిగ్గజం సెరెనా విలియమ్స్ ప్రతిష్టాత్మకమైన బిఎన్‌పి పరిబాస్ ఓపెన్ టెన్నిస్ టోర్నమెంట్‌లో మూడో రౌండ్‌కు దూసుకెళ్లింది. ఈ క్రమంలో మూడో రౌండ్‌లో తన సోదరి వీనస్ విలియమ్స్‌తో సమరానికి సిద్ధమైంది. హోరాహోరీగా సాగిన రెండో రౌండ్‌లో మాజీ నంబర్‌వన్ సెరెనా 7-6(5), 7-5 తేడాతో డచ్ క్రీడాకారిణి కికి బెర్టెన్స్‌ను ఓడించింది. ఇటీవల ఓ బిడ్డకు జన్మనిచ్చిన సెరెనా చాలా రోజుల తర్వాత మళ్లీ బరిలోకి దిగింది. కాగా, ఆడిన తొలి టోర్నమెంట్‌లోనే స్ఫూర్తిదాయక ఆటతో ఆకట్టుకుంది. బెర్టెన్స్‌తో జరిగిన పోరులో తీవ్ర పోటీ నెలకొన్నా చివరి వరకు పట్టుదలతో ఆడుతూ విజయాన్ని అందుకుంది. 23 సార్లు గ్రాండ్‌స్లామ్స్ విజేతగా నిలిచిన సెరెనా తర్వాతి రౌండ్‌లో సోదరి వీనస్‌తో తలపడుతుంది. 1998 తర్వాత వీరిద్దరూ ఓ టోర్నమెంట్‌లో మూడో రౌండ్‌లో తలపడడం ఇదే తొలిసారి కావడం విశేషం. రెండో రౌండ్‌లో వీనస్ రుమేనియా క్రీడాకారిణి సొరానా క్రిస్టినా ఓడించింది. ఏకపక్షంగా సాగిన పోరులో వీనస్ 6-3, 6-4తో విజయం సాధించింది. కాగా, సోదరి వీనస్‌తో పోరుకు ఎంతో ఆతృతతో ఎదురు చూస్తున్నట్లు సెరెనా తెలిపింది. వీరిద్దరూ చివరి సారిగా 2017లో ఆస్ట్రేలియా ఓపెన్ ఫైనల్లో తలపడ్డారు. ఆ ఫైనల్లో సెరెనా విజయం సాధించింది. ఇద్దరి మధ్య జరిగిన మ్యాచుల్లో సెరెనాదే పైచేయిగా ఉంది. సెరెనా 17 సార్లు విజయం సాధించగా, వీనస్ కేవలం 11 సార్లు మాత్రమే జయకేతనం ఎగుర వేసింది.

సత్తా చాటని యువ క్రికెటర్లు

చాన్స్ దొరికినా ఫలితం లేదు



క్రీడా విభాగం: ప్రపంచ క్రికెట్‌లో టీమిండియా ఎదురులేని శక్తిగా మారింది. విరాట్ కోహ్లీ, భువనేశ్వర్ కుమార్, రోహిత్ శర్మ, యజువేంద్ర చాహల్, శిఖర్ ధావన్, బుమ్రా వంటి మ్యాచ్ విన్నర్లతో భారత్ వరుస విజయాలు సాధిస్తోంది. అయితే భారత్ సాధిస్తున్న విజయాల్లో సీనియర్లదే కీలక పాత్ర. ముఖ్యంగా బ్యాటింగ్ పరంగా చూస్తే జట్టు భారాన్ని మొత్తం కోహ్లీనే మోస్తున్నాడని చెప్పడంలో అతిశయోక్తి లేదు. రోహిత్ శర్మ అడపాదడపా తప్ప నిలకడగా రాణించిన ఉదంతాలు చాలా తక్కువే. అయితే కోహ్లీ తర్వాత ఒక్క శిఖర్ ధావన్ మాత్రమే నిలకడైన బ్యాటింగ్‌ను కనబరుస్తున్నాడు. ఇక, టీమిండియా శ్రీలంక ముక్కోణపు టోర్నమెంట్‌లో సీనియర్లకు విశ్రాంతి ఇచ్చి యువ ఆటగాళ్లకు అవకాశం కల్పించింది. రిషబ్ పంత్, విజయ్ శంకర్, శార్దూల్ ఠాకూర్, జైదేవ్ ఉనద్కట్ వంటి జూనియర్లకు ఛాన్స్ ఇచ్చింది. అయితే ఇప్పటి వరకు జరిగిన రెండు మ్యాచ్‌ల్లో కూడా యువ ఆటగాళ్లు ఆశించిన స్థాయిలో ఆడలేదనే చెప్పాలి. అందివచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని భవిష్యత్తులో జట్టును స్థానాన్ని పదిలం చేసుకోవాల్సిన యువ ఆటగాళ్లు ఇందులో విఫలమయ్యారనే చెప్పాలి. రెండో టీ20లోనూ రిషబ్ పంత్ విఫలమయ్యాడు. భవిష్యత్తులో ధోని వారసుడిగా పరిగణిస్తున్న రిషబ్ సెలెక్టర్లు తనపై ఉంచిన నమ్మకాన్ని వృథా చేశాడనే చెప్పాలి. తొలి మ్యాచ్‌లో వేగంగా ఆడడంలో విఫలమయ్యాడు. అతని వైఫల్యం జట్టును వెంటాడింది. కనీసం మిగిలిన మ్యాచుల్లోనైనా అతను రాణించాల్సిన అవసరం ఎంతైన ఉంది. ఇక, దక్షిణాఫ్రికా సిరీస్‌లో వన్డే, టీ20 జట్టులో చోటు సంపాదించిన మరో యువ ఆటగాడు శ్రేయస్ అయ్యర్ కూడా అందివచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవడంలో విఫలమయ్యాడు. సిరీస్‌లో చాలా మ్యాచ్‌లు ఆడిన శ్రేయస్ స్థాయికి తగ్గ బ్యాటింగ్‌ను కనబరచ లేక పోయాడు. దీంతో ముక్కోణపు టోర్నీలో జట్టుకు ఎంపిక కూడా కాలేక పోయాడు. ఐపీఎల్‌లో అదరగొడుతున్న అయ్యర్, పంత్‌లు జాతీయ జట్టుకు వచ్చే సరికి ఆ జోరును కొనసాగించడంలో విఫలమవుతున్నారు. మరో యువ ఆటగాడు మనీస్ పాండేది కూడా అదే తీరు. చాలా కాలంగా జట్టులో ఉంటున్నా ఫలితం లేకుండా పోయింది. కీలక సమయంలో వేగంగా ఆడడంలో విఫలమవుతున్నాడు. ముక్కోణపు టోర్నీలో ఆడిన రెండు మ్యాచ్‌ల్లోనూ ఆశించిన విధంగా రాణించలేక పోయాడు. అతని వైఫల్యం జట్టును కలవర పెట్టేదే. కేదార్ జాదవ్ కూడా తన స్థాయికి తగ్గ ఆటను కనపరచడంలో విఫలమయ్యాడు. ఒకటి రెండు మ్యాచుల్లో తప్ప అతను రాణించిన దాఖలలు లేవనే చెప్పాలి. జట్టులో స్థానం కోసం విపరీత పోటీ నెలకొన్న ప్రస్తుత తరుణంలో యువ ఆటగాళ్లు వరుస వైఫల్యాలు చవిచూడడం జట్టు యాజమాన్యాన్ని కలవర పాటుకు గురి చేస్తోంది.

బౌలర్లదీ అదే తీరు...

ఇక, బౌలింగ్‌లో కూడా యువ క్రికెటర్లది ఇదే తీరు. జైదేవ్ ఉనద్కట్, శార్దూల్ ఠాకూర్, మహ్మద్ సిరాజ్, హార్దిక్ పాండ్య, విజయ్ శంకర్ తదితరులకు సెలెక్టర్లు పరీక్షించారు. అయితే ఒకటి అర మ్యాచుల్లో తప్ప వీరు రాణించింది లేదు. సిరాజ్ అయితే ఆడిన అన్ని మ్యాచుల్లోనూ విఫలమయ్యాడు. ఉనద్కట్ కూడా ఆశించిన స్థాయిలో రాణించలేక పోతున్నాడు. కొంతకాలంగా యజువేంద్ర చాహల్ కూడా గాడి తప్పాడు. దక్షిణాఫ్రికాతో జరిగిన టీ20 తర్వాత చాహల్ చాలా పేలవంగా బౌలింగ్ చేస్తున్నాడని చెప్పడంలో అతిశయోక్తి లేదు. బారీ పరుగులు ఇచ్చుకోవడమే కాకుండా వికెట్లు తీయడంలో కూడా విఫలమవుతున్నాడు. అతని వైఫల్యం జట్టుకు తీవ్రంగా పరిణమించింది. పొదుపుగా బౌలింగ్ చేయలేక పోతున్నాడు. ప్రత్యర్థి బౌలర్లు అతని బౌలింగ్‌లో స్వేచ్ఛగా పరుగులు దండుకుంటున్న తీరు ఆందోళన కలిగిస్తోంది. ఇక, కుల్దీప్ యాదవ్‌ది అదే తీరు. అతను కూడా వన్డే సిరీస్ తర్వాత లయ తప్పాడు. అతని బౌలింగ్‌తో సఫారీ బ్యాట్స్‌మెన్ ఓ ఆట ఆడుకున్న విషయం తెలిసిందే. ఇక, చాలా కాలంగా జట్టులో ఉంటున్నా హార్దిక్ పాండ్య కూడా స్థాయికి తగ్గ ఆటను కనబరచడం లేదు. బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో అతను విఫలమవుతున్నాడు. తరచు విఫలమవుతున్నా అతన్ని ఎందుకు ఆడిస్తున్నారో ఎవరికి అంతు బట్టకుండా మారింది. ఈ సిరీస్‌లో అతనికి విశ్రాంతి ఇచ్చి సెలెక్టర్లు కాస్త మంచి పనే చేశారని చెప్పాలి. పేరుకే ఆల్‌రౌండర్ కానీ జట్టుకు అండగా నిలిచింది చాలా అరుదుగానే ఒకటి అర తప్ప హార్దిక్ జట్టును ఆదుకున్నది లేనే లేదు. జూనియర్లు ఇలా ఉంటే సీనియర్లు కూడా విఫలమవుతున్నారు. సురేశ్ రైనా, రోహిత్ శర్మ, దినేష్ కార్తీక్, అజింక్య రహానే తదితరులు కూడా తరచు వైఫల్యాలు చవిచూస్తున్నారు. రైనా శ్రీలంకతో జరుగుతున్న ముక్కోణపు టోర్నీలో ఆశించిన విధంగా రాణించ లేక పోతున్నాడు. రెండు మ్యాచ్‌ల్లో కూడా నిరాశ పరిచాడు. రహానెది కూడా ఇటువంటి పరిస్థితే, దక్షిణాఫ్రికా సిరీస్‌లో రహానె ఘోరంగా విఫలమయ్యాడు. ఇక, అందరికంటే ఎక్కువ నిరాశ పరుస్తుంది రోహిత్ శర్మనే.మూడు ఫార్మాట్లలో జట్టుకు ప్రాతినిథ్యం వహిస్తున్న రోహిత్ ఒకటి రెండు మ్యాచ్‌ల్లో తప్ప పెద్దగా రాణించలేక పోయాడు. అతని వైఫల్యం జట్టుకు తీవ్రంగా పరిణమించింది. రానున్న ప్రపం చకప్ నేపథ్యంలో ఇలాంటి పరిస్థితి భారత్‌కు ఏ మాత్రం మం చిది కాదని విశ్లేషకులు, మాజీ క్రికెటర్లు హెచ్చరిస్తున్నారు. ఈ విషయంపై సెలెక్టర్లు, జట్టు యాజమాన్యం దృష్టి సారించాల్సి అవసరం ఎంతైన ఉంది.

మహిళల హాకీ చివరి మ్యాచ్ డ్రా

3-1తో భారత్‌కు సిరీస్

సియోల్: భారత్-దక్షిణ కొరియా మహిళల మధ్య జరిగిన చివరి హాకీ మ్యాచ్ డ్రాగా ముగిసింది. ఆదివారం జరిగిన ఐదో మ్యాచ్‌లో రెండు జట్లు 1-1 గోల్స్ నమోదు చేయడంతో ఈ మ్యాచ్ ఫలితం తేలకుండా డ్రా అయింది. రెండు దేశాల మధ్య జరిగిన 5 మ్యాచ్‌ల సిరీస్‌ను 3-1తో భారత మహిళల జట్టు కైవసం చేసుకుంది. ఈ సిరీస్‌లో భారత మహిళలు అద్భుత ఆటను కనబర్చారు. 9వ ర్యాంకర్ దక్షిణ కొరియాను చిత్తు చేశారు. భారత జట్టులో రాణి రాంపాల్ అసాధరణ ప్రతిభను కనబర్చి అందరిని ఆకట్టుకుంది. అతిథ్య దక్షిణ కొరియాను 3-1తో ఓడించి సిరీస్‌ను సొంతం చేసుకోవడం సంతోషంగా ఉందని భారత సారథి రాణి రాంపాల్ తెలిపింది. సియోల్‌లో ఆదివారం జరిగిన మ్యాచ్‌లో రెండు జట్లు హోరాహోరీగా తలపడ్డాయి. ఆరంభంలో భారత జట్టు దూకుడును కనబర్చితే, తర్వాత కొరియా కూడా ఎదురుదాడులకు దిగింది. కానీ, ఇరు జట్ల గోల్ కీపర్లు దాడులను సమర్థంగా అడ్డుకొన్నారు. మ్యాచ్ మొదటి అర్ధ భాగం ముగిసే సరికి రెండు జట్లు ఒక గోల్ కూడా చేయలేక పోయారు. అయితే రెండో అర్ధ భాగంలో మాత్రం కొరియాకు మంచి అవకాశాలు లభించాయి. రెండు సార్లు పెనాల్టీ కార్నర్లు లభించిన వాటిని గోల్స్‌గా మల్చుకోలేక పోయింది. భారత గోల్‌కీపర్ రజని ఎటిమర్పు అద్భుతంగా అడ్డుకుంది. మ్యాచ్ 41వ నిమిషంలో భారత్‌కు లభించిన పెనాల్టీ కార్నర్‌ను మీజిన్ హన్ అడ్డుకుంది. అయితే మ్యాచ్ 48వ నిమిషంలో వందన భారత్‌కు తొలి గోల్ అందించింది. రాణి రాంపాల్ అందించిన సెర్విస్‌ను వందన గోల్‌గా మల్చింది. దీంతో భారత్ 1-0 ఆధిక్యంలో దూసుకెళ్లింది. తర్వాత కొద్ది సేపట్లోనే కొరియా కూడా గోల్ సాధించి ఆధిక్యాన్ని 1-1తో సమం చేసింది. 50వ నిమిషంలో బోమి కిమ్ గోల్ చేసింది. అయితే చివరి సేషన్ ముగిసే సరికి గోల్స్ నమోదుకాక పోవడంతో మ్యాచ్ 1-1తో డ్రాగా ముగిసింది.



న్యూజిలాండ్ మహిళల క్లీన్ స్వీప్

మూడో వన్డేలోనూ ఓడిన విండీస్



క్రిస్ట్‌చర్చ్: ఐసీసీ వుమెన్స్ చాంపియన్‌షిప్‌లో భాగంగా వెస్టిండీస్ మహిళలతో జరిగిన మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌ను న్యూజిలాండ్ మహిళల జట్టు 3-0తో క్లీన్ స్వీప్ చేసింది. ఈ విజయంతో న్యూజిలాండ్ చాంపియన్‌షిప్ పాయింట్ల పట్టికలో అగ్ర స్థానంలో నిలిచింది. మొత్తం 6 మ్యాచ్లు ఆడిన న్యూజిలాండ్ 5 విజయాలతో 10 పాయింట్స్ సాధించి ఫస్ట్ ప్లేస్‌లో నిలిచింది. విండీస్ 6 పాయింట్స్, భారత్ 4 నాలుగు పాయింట్స్, ఆస్ట్రేలియా 4 పాయింట్స్‌తో తర్వాతి స్థానాల్లో ఉన్నారు. విండీస్ ఆరు మ్యాచ్‌లు ఆడింది. భారత్, ఆస్ట్రేలియా మూడు,మూడు మ్యాచ్‌లు మాత్రమే ఆడారు. నేటి నుంచి భారత్-ఆస్ట్రేలియాల మధ్య మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్ జరుగనుంది.

ఆదివారం జరిగిన చివరి మ్యాచ్‌లో సోఫీ డెవిన్ ఆల్‌రౌండర్ ప్రతిభ కనబర్చడంతో కివీస్ 205 పరుగులతో భారీ విజయాన్ని నమోదు చేసుకుంది. తొలుత బ్యాటింగ్ చేసిన న్యూజిలాండ్‌కు ఆరంభంలోనే షాక్ తగిలింది. 16 పరుగులకే తొలి వికెట్‌ను కోల్పోయిన కివీస్‌ను తర్వాత కెప్టెన్ సూజి బాట్స్ (89), సటెర్త్‌వైట్ (69) అర్ధ శతకాలతో ఆదుకున్నారు. వీరిద్దరు రెండో వికెట్‌కు 151 పరుగుల కీలక భాగస్వామ్యాన్ని నెలకొల్పి జట్టు భారీ స్కోరుకు పునాది వేశారు. చివర్లో చెలరేగి ఆడిన సోఫీ డెవిన్ 58 బంతుల్లో 6 ఫోర్లతో 73 పరుగులు చేసింది. దీంతో 50 ఓవర్లలో కివీస్ జట్టు 5 వికెట్లు కోల్పోయి 310 పరుగుల భారీ స్కోరును సాధించింది. విండీస్ బౌలర్లలో డొట్టిన్‌కు రెండు, కొన్నెల్‌కు ఒక వికెట్ లభించింది. తర్వాత భారీ లక్ష్యాన్ని ఛేదించడానికి బ్యాటింగ్‌కు దిగిన వెస్టిండీస్‌కు ఆరంభనుంచే కష్టాలు మొదలయ్యాయి. కివీస్ బౌలర్లను ఎదుర్కొవడంలో విండీస్ బ్యాట్స్ వుమెన్ తడబడ్డారు. దీంతో వీరు వరుసాక్రమంలో వికెట్లు కోల్పోయారు. విండీస్ కెప్టెన్ స్టెఫిన్ టేలర్ (26) తప్ప మిగతా వారు ఘరంగా విఫలమయ్యారు. దీంతో విండీస్ జట్టు (34.5 ఓవర్లలో) కేవలం 105 పరుగులకే కుప్పకూలి భారీ ఓటమిని మూటకట్టుకుంది. బ్యాటింగ్‌లో రాణించిన సోఫీ డెవిన్ బౌలింగ్‌లో కూడా మూడు వికెట్లు పడగొట్టి ఆల్‌రౌండర్ ప్రతిభ కనబర్చింది.

Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam publications private limited, Printed at JAGATI PUBLICATIONS LIMITED, Sakshi Press, Survey No:127, Plot No:12, Mallapur Village, Nacharam, Medchal District.Telangana state and Published From H.No:6-3-864/4/B, SBN Arcade,4th&5th Floor, Green lands, Opp: Green Park Hotel, Hyderabad - 500016 Telangana State, EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.TELTEL/2016/72952. Phone No.040-46519999. E-mail Id: editor@manamnews.com.